శనివారం 20-5-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 58



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





The Perfect Life, Styled for You!

2, 3 & 4 BHK Flats

@ Centrally located in Narsingi,
Near Financial District

Starting at ₹1.73 Cr.*







Children's Play Area | Fitness Centres | Sports Arenas
Yoga & Meditation Deck | Supermarket | Swimming Pool
Pharmacy | Spa & Salon | Party Lawn & Halls

*T&C Apply

Unflinching Commitment to Customers Delight earns us Recognition & Laurels



INDIAN ACHIEVERS AWARDS 2023

SRI YERRAM VIJAY KUMAR
CHAIRMAN & MD, VASAVI GROUP
RECEIVING THE AWARD FROM
HON'BLE MINISTER FOR ROAD TRANSPORT & HIGHWAYS IN THE GOVERNMENT OF INDIA
SRI NITIN GADKARI

- Trusted Developer of The Year 2022
- Best Ultra Luxury Apartment Ongoing Vasavi Skyla 2022
- Exemplary Contribution to Real Estate Hyderabad 2021
- Premium Affordable Project of the Year 2021
- Trusted Developer of the Year 2019

A Legacy of 3 Decades of Trust and Quality


- **50** Million sft. to be built in the next 5 years
- **17** Commercial Projects
- **310** Acres of Villa plots sold
- **8** Million sft. built
- **4510** Apartments built till date
- **30** Residential Projects

Vasavi Atlantis, Narsingi,
Near Financial District, Hyderabad.
www.vasaviatlantis.com

TS RERA: P02400003398

📞 95335 14444

Disclaimer: This Advertisement does not constitute an offer and / or acceptance / or contract / or agreement and / or transaction and / or any intention thereof and / or a disclosure under any statute of any nature whatsoever. The pictorial / other representation herein, the layout, number of buildings / towers / wings / structures, facilities and amenities are merely creative and an Architect's impression and are only indicative. Actual product may vary / differ from what is indicated herein. The photograph contained herein may be stock / standard photography used for the purpose and have been taken at a location other than the project site and are used to indicate a conceptual lifestyle. **All norms, requirements pertaining to the environment, Fire Services, HMDA Rules and Regulations have been adhered to while designing the property.**



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 58

శనివారం 20-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సుప్రీం జడ్జిగా జస్టిస్ పీకే మిశ్రా ప్రమాణం

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ పీకే మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ ప్రమాణం చేశారు. వీరితో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. జస్టిస్ పీకే మిశ్రా ఆగస్ట్ 2029 వరకూ, జస్టిస్ కేవీ విశ్వనాథన్ మే 25, 2031 వరకూ సేవలందించనున్నారు.

6లో



కర్ణాటక కేబినెట్ ప్రమాణం నేడే

కర్ణాటకలో కాంగ్రెస్ మంత్రివర్గం శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనుంది.

- వివరాలు 6లో



ఒరిజినల్స్ సమర్పించండి

ఐఏఎస్ అధికారి హత్య కేసులో మాజీ ఎంపీ ఆనంద్ శిక్షాకాలం తగ్గింపుపై ఒరిజినల్ రికార్డులు సమర్పించాలని సుప్రీం ఆదేశించింది.

- వివరాలు 6లో



చురుగ్గా నైరుతి..

నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, అండమాన్‌లోకి ప్రవేశించాయని ఐఎండీ తెలిపింది.

- వివరాలు 6లో



అంత్యక్రియల ఖర్చు 1,655 కోట్లు

క్వీన్ ఎలిజబెత్–2 అంత్యక్రియలకు రూ. 1,655 కోట్లు ఖర్చయినట్లు బ్రిటన్ కోశాగార విభాగం వెల్లడించింది.

- వివరాలు 6లో

రూ.2 వేల నోటుపై వేటు

చెలామణీ నుంచి ఉపసంహరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనూహ్య నిర్ణయం

- క్లీన్ నోట్ పాలసీ ప్రకారం ఉపసంహరిస్తున్నట్లు ప్రకటన
- 23వ తేదీ నుంచి బ్యాంకుల్లో డిపాజిట్‌కు, మార్చుకునేందుకు ప్రజలకు అవకాశం
- సెప్టెంబర్ 30 వరకు గడువు
- ఒకదఫా రూ.20,000 పరిమితి వరకే ఇతర డినామినేషన్లలోకి మార్చుకునేందుకు చాన్స్

ఆ నిర్ణయంతో... అతలాకుతలం

అప్పట్లో దేశాన్ని కుదిపేసిన రూ.1,000, 500 నోట్ల రద్దు

6లో

ముంబై

నల్లధనం కట్టడి పేరిట పెద్ద నోట్లను రద్దు చేసి రూ.2,000 నోటును తెచ్చిన మోదీ సర్కారు.. అనూహ్యంగా దానికి కూడా చెక్ చెప్పింది. రూ.2,000 నోటును చెలామణీ నుంచి పూర్తిగా ఉపసంహరిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ప్రకటించింది. 'వివిధ అంశాలను దృష్టిలో ఉంచుకుని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 'క్లీన్ నోట్ పాలసీ' (డిజిటల్ విధాన ప్రోత్సాహం) ప్రకారం రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణీ నుంచి ఉపసంహరించుకోవాలని నిర్ణయించడం జరిగింది..' అని ప్రకటనలో పేర్కొంది. తక్షణమే రూ.2,000 నోట్లను జారీ చేయడాన్ని నిలిపివేయాల్సిందిగా బ్యాంకులను కోరినట్లు తెలిపింది. అయితే ఈ నోట్లను ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవడానికి లేదా బ్యాంకుల్లో మార్చుకోవడానికి మే 23వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రజలకు సమయం ఇచ్చింది. ఒకదఫా రూ.20,000 పరిమితి వరకూ (అంటే రూ.2,000 నోట్లు 10) ఇతర డినామినేషన్లలోకి మార్చుకోవచ్చని తెలిపింది. అలాగే మే 23 నుంచి ఇష్యూ డిపార్ట్‌మెంట్‌లను కలిగి ఉన్న 19 ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయాల్లో (ఆర్‌వో) కూడా ఒకేసారి రూ.20,000 పరిమితి వరకు మార్చుకునే సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు పేర్కొంది. కాగా నల్లధనం నిల్వలను పెంచుకునేందుకు అత్యధిక విలువ కలిగిన నోట్లను ఉపయోగిస్తున్నారనే ఆందోళనల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ అనూహ్య చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది.

2018–19లోనే ముద్రణ నిలిపివేత

పాత రూ.500, రూ.1,000 నోట్ల రద్దు సమయంలోనే రూ.2,000 నోటును ప్రవేశపెట్టడం



జరిగింది. అప్పట్లో చెలామణీలో ఉన్న రూ. 500, రూ.1,000 నోట్ల చట్టబద్ధమైన చెల్లుబాటును ఉపసంహరించుకున్న తర్వాత, ఆర్థిక వ్యవస్థలో కరెన్సీ అవసరాన్ని త్వరితగతిన తీర్చడానికి ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే 2018–19లోనే ఆర్‌బీఐ రూ.2,000నోట్ల ముద్రణను నిలిపివేసింది. ఈ నోట్లు ఇప్పటికే అరుదుగా చెలామణీలో ఉన్నాయి.

అవసరాలకు ప్రస్తుత కరెన్సీ స్టాక్ ఓకే..

రూ. 2,000 నోటును ప్రస్తుతం సాధారణ లావాదేవీలకు వినియోగించడం లేదని తాము

మిగతా 2వ పేజీలో ▶

సందేహాలొద్దు సమాధానాలివిగో

ఈ నోట్లు చెల్లుతాయా?

2016 నవంబర్‌లో పాత రూ.500, రూ.1,000 నోట్ల రద్దు చేసిన సందర్భంలో ఆ నోట్లు తక్షణమే చెల్లకుండా పోయాయి. దీంతో చాలా మందిలో దీనిపై సందేహాలు నెలకొన్నాయి. అయితే, ఈసారి సెప్టెంబర్ 30 వరకూ రూ.2,000 నోటు లీగల్ టెండర్ కొనసాగనుంది. అంటే ఈ నోటు సాంకేతికంగా అప్పటివరకూ చెల్లుబాటులోనే ఉంటుందని అర్థం. సాధారణ లావాదేవీలకు రూ.2 వేల నోట్లను వినియోగించవచ్చని ఆర్‌బీఐ తెలిపింది. అలాగే వాటిని స్వీకరించవచ్చు కూడా. అయితే, 2023 సెప్టెంబర్ 30లోగా మీ వద్ద ఉన్న ఆ నోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయాలి లేదా

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మహబూబ్‌నగర్ వరకు విశాఖ-కాచిగూడ రైలు



సాక్షి, హైదరాబాద్: విశాఖ-కాచిగూడ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12861/12862)ను మహబూబ్‌నగర్ వరకు పొడిగించనున్నారు. మహబూబ్‌నగర్ రైల్వేస్టేషన్‌లో శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి జెండా ఊపి ఈ రైలును ప్రారంభిస్తారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొంటారు. దీంతో మహబూబ్‌నగర్ నుండి కోస్తా ఆంధ్ర వరకు మొట్టమొదటిసారిగా రైల్ కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. మహబూబ్‌నగర్ నుంచి నేరుగా ఆంధ్రప్రదేశ్‌లోని రాయనపాడు (విజయవాడ), ఏలూరు, రాజమండ్రి, అన్నవరం, విశాఖపట్నం వంటి ప్రధాన నగరాలకు ప్రయాణ సదుపాయం లభించనుంది. జడ్చర్ల, షాద్‌నగర్, ఉందానగర్ రైల్వేస్టేషన్లలో హాల్ట్ ఉంటుంది.

కాచిగూడ-నర్సాపూర్ మధ్య ప్రత్యేక రైలు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కాచిగూడ-నర్సాపూర్ (07653/07654) మధ్య స్పెషల్ ట్రైన్ నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25, జూన్ 1న ఈ రైలు కాచిగూడలో బయలుదేరి మరుసటి రోజుకు నర్సాపూర్ చేరుకుంటుంది. ఈ నెల 26, జూన్ 2 తేదీల్లో నర్సాపూర్ నుంచి బయల్దేరుతుంది.

కాచిగూడ-నాగర్‌సోల్ మధ్య ప్రత్యేక రైళ్లు
కాచిగూడ-నాగర్‌సోల్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నారు. ఈ రైలు ఈనెల 26, జూన్ 2, 9, 16, 23, 30 తేదీల్లో కాచిగూడ నుంచి బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 28, జూన్ 4, 11, 18, 25 తేదీల్లో నాగర్‌సోల్ నుంచి కాచిగూడ చేరుకోనుంది.

ఆ భూములు వెనక్కి తీసుకుంటాం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నవాబుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో 24 లక్షల ఎకరాల భూమిని నిరుపేదలకు అందిస్తే.. వాటిని కేసీఆర్ ప్రభుత్వం లాక్కొని బహుళ జాతి కంపెనీలకు ధారాదత్తం చేశారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మండిపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఆ భూములను వెనక్కి తీసుకునేలా అసెంబ్లీలో ప్రత్యేక చట్టం చేసి తిరిగి రైతులకు అప్పగిస్తామని చెప్పారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడు రోజుల పాటు విరామం ప్రకటించి మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం రుక్కంపల్లి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న భట్టిని పలువురు కాంగ్రెస్ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఇకపై ఎవరూ అసైన్డ్ భూములు కొనవద్దని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ...ఇందిరమ్మ పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను లాక్కునే హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. పేదల బతుకుదెరువు కోసం ఇందిరమ్మ ఇచ్చిన భూములు కొనడం చట్టవిరుద్ధమని చెప్పారు. పరిశ్రమల పేరుతో అసైన్డ్ భూములను బడా వ్యాపారులకు కట్టబెడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

ఎన్నికల వేళ కేసీఆర్ 'నయా' వంచన

వైఎస్సార్ టీపీ అధినేత్రి షర్మిల ధ్వజం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల వేళ కేసీఆర్ 'నయా'వంచనకు తెరతీశారని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఒక ప్రకటనలో విమర్శించారు. తొమ్మిదేళ్లుగా బీసీలకు కేటాయించిన నిధులు పక్కదారి పట్టించడమే కాకుండా.. రూ.55 వేల కోట్ల బడ్జెట్ అంటూ రూపాయి విదిలించలేదని పేర్కొన్నారు. అయిదేళ్ల కింద హామీ ఇచ్చిన 'బీసీ సబ్ ప్లాన్' అటకెక్కిందని తెలిపారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ.3 వేల కోట్లు కేటాయిస్తే.. రూ.3 కోట్లు కూడా ఖర్చు చేయలేదని ఎద్దేవా చేశారు. 50 శాతం రిజర్వేషన్లు పెంచాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైందని విమర్శించారు. బీసీల ఆత్మగౌరవ భవనాలు పునాదులు దాటలేదన్నారు. బీసీల కుల గణన అంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి తెర చాటున కేంద్రంతో లాలూచీ పడ్డారని ఆరోపించారు.

బీసీ ఉద్యోగుల జాతీయ మహాసభలు రేపు: ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్/కాచిగూడ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 21న తిరుపతిలోని ఎస్‌బీ వర్సిటీలో బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీల ఉద్యమానికి ఉద్యోగులు న్యాయకత్వం వహించాలని సూచించారు. దేశంలో 56% జనాభా ఉన్న బీసీలు కులాల పేరుతో విడిపోవడం వల్ల డిమాండ్లు సాధించలేకపోతున్నామన్నా రు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో జరిగిన బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలోనూ కృష్ణయ్య మాట్లాడారు. బీసీలు ఎవరూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నమ్మడం లేదని, ముందుగా 'బీసీ బంధు'ను ప్రకటించి ఒక్కొక్క కుటుంబానికి రూ.10లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అవినాశ్ తల్లికి తీవ్ర అస్వస్థత

పులివెందుల ఆస్పత్రిలో ప్రథమ చికిత్స

- హైదరాబాద్ తరలిస్తుండగా పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రికి..
- హుటాహుటిన హైదరాబాద్ నుంచి కర్నూలు చేరుకున్న అవినాశ్
- మానవత్వం లేకుండా ఎల్లో మీడియా దుష్ప్రచారం..



వైఎస్ అవినాశ్‌రెడ్డి తల్లి ఆరోగ్య వివరాలను మీడియాకు వివరిస్తున్న డాక్టర్ హితేష్ రెడ్డి

సాక్షి ప్రతినిధి కర్నూలు, పులివెందుల: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి తీవ్ర అనారోగ్యంతో కర్నూలు విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కార్డియాక్ ఎంజైమ్స్ సాధారణం కంటే ఎక్కువ ఉండటంతో ఆమె ఆరోగ్యం విషమించింది. వైద్యులు ఆమె ఆరోగ్యాన్ని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. అవినాశ్ దగ్గరుండి తల్లి బాగోగులు చూసుకుంటున్నారు. కాగా ఈ వ్యవహారంపై ఎల్లో మీడియా శుక్రవారం మధ్యాహ్నం నుంచి తప్పుడు కథనాలను ప్రసారం చేసింది. పులివెందుల భాకరాపురంలోని తమ నివాసంలో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మికి ఉదయం ఛాతీ లో నొప్పి రావడంతో సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో స్థానికంగా ఉన్న దినేశ్ నర్సింగ్ హోంలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నందున మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. ఈ క్రమంలో అంబులెన్స్‌లో బయల్దేరగా పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రిలో చేర్పించారు. కార్డియాక్ నిపుణుడు హితేశ్‌రెడ్డి, జనరల్ ఫిజీషియన్ రవికళాధర్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీలక్ష్మికి చికిత్స అందిస్తున్నారు. రక్త పరీక్షలతో పాటు గుండె పరీక్షలు చేశారు. మరిన్ని పరీక్షలు చేయాల్సి రావడంతో వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు భారీగా ఆస్పత్రికి తరలి వచ్చారు.

మానవత్వం లేకుండా వెంటాడిన వైనం
శుక్రవారం సీబీఐ విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్‌లోని నివాసం నుంచి బయల్దేరిన ఎంపీ అవినాశ్‌రెడ్డి తన తల్లి శ్రీలక్ష్మి అనారోగ్యం గురించి తెలియడంతో దర్యాప్తు అధికారులకు న్యాయవాది ద్వారా సమాచారం అందచేసి హుటాహుటిన ప్రయాణమయ్యారు. అవినాశ్‌ను అదుపులోకి తీసుకునేందుకు సీబీఐ అధికారులు కర్నూలు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద నిరీక్షిస్తున్నట్లు టీడీపీ అనుకూల మీడియా ప్రచారం చేసింది. ఎల్లో మీడియా ప్రతినిధులు చెక్‌పోస్టు వద్దే కాపుకాసి అవినాశ్ కాన్వాయ్‌ను వెంటాడారు. మధ్యాహ్నం 1.12 గంటల సమయంలో అవినాశ్ చెక్‌పోస్టు దాటి పులివెందుల మార్గంలో వెళ్లారు. అనంతరం తాడిపత్రి సమీపంలోని చుక్కలూరు వద్ద అంబులెన్స్‌లో తల్లిని చూసి అవినాశ్ కంటతడి పెట్టారు. పులివెందుల వెళ్లకుండా తిరిగి తల్లితో పాటు హైదరాబాద్ వచ్చేందుకు సిద్ధమయ్యారు. అయితే శ్రీలక్ష్మి పరిస్థితి విషమించడంతో కర్నూలులోని విశ్వభారతి ఆస్పత్రికి తరలించారు. దీంతో ఎల్లో మీడియా మరో దుష్ప్రచారానికి తెర తీసింది. శ్రీలక్ష్మి ఆరోగ్యంగానే ఉన్నారని, సీబీఐ అరెస్టు నుంచి తప్పించుకునేందుకు అవినాశ్ ప్రయత్నిస్తున్నారంటూ మానవత్వం లేకుండా చానళ్లలో చర్చలు నిర్వహించింది.

పరిస్థితి ఆందోళనకరం
శ్రీలక్ష్మి అనారోగ్యంపై భిన్న కథనాల నేపథ్యంలో విశ్వభారతి ఆస్పత్రి గుండె వైద్య నిపుణుడు హితేశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఛాతీలో నొప్పి వచ్చి శ్రీలక్ష్మి కిందపడిపోయారు. లో బీపీ అని భావించి పులివెందుల ఆస్పత్రిలో చేర్పించారు. తరువాత కర్నూలు తీసుకొచ్చారు. ఈసీజీ చేస్తే మార్పులు కనిపించాయి. కొన్ని పరీక్షలు చేశాం. రిపోర్టులు రాలేదు. కార్డియాక్ ఎంజైమ్స్‌లో మార్పులు వచ్చాయి. సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇది ఆందోళనకర పరిస్థితి. మరిన్ని పరీక్షలు చేయాల్సి ఉంది. యాంజియోగ్రామ్ కూడా చేస్తాం. ఎంజైమ్స్ పెరుగుతూ ఉన్నందున ప్రతి రెండు గంటలకు ఒకసారి పరీక్షలు చేయాలి. ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది' అని పేర్కొన్నారు.

విచారణకు సంపూర్ణ సహకారం

- సీబీఐ విచారణకు హాజరయ్యేందుకే అవినాశ్ హైదరాబాద్ వచ్చారు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మండిపాటు



సాక్షి, అమరావతి: సీబీఐ విచారణకు ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పూర్తిగా సహకరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. సీబీఐ విచారణకు హాజరయ్యేందుకే అవినాశ్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లారన్నారు. అయితే తన తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం అందడంతో అదే విషయాన్ని సీబీఐ అధికారులకు తెలియచేసి పరామర్శించేందుకు పులివెందుల బయల్దేరారని చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. శుక్రవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడారు. సీబీఐ అధికారులు పిలిచిన ప్రతిసారీ వైఎస్ అవినాశ్‌రెడ్డి విచారణకు హాజరవుతున్నారని గుర్తు చేశారు. అవినాశ్ ఎక్కడికీ పారిపోవడం లేదని, తప్పించుకోవాల్సిన అవసరం ఆయనకు లేదన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, ఆ పార్టీ నేతలు, వైఎస్ సునీత, ఎల్లో మీడియా అంతా కలిసి అవినాశ్‌పై బురద జల్లుతూ దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీబీఐ ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరయ్యేందుకు అవినాశ్ సిద్ధంగా ఉన్నారన్నారు. వివేకానందరెడ్డిని తానే నరికానని అంగీకరించినోడేమో రోడ్డుపై తిరుగుతూ సెటిల్‌మెంట్లు చేస్తుంటే.. ఈ హత్య కేసుతో ఎలాంటి సంబంధం లేని వారిని మాత్రం వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.

మీడియా వెంబడించడం ఏమిటి?
తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు అబద్ధాలు సృష్టించాల్సిన దౌర్భాగ్యం అవినాశ్‌కు లేదంటూ ఓ ఓ ప్రశ్నకు సమాధానంగా సజ్జల పేర్కొన్నారు. తల్లిని చూసేందుకు అవినాశ్ పులివెందుల వెళ్తుంటే ఆయన పారిపోతున్నట్లుగా మీడియా వెంబడించడాన్ని తప్పుబట్టారు. అవినాశ్ వాహనాన్ని వెంబడిస్తున్న మీడియాపై దాడి జరగడం దురదృష్టకరమన్నారు. వివేకా హత్య కేసులో అవినాశ్‌రెడ్డి ప్రమేయం ఉంటే అప్పట్లో అధికారంలో ఉన్న చంద్రబాబు ఆయన్ను వదిలేవారా? అని ప్రశ్నించారు.

తాగునీటిలో 20 శాతమే లెక్కించాలి

- తుంగభద్ర నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో కర్ణాటక
- అది అర్థం లేని వాదనంటూ ఏపీ అభ్యంతరం

సాక్షి, హైదరాబాద్: తాగునీటి అవసరాల కోసం తీసుకునే నీటిని 20% మాత్రమే లెక్కించాలని కర్ణాటక విజ్ఞప్తి చేసింది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం తాగునీటికి 10 టీఎంసీలు తీసుకుంటే అందులో 8 టీఎంసీల రిటర్న్ ఉంటుందని పేర్కొంది., అందువల్ల 20% పరిగణించాలని కర్ణాటక పట్టుబట్టింది. శుక్రవారం హైదరాబాద్‌లో చైర్మన్ డీఎం రాయి సహరే అధ్యక్షతన తుంగభద్ర నదీ యాజమాన్య బోర్డు సమావేశం జరిగింది. తాగునీటి అవసరాలకు 20% లెక్కించాలనే అంశంపై ఏపీ అభ్యంతరం వ్యక్తం చేయగా, బచావత్ ట్రిబ్యునల్ అమల్లోకి వచ్చిన పరిస్థితులు వేరు.. ప్రస్తుత పరిస్థితులు వేరనీ నీటి అవసరాలు పెరిగినందునేనని కర్ణాటక గుర్తు చేసింది. 20% పరిగణించాలంటే రిటర్న్ కూడా లెక్కించాల్సి ఉంటుందని, ఆ ఏర్పాట్లు లేకుండా ఆ వాదనకు అర్థం లేదని ఏపీ పేర్కొంది.

తెలంగాణ కూడా అదే అంశంపై..
తుంగభద్ర బోర్డు చైర్మన్ డీఎం రాయి సహరే స్పందిస్తూ కృష్ణా బోర్డు సమావేశంలోనూ ఇదే అంశాన్ని తెలంగాణ లేవనెత్తిందని తెలిపారు. తుంగభద్ర బోర్డు సమావేశంలో కర్ణాటక లేవనెత్తిన అంశాలతో పాటు కృష్ణాబోర్డు సమావేశంలో తెలంగాణ లేవనెత్తిన అంశంపై తగిన నిర్ణయం తీసుకోవాలని కేంద్ర నీటి వనరుల శాఖకు లేఖ రాయనున్నట్లు రాయి సహరే తెలియజేశారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని, వాటా మేరకు నీరు తెలంగాణకు రావడం లేదని తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్ కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఆర్డీఎస్ ఆధునీకరణకు ముందు... కేంద్ర నీటి విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్)తో అధ్యయనం చేయించాలని కృష్ణాబోర్డులో నిర్ణయించినట్టు చెప్పారు. ఆ అధ్యయనం నివేదిక అందాక ఆధునీకరణపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

అసలు కట్టప్పలు వేరే ఉన్నారు: ఉత్తమ్



కోదాడ: సామాజిక మాధ్యమాల్లో తనతో పాటు తన సతీమణి పద్మావతిపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తమ వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే విధంగా పోస్టింగ్‌లు పెడుతున్నారని, దీని వెనుక పార్టీకి చెందిన ముఖ్యుల హస్తం ఉందని నల్లగొండ ఎంపీ ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్‌లలో జరిగిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఫిర్యాదుతో అరెస్టయిన వారు చిన్న వారని, వారి వెనుక ఉన్న అసలు కట్టప్పలు త్వరలో బయటకు వస్తారన్నారు. తన సతీమణి పద్మావతి ఎయిర్‌పోర్టులో యాదృచ్ఛికంగా కొంత మంది బీఆర్ఎస్ మహిళా నేతలను కలుసుకుంటే.. ఆమె బీఆర్ఎస్ నేతలకు ఢిల్లీలో వసతి కల్పించారంటూ ఎయిర్‌పోర్టు ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టి తప్పుడు ప్రచారం చేశారని ఉత్తమ్ అన్నారు. కొంత కాలంగా తమను కావాలనే బదనాం చేస్తున్నారని, వారిని వదిలేది లేదని స్పష్టంచేశారు. తాను ఏనాడూ అవినీతికి పాల్పడలేదన్నారు. 'మీ అందరికీ తెలుసు. మాకు పిల్లలు లేరు. మీరే మా కుటుంబం అని రాజకీయం చేస్తున్నాం. మాకు వేరే వ్యాపకం, వ్యాపారం లేదు. 24 గంటలూ ప్రజా జీవితం, రాజకీయమే'అని ఆయన తెలిపారు.

కోదాడలో 50 వేల మెజారిటీ రావాలి..
రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సమష్టిగా పనిచేసి అధికార పార్టీని చిత్తుగా ఓడిద్దామని ఉత్తమ్ పిలుపునిచ్చారు. కోదాడలో 50 వేల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలని, 50 వేలకు ఒక్క ఓటు తక్కువ వచ్చినా తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు. ఈ సమావేశాలలో మాజీ ఎమ్మెల్యే పద్మావతి, డీసీసీ అధ్యక్షుడు వెంకన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.


మహిళా ఉద్యోగినుల భద్రతకు 'సాహస్'

పోర్టల్‌ను ప్రారంభించిన హోంమంత్రి మహమూద్ అలీ

సాక్షి, హైదరాబాద్: దేశంలో శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్రం అగ్రభాగంలో ఉన్నందునే తెలంగాణలో ఉద్యోగం చేసే మహిళల సంఖ్య అధికంగా ఉందని రాష్ట్ర హోంశాఖ మంత్రి మహమ్మద్ మహమూద్ అలీ అన్నారు. పనిచేసేచోట మహిళా ఉద్యోగినుల భద్రతకోసం రాష్ట మహిళా భద్రతా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ 'సాహస్'పోర్టల్‌ను డీజీపీ అంజనీకుమార్, అడిషనల్ డీజీ శిఖాగోయల్‌తో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ.. వర్క్‌ప్లేసెస్‌లో మహిళలపై జరుగుతున్న వేధింపులకు 'సాహస్'తో చెక్ పెట్టవచ్చన్నారు. డీజీపీ అంజనీ కుమార్ మాట్లాడుతూ.. 'సాహస్'రాష్ట మహిళా భద్రతా విభాగంలో మరో మైలురాయని కొనియాడారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, ఐజీ రమేశ్‌రెడ్డి, 2020 మిస్ ఇండియా మానస, సీబీఐ చైర్మన్ సి.శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, 'సాహస్'పోర్టల్ పనితీరు గురించి తెలుసుకునేందుకు https://womensafetywing.telangana.gov. in/sahas వెబ్‌సైట్‌కి లాగిన్ అవ్వొచ్చు. లేదా 7331194540 నంబర్‌కు వాట్సప్ చేయవచ్చు.

ఉగ్రవాదులపై అటవీ చట్టం!

- సన్నాహాలు చేస్తున్న మధ్యప్రదేశ్ ఏటీఎస్
- భోపాల్‌కు చెందిన పర్యావరణవేత్త సూచన మేరకు నిర్ణయం
- ఉగ్రవాదులు అడవుల్లో ఫైరింగ్ ప్రాక్టీస్ చేసినట్టు ఆరోపణలు



భోపాల్ కోర్టులోకి వెళ్తున్న ఉగ్రవాదులు (ఫైల్)

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు ఈ నెల 9న హైదరాబాద్‌తో పాటు భోపాల్‌లో అరెస్టు చేసిన ఉగ్రవాదులపై అటవీ శాఖ చట్టం కిందా అభియోగాలు చేయనున్నారు. భోపాల్‌కు చెందిన ఓ పర్యావరణవేత్త ఇచ్చిన సూచన మేరకు ఏటీఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఉగ్రవాద సంబంధిత కేసుల్లో పోలీసులు సాధారణంగా.. చట్ట విరుద్ధ కార్యకలాపాల (నిరోధక) చట్టం–1967లోని వివిధ సెక్షన్ల కింద ఆరోపణలు చేస్తారు. ఆ ఉగ్రవాదుల వ్యవహారశైలి, చేసిన విధ్వంసాలు తదితరాలను పరిగణనలోకి తీసుకుని ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), ఆయుధ చట్టం, పేలుడు పదార్థాల చట్టంతో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్‌లోని సెక్షన్ల కిందా ఆరోపణలు చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్-భోపాల్ మాడ్యుల్స్‌పై మాత్రం అటవీ చట్టంలోని సెక్షన్లనూ జోడించాలని మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఏటీఎస్ నిర్ణయించింది. ఈ ఉగ్రవాదులు భోపాల్ శివార్లలోని రైసెన్ అడవుల్లో తుపాకీ కాల్చడాన్ని ప్రాక్టీసు చేశారు. హైదరాబాద్ నుంచి వెళ్లిన సలీం తదితరులు కూడా ఇందులో పాల్గొన్నారు. అటవీ చట్టాల ప్రకారం కొన్ని ప్రాంతాల్లోకి ముందస్తు అనుమతి లేకుండా ప్రవేశించడం నేరం. అలా వెళ్లడమే కాకుండా నిషిద్ధ ప్రాంతంలో తుపాకులు వాడినందుకు వీరిపై అటవీ చట్టాల ప్రకారం ఆరోపణలు చేయడమే కాదు, అభియోగాలు సైతం మోపి విచారణ జరిగేలా చర్యలు తీసుకోవాలంటూ ఏటీఎస్‌కు శుక్రవారం ఓ లేఖ అందింది. భోపాల్‌కు చెందిన ఓ పర్యావరణవేత్త దీన్ని రాశారు. ఈ లేఖను పరిగణనలోకి తీసుకున్న ఏటీఎస్ ఆ చట్టంలోని సెక్షన్లను చేర్చాలని నిర్ణయించింది.

10 మంది పోలీసు కస్టడీ పొడిగింపు
హైదరాబాద్, భోపాల్‌లలో అరెస్టు చేసిన 16 మంది ఉగ్రవాదుల పోలీసు కస్టడీ గడువు శుక్రవారంతో ముగియడంతో ఏటీఎస్ అధికారులు వీరిని భోపాల్‌లోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టారు. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉన్నందున కస్టడీ గడువు మరో పది రోజులు పొడిగించాలని కోరారు. దీన్ని పరిశీలించిన న్యాయమూర్తి రఘువీర్ యాదవ్ 10 మంది కస్టడీని ఈ నెల 24 వరకు పొడిగించారు. ఆరుగురికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. కస్టడీ పొడిగించిన వారిలో సలీం, రెహమాన్, యాసిర్ ఖాన్ తదితరులు ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. వీరిని మరోసారి హైదరాబాద్‌కు తీసుకువస్తారా? సిద్దిపేటలో సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేస్తారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

వరల్డ్ టాప్ వర్సిటీల్లో

హెచ్‌సీయూ, ఐఐటీ-హైదరాబాద్

- సీడబ్ల్యూయూఆర్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణలోని వర్సిటీలకు చోటు
- టాప్ 2 వేల యూనివర్సిటీల్లో దేశం నుంచి 64



హెచ్‌సీయూ



వైస్‌చాన్స్‌లర్ బీజేరావు

సాక్షి, న్యూఢిల్లీ: సెంటర్ ఫర్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ (సీడబ్ల్యూయూఆర్)-2023లో తెలంగాణ నుంచి రెండు యూనివర్సిటీలు చోటు సంపాదించుకున్నాయి. మొదటి 2 వేల యూనివర్సిటీల్లో దేశం నుంచి 64 యూనివర్సిటీలు టాప్ ర్యాంకుల్లో ఉండగా, తెలంగాణ నుంచి యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ 1,265వ ర్యాంకు, ఐఐటీ–హైదరాబాద్ 1,373వ ర్యాంకు సాధించాయి. గత ఏడాది ర్యాంకులతో పోలిస్తే హెచ్‌సీయూ 7 ర్యాంకులు కిందకు పడిపోగా, ఐఐటీ-హైదరాబాద్ మాత్రం 68 స్థానాలు పైకి ఎగబాకింది. దేశంలో ఐఐటీ–అహ్మదాబాద్ 419 ర్యాంకుతో టాప్‌లో ఉండగా తర్వాతి స్థానాల్లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఐఐటీ–మద్రాస్ ఉన్నాయి. ఇక వరల్డ్ టాప్ వర్సిటీల్లో హార్వర్డ్ యూనివర్సిటీ నంబర్‌వన్‌గా నిలిచింది. విద్య నాణ్యత, ఉపాధి, అధ్యాపకుల నాణ్యత, పరిశోధన పనితీరు ఆధారంగా ఈ ర్యాంకులను ప్రకటించింది. పరిశోధనల్లో వెనకబాటుతో పాటు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం కారణంగా దేశ యూనివర్సిటీలు వెనకబడ్డాయని సీడబ్ల్యూయూఆర్ నివేదిక వెల్లడించింది.

దేశంలో నాల్గోస్థానం
రాయదుర్గం: దేశంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నిలిచింది. 'ది వీక్ హన్సా'పరిశోధన సర్వే–2023లో దేశంలోని టాప్ 85 మల్టీ డిసిప్లినరీ వర్సిటీల్లో రాష్ట్ర, సెంట్రల్, ప్రైవేట్, డీమ్డ్ వర్సిటీల్లో హెచ్‌సీయూ నాల్గోస్థానంలో నిలిచింది. 2022లో ఐదో స్థానంలో ఉండగా ఈ సంవత్సరం ఒక స్థానం పైకి ఎగబాకింది. దక్షిణాదిలోని టాప్ మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల్లో మొదటి స్థానంలో ఉంది. అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అధికార యంత్రాంగం, సిబ్బంది సమష్టి కృషి వల్లే ఇది సాధ్యమైందని, భవిష్యత్తులో టాప్‌లో నిలిచేందుకు ప్రయత్నం చేస్తామని వీసీ ప్రొఫెసర్ బీజేరావు తెలిపారు.

రాష్ట్రంలో రెండ్రోజులు సాధారణ ఉష్ణోగ్రతలే

కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

సాక్షి, హైదరాబాద్: తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ వివరించింది. దీని ప్రభావంతో రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో తూర్పు, దక్షిణ ప్రాంత జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు, కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్రవారం రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నల్లగొండ జిల్లా దామెరచర్లలో 45.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. శుక్రవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ఠ ఉష్ణోగ్రత నల్లగొండలో 42.5 డిగ్రీల చొప్పున నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత మెదక్‌లో 25.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. రాష్ట్రానికి వాయవ్య దిశ నుంచి తక్కువ ఎత్తులో గాలులు వీస్తున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.

శుక్రవారం రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ఠ ఉష్ణోగ్రత
దామెరచర్ల	నల్లగొండ	45.4
వీణవంక	కరీంనగర్	45.4
కడ్తంపెడ్దూర్	నిర్మల్	45.4
జన్నారం	మంచిర్యాల	44.9
మామిళ్లగూడెం	సూర్యాపేట్	44.8

వడదెబ్బకు ముగ్గురు మృతి..
అశ్వారావుపేట రూరల్: ఒకే గ్రామ పరిధిలో వడదెబ్బకు గురై ముగ్గురు వ్యక్తులు శుక్రవారం మృతి చెందారు. కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం వినాయకపురం కాలనీ గ్రామానికి చెందిన అచ్చె రామారావు (75) ఎండవేడితో తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబసభ్యులు ఆస్పత్రి తీసుకెళ్లేలోగానే మృతి చెందాడు. వినాయకపురం గ్రామానికి చెందిన బేతం చిన్ని (58), తన్నీరు మనోహర్ (48) కూడా వడదెబ్బతో మృతి చెందారు.

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	42.5	27.7	హనుమకొండ	41.0	29.5
రామగుండం	42.4	29.2	హైదరాబాద్	40.6	26.5
ఆదిలాబాద్	42.3	27.2	మహబూబ్‌నగర్	40.6	24.0
మెదక్	42.0	25.2	హకీంపేట్	40.0	23.9
నిజామాబాద్	41.9	27.7	దుండిగల్	40.0	25.2
ఖమ్మం	41.4	29.4	భద్రాచలం	39.8	29.0

వరద జలాలతో అనుమతి రాదనే

నికర జలాలతోనే

- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను చేపట్టాం
- కృష్ణా ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలు
- తదుపరి వాదనలు జూలై 12 నుంచి



ఆ అధికారం అపెక్స్‌కు లేదంటూ ఏపీ వాదనలు

సాక్షి, హైదరాబాద్: వరద జలాలపై ప్రతిపాదిస్తే ప్రాజెక్టుకు అనుమతి రాదనే, నికర జలాలతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టినట్టు తెలంగాణ గుర్తు చేసింది. పాత ప్రతిపాదన(జూరాల)కు కొత్త ప్రతిపాదిత ప్రాజెక్టుకు మధ్య నీటిని ఎత్తిపోసే ప్రదేశం ఒకటే మారిందని, డిజైన్‌లో ఎలాంటి మార్పుల్లేవని స్పష్టం చేసింది. శుక్రవారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కృష్ణా జల వివాదాలకు సంబంధించి జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌లో తెలంగాణ, ఏపీ వాదనలు వినిపించాయి. 2015లో జీవోనెం 105 ప్రకారం పాలమూరు-రంగారెడ్డిని వరద నీటితో చేపట్టిన ప్రాజెక్టుగా, 2022లో జీవోనెం.216 ప్రకారం నికర జలాలతో చేపట్టినట్లు చూపారని తెలంగాణను ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్ కుమార్ ప్రశ్నించారు. అంతకు ముందు జూరాల నుంచి, ఇప్పుడు శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి చేపట్టడాన్ని ప్రశ్నించారు. దీనిపై తెలంగాణ తరపు న్యాయవాది స్పందిస్తూ వరద నీటితో అనుమతులు రావనే నికర జలాలు కేటాయింపుతో చేపట్టినట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య జలవివాదాలు పరిష్కరించే బాధ్యతను అపెక్స్ కౌన్సిల్‌కు అప్పగిస్తే అందుకు విరుద్ధంగా ట్రిబ్యునల్‌లో కేసు వేసిందని గుర్తుచేశారు.

నీటి పంపకాలు చేసే బాధ్యత అపెక్స్ కౌన్సిల్‌కు లేదని, ఒక్క ట్రిబ్యునల్‌కు మాత్రమే ఉందని ఏపీ వాదించింది. ఉమ్మడి ఏపీలోనే 2013 లోనే పాలమూరు ప్రాజెక్టును ప్రతిపాదించారని, తెలంగాణ ఏర్పడ్డాకే ప్రాజెక్టు నిర్మాణం చేపట్టామని తెలంగాణ గుర్తు చేసింది. బచావత్ ట్రిబ్యునల్ గంపగుత్తగా ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని కేటాయించిందని, ఇందులో ఏపీ 300 టీఎంసీలను బేసిన్ అవతలికి తరలిస్తోందని, బేసిన్ పారామీటర్ ప్రకారం 811 టీఎంసీల్లో 70 శాతం నీటిని తెలంగాణకు కేటాయించాల్సి ఉంటుందని పేర్కొంది. దీనిపై ట్రిబ్యునల్ చైర్మన్ స్పందిస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్–89 ప్రకారం ప్రకారం కృష్ణా జలాలను రాష్ట్రాల వారీగా పంచే అధికారం లేదని గుర్తు చేశారు. మరోవైపు ఏపీ వేసిన అఫిడవిట్‌పై తెలంగాణ వాదనలు వినిపించడానికి వీలుగా ట్రిబ్యునల్ విచారణను జూలై 12కు వాయిదా వేశారు. జూలై 12, 13, 14వ తేదీల్లో తెలంగాణ ఏపీ వేసిన అఫిడవిట్‌పై వాదనలు వినిపించాలని ఆదేశాలు జారీ చేశారు.

పల్లె పల్లెనా పండుగలా..

జూన్ 2 నుంచి 23 వరకు 'దశాబ్ది' ఉత్సవాలు

సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ఆదేశాలతో జూన్ 2 నుంచి 21 రోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని మంత్రులు అధికారులకు సూచించారు. గ్రామాన్నీ యూనిట్‌గా తీసుకుని ప్రణాళికాబద్ధంగా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామసభలో అభివృద్ధిని వివరిస్తూ గ్రామస్తులకు ప్రగతి నివేదికలు చదివి వినిపించాలని, గ్రామాలు, జిల్లాల్లో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించాలని, ప్రతి గ్రామంలోనూ అభివృద్ధిపై దండోరాలు వేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటి ముందు పదేళ్ల విజయోత్సవాలు ఉట్టిపడేలా రంగవల్లులను తీర్చిదిద్దాలని, పండుగలా ఉత్సవాలను నిర్వహించాలన్నారు. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఇతర మంత్రులు మహమూద్‌అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ, తొమ్మిదేళ్లలో ప్రభుత్వ శాఖలు సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, నిర్దేశించిన రోజున ఉత్సవాలు నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లో జూన్ 2న నిర్వహించే ప్రారంభ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని, జిల్లా కేంద్రాలలో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఉత్సవాలపై రూపొందించే డాక్యుమెంటరీ చిత్రాల వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు.


'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 58

శనివారం 20-5-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



అదానీకి ఊరట..

స్టాక్స్ ర్యాలీలో నియంత్రణ వైఫల్యం లేదన్న సుప్రీం నిపుణుల కమిటీ -13లో



గుస్సాడి గుండెచప్పుడు పద్మశ్రీ కనకరాజు -10లో



...తేనెటీగలు పెడుతున్నదే!

మనం తింటున్న ప్రతి మూడో ముద్ద ముఖ్యంగా తేనెటీగల పుణ్యమే. అవి లేకపోతే మన మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది.

వివరాలు 14లో ▸



రష్యాకు శిక్ష తప్పదు

ఉక్రెయిన్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న రష్యాకు శిక్ష తప్పదని జీ-7 దేశాధినేతలు హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



3 రోజుల నష్టాలకు చెక్

మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సెన్సెక్స్ 298 పాయింట్లు జంప్‌చేసి 61,730 వద్ద ముగిసింది.

వివరాలు 13లో ▸



విజయంతో ముగింపు

ఐపీఎల్ టోర్నీలో మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ తమ లీగ్ దశను విజయంతో ముగించింది.

వివరాలు 12లో ▸



అన్నా..లేరా!

భయ్యా ఉటో.. భయ్యా ఇప్పటిదాకా నాతో ఆడుకున్నవు కదా.. ఇప్పుడెందుకు నిద్రపోయావు.. అంటూ ఈ చిన్నారి కుక్కల దాడిలో మరణించిన సోదరుడిని పట్టుకుని రోదిస్తున్న తీరు.. అక్కడున్న వారిని కలచివేసింది.

బాలుడిని చంపిన వీధి కుక్కలు

హనుమకొండలోని కాజీపేట రైల్వే కాలనీలో విషాద ఘటన

- వివరాలు 5లో ▶

'మహా' జలదృశ్యం

తెలంగాణలో సాధ్యమైన జల దృశ్యాన్ని మహారాష్ట్రలోనూ సాధిస్తాం

నాందేడ్‌లో బీఆర్‌ఎస్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవంలో కేసీఆర్

- రాష్ట్ర మోడల్‌ను అనుసరించి 4-5 భారీ ప్రాజెక్టులు నిర్మిస్తాం
- కృష్ణా, గోదావరిల పుట్టినిల్లయిన మహారాష్ట్రలో భారీగా సేద్యం ఎందుకు సాధ్యంకాదు?
- విదేశాలు భారీ ప్రాజెక్టులు నిర్మిస్తున్నా మన దేశంలో సరైన ప్రణాళిక లేకే కరువు
- 70 వేల టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా 20 వేల టీఎంసీలే వాడుతున్నాం
- దేశ రైతాంగం బాగుపడే వరకు బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: దేశంలో మార్పు తేవాలనే ఉన్నత లక్ష్యంతో భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) పనిచేస్తోందని, దేశ రైతాంగం బాగుపడేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. కరువుతో అల్లాడిన తెలంగాణ నేడు దేశంలోనే అత్యధికంగా ధాన్యం పండిస్తోందని... కృష్ణా, గోదావరి నదులకు పుట్టినిల్లయిన మహారాష్ట్రలో ఇది ఎందుకు సాధ్యం కాదని ప్రశ్నించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో బీఆర్‌ఎస్ రెండు రోజుల శిక్షణ శిబిరాన్ని సీఎం కేసీఆర్ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ 'మహారాష్ట్ర, తెలంగాణ వేల కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్నాయి. దేశంలో ఏటా 1.40 లక్షల టీఎంసీల మేర వర్షం కురుస్తుండగా నదుల్లో సుమారు 70 వేల టీఎంసీల నీరు సాగు, తాగునీటి అవసరాలకు అందుబాటులో ఉంది. ఇందులో కేవలం 20 వేల టీఎంసీల నీటినే ఉపయోగించుకుంటున్నాం. చైనా, ఈజిప్ట్, అమెరికా, జింబాబ్వే వంటి దేశాలు భారీ ప్రాజెక్టులు

మిగతా 2వ పేజీలో ▶

"దేశంలో మార్పు కోసం మహారాష్ట్ర నాంది పలకాలి. దేశంలో కాంగ్రెస్ 50 ఏళ్లు, బీజేపీ 16 ఏళ్లుగా పాలిస్తున్నా తాగు, సాగునీరు ఇబ్బందులు ఉన్నాయి.

\- కేసీఆర్

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌కు

తొలి విజయం

ఔరంగాబాద్ అంబేలోహల్ వార్డు ఉప ఎన్నికలో గెలుపు

- వివరాలు 2లో ▶

నాందేడ్‌లో బీఆర్‌ఎస్ శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న కేసీఆర్



రాష్ట్ర వార్షిక రుణ లక్ష్యం

రూ. 2.42 లక్షల కోట్లు

అందులో వ్యవసాయ రుణాలు రూ. 1.12 లక్షల కోట్లు	రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి వెల్లడి	పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ కల్పనలో అగ్రస్థానంలో రాష్ట్రం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ లక్ష్యం రూ. 2,42,775 కోట్లుగా నిర్ధారించారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం లక్ష్యం రూ.2.14 లక్షల కోట్లు కాగా, ఈ ఏడాది 13.42 శాతం ఎక్కువ. ఈ ఏడాది రుణ లక్ష్యంలో ప్రాధాన్యత రంగం వాటా రూ.1,85,326.68 కోట్లు (76.33 శాతం) అని ఎస్‌ఎల్‌బీసీ తెలిపింది. ప్రాధాన్యత రంగ లక్ష్యాల్లో అత్యధికంగా 60.85 శాతం వ్యవసాయ రంగానికి కేటాయించారు. అంటే ఈ ఏడాది వ్యవసాయ, దాని అనుబంధ రంగాలకు రూ.1,12,762.59 కోట్లు రుణాలుగా ఇవ్వాలని నిర్ణయించారు. ఎంఎస్‌ఎంఈ విభాగానికి రూ. 54,672.44 కోట్లు కేటాయించారు. రైతులకు స్థిరమైన ఆదాయాన్ని సృష్టించేందుకు రూ.39,325.87 కోట్ల పెట్టుబడి రుణాలు పంపిణీ చేయాలని నాబార్డ్ అంచనా వేసినట్లు తెలిపింది. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకులు రూ.59,060 కోట్ల పంట రుణాలను అందజేశాయి. పంట రుణాల లక్ష్యంలో 87 శాతం చేరుకున్నట్లు తెలిపింది. అలాగే రూ. 679 కోట్ల విద్యారుణాలు ఇచ్చాయి. విద్యారుణాల

మిగతా 3వ పేజీలో ▶



వాషింగ్టన్ డీసీలో ప్రవాస భారతీయ సీఈవోలతో మంత్రి కేటీఆర్

చిన్న నగరాల్లో 2,500 ఐటీ జాబ్స్

- మరో పది వేల మందికి పరోక్షంగా ఉపాధి
- అమెరికాలో ప్రవాస భారతీయ సీఈఓలతో మంత్రి కేటీఆర్ భేటీ
- వివిధ కంపెనీలతో ఒప్పందాలు
- గ్రామీణ ఉపాధికి ఊతమివ్వాలని పిలుపు
- త్వరలో సిద్దిపేట ఐటీ టవర్‌లో కార్యకలాపాలు మొదలవుతాయని వెల్లడి

ఒప్పందాల్లో బిజీబిజీగా..

- వాషింగ్టన్ డీసీలో పలు సంస్థల ప్రతినిధులతో కేటీఆర్ భేటీలు..

- వివరాలు 2లో

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటులో భాగస్వాములు కావాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. అమెరికా పర్యటనలో భాగంగా వాషింగ్టన్ డీసీలో 30 ఐటీ కంపెనీల సీఈఓలతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన పలువురు ప్రవాస భారతీయ సీఈఓలతోపాటు ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా సిద్దిపేట, నల్లగొండ, నిజామాబాద్ తదితర పట్టణాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటుకు అవగాహన

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

మెడికల్ 3డి ప్రింటింగ్‌తో వైద్య ఉపకరణాలు



దేశంలో ఆరోగ్య రక్షణ రంగంలో విప్లవాత్మక మార్పుల దిశగా మెడికల్ 3డి ప్రింటింగ్ ప్రస్థానం సాగుతోందని ఎన్‌సీఎం సీఈఓ జస్ప్రీత్ సిద్ధు వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌సీఎం శుక్రవారం రెండో జాతీయ సదస్సు నిర్వహించింది.

- వివరాలు 3లో ▶

అలవెన్స్ చర్చలు సఫలం



దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం 10వ సమావేశం శుక్రవారం కోల్‌కతాలో జరిగింది. యాజమాన్యం జరిపిన చర్చలో అన్ని అలవెన్స్‌లపై 25శాతం పెంచేందుకు అంగీకారం కుదిరినట్లు జాతీయ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు.

- వివరాలు 14లో ▶

'కర్ణాటక' కిక్!

- అక్కడి ఫలితాల జోష్‌తో దూకుడుగా ముందుకెళ్లేందుకు టీపీసీసీ ప్రణాళిక
- 25న జడ్చర్లలో సభ.. హాజరుకానున్న రాజస్తాన్ సీఎం, ముఖ్యనేతలు
- కేడర్‌లో ఉత్సాహం నింపేలా భారీ ఎత్తున జన సమీకరణ
- జూన్‌లో మహిళా, బీసీ డిక్లరేషన్‌లు.. సోనియా, రాహుల్‌ల అపాయింట్‌మెంట్ కోసం యత్నాలు
- చేరికల కమిటీ బలోపేతం.. అభ్యర్థుల ఖరారులోనూ కర్ణాటక ఫార్ములా..



2లో

జూలై 8న టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష

- 13, 14 తేదీల్లో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పరీక్షలు
- సీబీఆర్‌టీ పద్ధతిలో నిర్వహించనున్న టీఎస్‌పీఎస్సీ

14లో

సరదాగా తిరిగొద్దాం అనుకుంటే..

కబళించిన మృత్యువు

కారు ప్రమాదంలో నలుగురి మృతి

- ముగ్గురి పరిస్థితి విషమం..
- ఒకే కారులో 11 మంది ప్రయాణం
- అంతా నిజాంపేట నివాసితుల పిల్లలే.

- వివరాలు 3లో



ప్రమాదంలో నుజ్జయిన కారు



ఢిల్లీకి నేతల క్యూ

రాష్ట్ర నేతలతో వేర్వేరుగా అమిత్‌షా, సునీల్ బన్సల్ భేటీ

- నాలుగైదు రోజులుగా పలువురు నేతలు దేశ రాజధానికి...
- రాష్ట్ర బీజేపీ అధ్యక్ష బాధ్యతలపై అభిప్రాయ సేకరణ?.. బండిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవచ్చనే ప్రచారం

- వివరాలు 14లో

ఇదండీ సంగతి



మనం హామీల ప్రమేయం లేకుండానే ఓడిపోయాం సార్!

రియల్ రంగంలోకి 'సుడా'

మిట్టపల్లిలో 14 ఎకరాల్లో సుడా మోడల్ టౌన్‌షిప్

- రాష్ట్రంలోనే తొలిసారిగా సిద్దిపేటలో అసైన్డ్ ల్యాండ్ పూలింగ్
- 10 మంది అసైనీ రైతుల నుంచి 14 ఎకరాల భూమి సేకరణ
- అసైనీలకు 50 ప్లాట్లు
- నేడు విపంచి కళానిలయంలో ప్రీబిడ్ మీటింగ్



సాక్షి, సిద్దిపేట

రియల్ ఎస్టేట్ రంగంలోకి 'సుడా' (సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థ) అడుగు పెడుతోంది. గతేడాది డిసెంబర్ 9న ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 234 ప్రకారం సిద్దిపేట పట్టణ శివారులోని మిట్టపల్లి సమీపంలో 14 ఎకరాల అసైన్డ్ భూములను సుడా సేకరించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా అసైన్డ్ ల్యాండ్ పూలింగ్‌తో మోడల్ లే అవుట్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే సిద్దిపేట అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ఓ వైపు పర్యాటకంగా, మరోవైపు సాగు జలాలు, విద్యా కేంద్రంగా విలసిల్లుతోంది. త్వరలో రైలు సౌకర్యం కూడా రానుంది. పట్టణ శివారులో ఇప్పటికే పలు ప్రైవేట్ కంపెనీలు వెంచర్లు చేసి విక్రయిస్తున్నాయి. దీంతో భూములకు డిమాండ్ పెరిగింది. శనివారం సుడా మోడల్ టౌన్‌షిప్‌పై సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో ప్రీబిడ్ మీటింగ్ ఏర్పాటు చేశారు.

10 మంది రైతులు.. 14 ఎకరాలు

సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో అసైన్డ్ భూములు కలిగిన పది మంది రైతుల నుంచి 14 ఎకరాల భూమిని సేకరించారు. ఎకరం భూమి కోల్పోతున్న రైతుకు డెవలప్‌మెంట్ చేసిన టౌన్‌షిప్‌లో 800 గజాల స్థలం ఇస్తారు. 14 ఎకరాల భూమిలో 67,760 గజాల భూమి తేలింది. ప్రధాన రోడ్డు 60 ఫీట్లు, అంతర్గత రోడ్లు 33 ఫీట్లతో నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. రోడ్లకు 23,907 గజాలు, పార్కులకు 6,098 గజాలు, ఇతర మౌలిక సదుపాయాలకు 2,391 గజాలు వినియోగిస్తున్నారు. దీంతో 35,360 గజాల స్థలం మిగిలింది. దీనిని 161 ప్లాట్లుగా విభజించారు. అందులో 10 మంది రైతులకు 50 ప్లాట్లు, 111 ప్లాట్లు సుడాకు మిగులుతాయి. స్ట్రీట్ లైట్‌లు, పార్కులు, మొక్కల పెంపకం,

మిగతా 3వ పేజీలో ▶

● రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీకి మిగిలేది 15-20 మంది ఎమ్మెల్యేలేనని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎల్పీ సమావేశంలో సీఎం కేసీఆర్ చెప్పినట్టు.. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచేది 105 సీట్లు కాదని, 15-20 మాత్రమేనని జోస్యం చెప్పారు.

రాష్ట్ర కాంగ్రెస్‌కు 'కర్ణాటక' కిక్!



అక్కడి ఫలితాల జోష్‌తో దూకుడుగా ముందుకెళ్లేందుకు టీపీసీసీ ప్రణాళిక

రాష్ట్రంలో ఎన్నికలు జరిగే వరకు ఊపును కొనసాగించాలని నిర్ణయం

25న జడ్చర్లలో భారీ సభ.. హాజరుకానున్న రాజస్తాన్ సీఎం గెహ్లాట్, ముఖ్య నేతలు

- కేడర్‌లో ఉత్సాహం నింపేలా భారీయెత్తున జన సమీకరణ
- జూన్‌లో మహిళా, బీసీ డిక్లరేషన్‌లు.. సోనియా, రాహుల్‌ల అపాయింట్‌మెంట్ కోసం యత్నాలు
- పార్టీ చేరికల కమిటీ బలోపేతం..జానారెడ్డి నేతృత్వం..పొన్నాల, జీవన్‌లకు బాధ్యతలు!
- అభ్యర్థుల ఖరారులోనూ కర్ణాటక ఫార్ములా..

సాక్షి, హైదరాబాద్: కర్ణాటక ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో దూకుడుగా ముందుకెళ్లేందుకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. అక్కడి ఫలితాలు రాష్ట్రంలోనూ పునరావృతమవుతాయనే ధీమా వ్యక్తం చేస్తున్న నేతలు.. ఎన్నికలు జరిగే వరకు ఇదే ఊపును కొనసాగించాలని భావిస్తున్నారు. అందులో భాగంగానే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని జడ్చర్లలో ఈ నెల 25న భారీ బహిరంగ సభకు సిద్ధమవుతున్నారు. సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా నిర్వహిస్తోన్న ఈ సభకు రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో పాటు ఇతర కీలక నేతలను ఆహ్వానించనున్నారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా రాష్ట్రంలో మూడు చోట్ల సభలు నిర్వహించాలని కాంగ్రెస్ నేతలు గతంలోనే నిర్ణయించారు. అందులో భాగంగా గత నెలలో మంచిర్యాలలో సత్యాగ్రహ సభను నిర్వహించి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఇప్పుడు జడ్చర్లలో రెండో సభను నిర్వహించనున్నారు. ఈ నెల 8వ తేదీన సరూర్‌నగర్ స్టేడియంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ సమక్షంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించిన నేతలు.. జడ్చర్ల సభకు భారీ ఎత్తున కేడర్‌ను సమీకరించాలని నిర్ణయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌తో పాటు రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల నుంచి జన సమీకరణకు సిద్ధమవుతున్నారు.

ఆగస్టు కల్లా 50 మంది వరకు అభ్యర్థుల ఖరారు!

మరోవైపు అభ్యర్థుల ఖరారులోనూ కర్ణాటక ఫార్ములానే తెలంగాణలో అమలు చేయాలనే డిమాండ్ చాలా కాలంగా వినిపిస్తోంది. వీలున్నంత మంది అభ్యర్థులను 6 నెలల ముందే ప్రకటించడం ద్వారా ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యే అవకాశాన్ని కల్పించాలని చాలా మంది నేతలు అధిష్టానాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో 45-50 మంది అభ్యర్థులను ఈ ఏడాది ఆగస్టు కల్లా ప్రకటించే అవకాశముందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

మరిన్ని డిక్లరేషన్‌లు

యూత్ డిక్లరేషన్‌కు మంచి స్పందన రావడం, దీనిపై ప్రత్యర్థి పార్టీలు కూడా విమర్శలు చేసే పరిస్థితి లేకపోవడంతో మరిన్ని డిక్లరేషన్‌లకు టీపీసీసీ సిద్ధమవుతోంది. మహిళలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం డిక్లరేషన్‌లు ప్రకటిస్తామని, తాము అధికారంలోకి వస్తే ఆయా వర్గాలకు చేసే మేలు గురించి వాటిల్లో వివరిస్తామని సరూర్‌నగర్ సభలోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు వచ్చే నెలలో మహిళా, బీసీ డిక్లరేషన్‌లు ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. మహిళా డిక్లరేషన్‌కు సోనియా గాంధీని, బీసీ డిక్లరేషన్‌కు దేశంలోని కాంగ్రెస్ ముఖ్యమంత్రులను ఆహ్వానించాలని, తద్వారా కేడర్‌లో ఉత్సాహం నింపాలని, ప్రజలకు మరింత భరోసా కల్పించాలని భావిస్తున్నారు. ఇందుకుగాను సోనియా, రాహుల్‌లలో ఒకరి అపాయింట్‌మెంట్ కోసం టీపీసీసీ నేతలు ఇప్పటికే అధిష్టానానికి ప్రతిపాదనలు పంపారు.

చేరికలపై ప్రత్యేక దృష్టి

ఇతర పార్టీల నుంచి వీలైనంతగా వలసలు ప్రోత్సహించాలని టీపీసీసీ నిర్ణయించింది. అందులో భాగంగానే బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్ వెంకటస్వామిలతో పాటు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులను రేవంత్ కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. వారు పార్టీలో చేరేందుకు తానే ఇబ్బందిగా ఉన్నట్టయితే పది మెట్లు దిగేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలో పార్టీ చేరికల కమిటీని పరిపుష్టం చేయాలని టీపీసీసీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ కమిటీకి ఇప్పటికే జానారెడ్డి చైర్మన్‌గా ఉండగా, సీనియర్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, జీవన్‌రెడ్డి లాంటి నేతలకు కూడా బాధ్యతలు అప్పగించాలని యోచిస్తున్నారు. వీరు కాంగ్రెస్‌ను వీడిన వారితో, ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న వారితోనూ త్వరలోనే చర్చలు ప్రారంభించనున్నట్టు సమాచారం.



జెనెసిస్ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

ఒప్పందాల్లో బిజీబిజీగా..

వాషింగ్టన్ డీసీలో వివిధ సంస్థల ప్రతినిధులతో కేటీఆర్ భేటీలు

- పలు సంస్థలతో పెట్టుబడులు, భాగస్వామ్యాలపై చర్చలు
- జీనోమ్ వ్యాలీలో రూ.500 కోట్లతో జెనెసిస్ విస్తరణ
- కరీంనగర్‌లో హెల్త్‌కేర్ సెంటర్ ఏర్పాటుకు ఎక్లాట్ ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు పెట్టుబడులు సాధన లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ న్యూయార్క్ పర్యటన ముగించుకుని వాషింగ్టన్ డీసీకి చేరుకున్నారు. శుక్రవారం వాషింగ్టన్ డీసీలో వివిధ రంగాలకు చెందిన కంపెనీల చైర్మన్లు, సీఈఓలు, ప్రతినిధుల బృందాలతో కేటీఆర్ వరుస భేటీలు జరిపారు. పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనలతోపాటు కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడంలో బిజీబిజీగా గడిపారు. జీనోమ్ వ్యాలీలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న జెనెసిస్ బయోలాజిక్స్ కేటీఆర్‌తో భేటీ సందర్భంగా విస్తరణ ప్రణాళికలను ప్రకటించింది. ఇప్పటికే రూ.400 కోట్ల పైచిలుకు పెట్టుబడిని పెట్టిన జెనెసిస్.. జీనోమ్ వ్యాలీలో మరో రూ.500 కోట్ల పెట్టుబడికి సంసిద్ధత వ్యక్తం చేసింది. దీంతో కొత్తగా 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అలాగే, అమెరికాకు చెందిన ఇంజనీరింగ్ ఉత్పత్తులు, పరిష్కారాల సంస్థ జాప్‌కమ్ గ్రూప్ హైదరాబాద్‌లో నైపుణ్య కేంద్రం (సీఓఈ-సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్) ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ వ్యవస్థాపకులు, సీఈఓ కిషోర్ పల్లంరెడ్డి ప్రకటించారు. రవాణా, ఆతిథ్య, ఫిన్‌టెక్, రిటైల్ రంగాల్లో ఏఐ, ఎన్‌ఎల్‌పీ సాంకేతిక ఆధారిత ఉత్పత్తులపై ఈ కేంద్రం పనిచేస్తుంది.

హెల్త్‌కేర్ రంగంలో...

కరీంనగర్‌లో హెల్త్‌కేర్ సెంటర్ ఏర్పాటు ద్వారా మెడికల్ కోడింగ్, క్లినికల్ డాక్యుమెంటేషన్ సేవలు అందించేందుకు వీలుగా ఎక్లాట్ (ఈసీఎల్ఏటీ) సంస్థ తెలంగాణతో ఒప్పందం కుదుర్చుకుంది. హెల్త్‌కేర్ రంగంలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 3ఎం హెల్త్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (హెచ్ఐఎస్), ఎక్లాట్ సంయుక్తంగా ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తాయి. తొలుత వంద మందికి ఉద్యోగాల కల్పనతో కార్యకలాపాలు ప్రారంభించి ఈ సంఖ్యను క్రమంగా 200కు పెంచుతారు. ఎక్లాట్ హెల్త్‌కేర్ 40 ఏళ్లుగా 18 దేశాల్లో సేవలు అందిస్తోందని, తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా సేవలు అందిస్తోందని కేటీఆర్ వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం, 3 ఎంతోపాటు ఈసీఎల్ఏటీ మధ్య సహకారం గురించి సమావేశంలో చర్చించారు. ఈ ఒప్పందం ద్వారా లైఫ్‌సైన్సెస్, హెల్త్‌కేర్ రంగాలను ప్రోత్సహిస్తామని 3ఎం (హెచ్ఐఎస్) ఎండీ సందీప్ వాద్వా తెలిపారు.

- అమెరికా అంతరిక్ష, వైమానిక, రక్షణ, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, టెక్నాలజీ కార్పొరేషన్ కంపెనీ లాక్‌హీడ్ మార్టిన్‌కు చెందిన ఉన్నతస్థాయి బృందంతో కేటీఆర్ భేటీ అయ్యారు. ఇప్పటికే హైదరాబాద్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న లాక్‌హీడ్ మార్టిన్ తమ తదుపరి సరఫరా వ్యవస్థ సమావేశాన్ని తెలంగాణలో ఏర్పాటు చేయడాన్ని కేటీఆర్ స్వాగతించారు.
- అమెరికా న్యూక్లియర్ వ్యవస్థలు, రక్షణరంగానికి అవసరమైన తయారీ, పరిశోధన, అభివృద్ధిలో భాగస్వామ్యాలకు ఉన్న అవకాశాలపై జనరల్ అటామిక్స్ (జీఏ) సీఈఓ వివేక్‌లాల్‌తో కేటీఆర్ చర్చించారు. హైదరాబాద్‌లో డ్రోన్ల తయారీతోపాటు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఏరోస్పేస్ యూనివర్సిటీ ప్రాజెక్టులో భాగస్వాములవ్వాలని ఆహ్వానించారు.
- వాషింగ్టన్‌కు బయలుదేరడానికి ముందు న్యూయార్క్‌లో భారత్ కాన్సుల్ జనరల్ రణధీర్ జైస్వాల్‌తో కేటీఆర్ భేటీ అయ్యారు. అనంతరం అమెరికన్ అంతర్జాతీయ మీడియా, మార్కెటింగ్, కార్పొరేట్ కమ్యూనికేషన్ కంపెనీ ఆమ్నిగ్రూప్ ప్రతినిధులతో భాగస్వామ్య చర్చలు జరిపారు.

'మహో' జలదృశ్యం..

▶ మొదటి పేజీ తరువాయి

నిర్మిస్తున్నా మన దగ్గర సరైన ప్రణాళిక లేక కరువు ఎదుర్కొంటున్నాం. తెలంగాణలో సాధించిన జల దృశ్యాన్ని మహారాష్ట్రలోనూ సాధించేందుకు తెలంగాణ మోడల్‌ను అనుసరిస్తూ 4-5 భారీ ప్రాజెక్టులు నిర్మిస్తాం' అని కేసీఆర్ ప్రకటించారు.

మార్పునకు మహారాష్ట్ర నాంది పలకాలి...

'చిన్న దేశాలైన సింగపూర్, మలేసియా అభివృద్ధి చెందుతున్నా మన నాయకులు ఓట్ల కోసమే పనిచేస్తున్నారు. దేశంలో మార్పు తేవాలనే లక్ష్యంతో బీఆర్‌ఎస్ ఏర్పాటైంది. దేశంలో మార్పు కోసం మహారాష్ట్ర నాంది పలకాలి. దేశంలో కాంగ్రెస్ 50 ఏళ్లు, బీజేపీ 16 ఏళ్లుగా పాలిస్తున్నా తాగు, సాగునీరు ఇబ్బందులు ఉన్నాయి. విద్వేష రాజకీయాల మూలంగానే కర్ణాటకలో బీజేపీని ఓడించి అక్కడి ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత అనేక సమస్యలను పరిష్కరించడంతో రైతులు పూర్తి విశ్వాసం, సంతృప్తితో ఉన్నారు. రైతుబంధు, రైతు బీమా సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశాం. దళితబంధు ద్వారా 50 వేల కుటుంబాలకు లబ్ధి జరిగింది. రైతురాజ్యం కోసం బీఆర్‌ఎస్ దేశవ్యాప్త ప్రయత్నాలు చేస్తోంది' అని కేసీఆర్ వెల్లడించారు.

కడదాకా నిలబడే సత్తా ఉంటేనే చేరండి..

'కడదాకా నిలబడి పోరాడే సత్తా ఉన్నవాళ్లు, ప్రజల కోసం ఎందాకైనా పోరాడే తెగువ ఉన్నవారే బీఆర్‌ఎస్‌లో చేరండి. మన లక్ష్యం గొప్పదనే విషయాన్ని గుర్తించి నిత్యం ప్రజలతో మమేకమై చైతన్యపరచాలి. ఒకసారి అడుగు ముందుకేస్తే వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. త్వరలో పార్టీ కమిటీలు వేసుకుందాం. డిజిటల్ రూపంలో అందించే శిక్షణ తరగతుల సమాచారాన్ని సమగ్రంగా తెలుసుకోవాలి. ప్రతి గ్రామంలో గులాబీ జెండా ఎగరడంతోపాటు పార్టీ కమిటీలు ఉండాలి. ఆటోలు, ట్యాక్సీలపై స్టిక్కర్లు, పాటలకు విస్తృత ప్రచారం, సామాజిక మాధ్యమాలను విరివిగా ఉపయోగించుకోవడంపై దృష్టి పెట్టండి' అని కేసీఆర్ సూచించారు. మహారాష్ట్ర బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా దేశ్‌ముఖ్ పేరును ఖరారు చేశారు.

నాందేడ్‌లో ఘన స్వాగతం...

నాందేడ్‌లో రెండు రోజులపాటు జరిగే బీఆర్‌ఎస్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించేందుకు సీఎం కేసీఆర్ శుక్రవారం ఉదయం 11:40 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి వెళ్లారు. నాందేడ్‌లో శిక్షణ జరిగే అనంత్‌లాన్స్‌కు చేరుకొని శిక్షణ శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరించారు. శివాజీ, అంబేడ్కర్, పూలే తదితర మహనీయుల చిత్రపటాలకు నివాళి అర్పించారు. కేసీఆర్‌కు స్వాగతం పలుకుతూ పెద్ద ఎత్తున స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముగ్గురేసి చొప్పున ఎంపిక చేసిన నేతలు శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. శిక్షణ ముగిశాక నియోజకవర్గాలవారీగా పార్టీ ప్రచార సామగ్రి, ల్యాప్‌టాప్, ట్యాబ్‌లను పార్టీ బాధ్యులకు అందజేస్తామని కేసీఆర్ ప్రకటించారు. సభ్యత్వ నమోదు పుస్తకాలు, మహారాష్ట్ర స్థానిక కళా సంప్రదాయాలకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన పాటలు, వివిధ కళారూపాలకు సంబంధించిన సాంస్కృతిక భాండాగారాన్ని సైతం పెన్‌డ్రైవ్‌ల రూపంలో అందజేస్తామన్నారు. శిక్షణ శిబిరం వేదికగా మహారాష్ట్రలోని వివిధ పార్టీలకు చెందిన నేతలు కేసీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

మహారాష్ట్రలో బీఆర్‌ఎస్‌కు తొలి విజయం

- ఔరంగాబాద్ అంబేలోహల్ వార్డు ఉప ఎన్నికలో గెలుపు
- 115 ఓట్ల మెజారిటీతో గెలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి గఫూర్

సాక్షి, హైదరాబాద్: జాతీయ పార్టీగా అవతరించి ఇతర రాష్ట్రాల్లో విస్తరించే ప్రయత్నాల్లో ఉన్న బీఆర్‌ఎస్‌కు తెలంగాణ బయట తొలి విజయం లభించింది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్ (శంభాజీనగర్) జిల్లా గంగాపూర్ తాలూకాలోని అంబెలోహల్ గ్రామ వార్డు సభ్యుడిగా బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి గఫూర్ సర్దార్ పఠాన్ విజయం సాధించారు. అంబెలోహల్ గ్రామంలోని మొదటి వార్డుకు జరిగిన ఉపఎన్నికలో ఆయన 115 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఈ విజయంపై బీఆర్‌ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. తెలంగాణ మోడల్‌ను మహారాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారనేందుకు ఈ గెలుపు అద్దంపడుతోందని తెలంగాణ పునరుత్పాదక సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. విధ్వంస రాజకీయాలు చేసిన బీజేపీకి తాజాగా జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. మహారాష్ట్రలోనూ అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్‌ను పక్కకు నెట్టి బీఆర్‌ఎస్ అభ్యర్థికి ప్రజలు ఓటేశారన్నారు.

చిన్న నగరాల్లో 2,500 ఐటీ ఉద్యోగాలు

▶ మొదటి పేజీ తరువాయి



ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వీటివల్ల ద్వితీయ శ్రేణి నగరాల్లో ప్రత్యక్షంగా 2,500 మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని కేటీఆర్ వెల్లడించారు.

ద్వితీయశ్రేణి నగరాల్లో ఐటీ వృద్ధి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లో ఐటీ టవర్లను ప్రారంభించామని, త్వరలో సిద్దిపేట ఐటీ టవర్‌లోనూ కార్యకలాపాలు మొదలవుతాయని కేటీఆర్ తెలిపారు. నిజామాబాద్, నల్లగొండలోనూ ఐటీ టవర్ల నిర్మాణం వేర్వేరు దశల్లో ఉందని, ఆదిలాబాద్‌కు కూడా ఐటీ టవర్‌ను మంజూరు చేశామన్నారు. ఐటీ కార్యకలాపాల విస్తరణతో వరంగల్, కరీంనగర్ వంటి ద్వితీయ శ్రేణి నగరాల్లోనూ వృద్ధి జరుగుతోందన్నారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ కంపెనీల ఏర్పాటు ద్వారా గ్రామీణ ఉపాధికి ఊతమివ్వాలని ప్రవాస భారతీయులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. బెల్లంపల్లి వంటి చిన్న పట్టణాల నుంచి తక్కువ ఖర్చుతో ఐటీ కంపెనీలను నిర్వహించే వీలుందన్నారు. టెక్‌జన్ సీఈఓ లాక్స్ చేపూరి, బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్ఐ సెల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల ఐటీ కంపెనీల సీఈఓలతో భేటీని సమన్వయం చేశారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్‌లో ఐటీ హబ్‌లు విజయవంతంగా పని చేయడం వెనుక లాక్స్ చేపూరి, వంశీరెడ్డి, కార్తీక్ పొలసాని కృషిని కేటీఆర్ అభినందించారు. ఈ భేటీలో ఐటీ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, చీఫ్ రిలేషన్స్ ఆఫీసర్ అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అంతరిక్ష, వైమానిక, రక్షణ రంగాల్లో ముందంజ

అంతరిక్ష, వైమానిక, రక్షణ రంగాల్లో తెలంగాణ దూసుకుపోతోందని, టీఎస్ఐపాస్ నిబంధనల మేరకు కంపెనీలకు నిర్దేశిత వ్యవధిలో పారదర్శకంగా అనుమతులు ఇస్తున్నామని మంత్రి కేటీఆర్ చెప్పారు. వాషింగ్టన్ డీసీలో కేటీఆర్ నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అమెరికాకు చెందిన ప్రముఖ ఏరోస్పేస్, అడ్వైజరీ సంస్థలతోపాటు స్టార్టప్‌లు చర్చల్లో పాల్గొన్నాయి. గత తొమ్మిదేళ్లలో తెలంగాణలో వైమానిక, రక్షణ రంగాల్లో భారీగా పెట్టుబడులు పెరిగాయని, 2018, 2020, 2022లో ఏరోస్పేస్ కేటగిరీలో ఉత్తమ రాష్ట్రంగా అవార్డులు వచ్చాయని కేటీఆర్ చెప్పారు. ఏరోస్పేస్ సిటీ ఆఫ్ ఫ్యూచర్ కేటగిరీలో హైదరాబాద్‌కు నంబర్ వన్ ర్యాంకు వచ్చిందన్నారు. తమ కార్యాలయంలో డిఫెన్స్, ఏరోస్పేస్ సభ్యులతో కేటీఆర్ చర్చలు నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నట్లు యూఎస్, ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ తెలిపింది.

రూ.2,000 నోటుపై వేటు

▶ మొదటి పేజీ తరువాయి

గమనించినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ప్రస్తుతం ఇతర డినామినేషన్లలో చెలామణీలో ఉన్న నోట్ల నిల్వ ప్రజల కరెన్సీ అవసరాలను తీర్చడానికి సరిపోతుందని స్పష్టం చేసింది. రూ.2,000 నోట్లను డిపాజిట్ చేయడానికి లేదా మార్చుకోవడానికి సెప్టెంబర్ 30 వరకు ఉన్న సమయాన్ని ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించింది.

వివాదాలకు దూరంగా కేంద్రం!

2016 నవంబర్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పెద్ద నోట్ల రద్దు ప్రకటన చేసినప్పుడు, ఆయా వ్యవహారాలను చూసే ఆర్‌బీఐని కేంద్రం తక్కువచేసిందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఈసారి దీనికి దూరంగా ఉందని, రిజర్వ్ బ్యాంకే కీలక నిర్ణయాన్ని ప్రకటించిందని అంటున్నారు.

చెలామణీలో రూ.3.62 లక్షల కోట్ల విలువైన రూ.2,000 నోట్లు

ఆర్‌బీఐ వెలువరించిన వివరాల ప్రకారం .. రూ.2,000 డినామినేషన్ బ్యాంక్ నోట్లలో దాదాపు 89 శాతం మార్చి 2017కు ముందు జారీ అయ్యాయి. వాటి జీవిత కాలం 4-5 సంవత్సరాలుగా అంచనా వేయడం జరిగింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లుగా ఉంది. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో వీటి విలువ 37.3 శాతం. ఇక 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లకు తగ్గింది. ప్రస్తుతం చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8 శాతం మాత్రమే. అంటే ఈ మొత్తమే ప్రజల నుంచి బ్యాంకింగ్ వ్యవస్థలోకి రావాలన్నమాట.



'పెద్దనోట్లు' తగ్గుతున్నాయ్!
రూ. 2 వేల నోట్ల ముద్రణ నిలిపేసిన ఆర్‌బీఐ
దాని స్థానంలో రూ. 500 నోట్లకే ప్రాధాన్యత
గత నాలుగేళ్లలో ఆ నోట్ల ప్రింటింగ్ తగ్గింపు
సమాచార హక్కు చట్టం కింద ఆర్‌బీఐ వెల్లడి

పెద్ద నోట్లు తగ్గుతున్నాయనే అంశంపై 2020 ఆగస్టులోనే సాక్షి ప్రచురించిన కథనం

నల్లధనం నియంత్రణ సాధ్యం కాదు

ఆర్‌బీఐ సర్క్యులర్ ప్రకారం చూసినా.. ఇది సాధారణ నిర్ణయంలాగే కనిపిస్తోంది. దీని వల్ల ప్రజలపై పెద్దగా ప్రభావం పడే అవకాశాలు కనిపించడం లేదు. గరిష్టంగా రూ.20 వేల విలువైన నోట్ల మార్పిడికే అవకాశం కల్పించారు. అయితే 2018లోనే రూ.2 వేల నోట్ల ముద్రణను నిలిపేశారు. కొంతకాలంగా ఇవి పెద్దగా ప్రజా వినియోగంలో లేవు. అందువల్ల రూ.2 వేల నోట్ల ఉపసంహరణ ద్వారా నల్లధనం నియంత్రణ అనేది సాధ్యం కాదు. మళ్లీ సులభంగా నగదు లావాదేవీలు పేరిట రూ.1,000 నోటును తెచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు.

–ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, ఆర్థికవేత్త, విశ్రాంత డీన్, హెచ్‌సీయూ

జన జీవితంపై ప్రభావం ఉండదు

రూ.2 వేల నోటు రద్దు అయినంత మాత్రాన జన జీవితంపై ప్రభావం ఏమీ ఉండదు. ఈ నోట్లు ఇప్పటికే ప్రజల దగ్గర లేకుండా పోయాయి. గతంలో వెయ్యి, ఐదు వందల నోట్లు రద్దు చేసినపుడు నల్లడబ్బును పట్టుకుంటామని చెప్పినా, మొత్తం బ్లాక్‌మనీ తిరిగి వైట్‌మనీగా సర్క్యులేషన్‌లోకి వచ్చింది. అయితే పెద్ద వాళ్లకు ఇదొక అగ్ని పరీక్షగా మారే అవకాశాలున్నా, వీటిని మార్చుకునేందుకు కూడా వారు అడ్డదారులు వెతుక్కుంటారు.

– డి.పాపారావు, ఆర్థికరంగ విశ్లేషకులు

సందేహాలు వద్దు.. సమాధానాలివిగో..

▶ మొదటి పేజీ తరువాయి

మార్చుకోవాలి. అన్ని బ్యాంకు శాఖలతో పాటు దేశవ్యాప్తంగా ఆర్‌బీఐకి ఉన్న 19 ప్రాంతీయ కార్యాలయాల్లో వాటిని మార్చుకోవచ్చు.

- **బిజినెస్ కరెస్పాండెంట్‌లతో మార్చుకోవచ్చా?**
  బ్యాంకుల్లో ఉండే బిజినెస్ కరెస్పాండెంట్‌ల నుంచి రోజుకు రూ.4వేలు మాత్రమే మార్చుకోవచ్చు.
- **ఏ తేదీ నుంచి నోట్లను మార్చుకోవచ్చు?**
  మే 23 నుంచి ఈ నోట్లను మార్చుకునే చాన్స్ ఉంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా బ్యాంకులు ఏర్పాట్లు చేసుకునేందుకు ఈ సమయం ఇచ్చారు.
- **ఖాతా ఉన్న బ్రాంచీలోనే మార్చుకోవాలా?**
  ఏ బ్యాంకులోనైనా చేసుకోవచ్చు. అయితే ఒకసారి రూ.20వేలు మాత్రమే మార్చుకోవచ్చు.
- **రోజుకు రూ.20 వేల కంటే ఎక్కువ డిపాజిట్ చేయవచ్చా?**
  డిపాజిట్‌పై ఆంక్షలు లేవు. రూ.2 వేల నోట్లు ఎన్ని ఉన్నా మీ ఖాతాలో డిపాజిట్ చేసుకోవచ్చు. తర్వాత మీ అవసరానికి తగ్గట్లు నగదు తీసుకోవచ్చు. అయితే కేవైసీ, ఇతర చట్టబద్ధమైన నిబంధనలను అనుసరించి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మార్చుకోవడానికి మాత్రమే రోజుకు రూ.20 వేల పరిమితి ఉంది.
- **మార్పిడికి డబ్బులు ఏమైనా చెల్లించాలా?**
  నోట్ల మార్పిడి పూర్తిగా ఉచితం. అలాగే వృద్ధులు, దివ్యాంగులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేయాలని బ్యాంకులకు సూచించారు.
- **తీసుకునేందుకు బ్యాంకు నిరాకరిస్తే?**
  తొలుత బ్యాంకు అధికారులను సంప్రదించాలి. ఫిర్యాదు చేసిన 30 రోజుల్లోగా బ్యాంకు స్పందించకపోతే.. లేదా వారు ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందకపోతే రిజర్వు బ్యాంకు-ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ స్కీమ్ (ఆర్‌బీఐ-ఐఓఎస్), 2021 కింద ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయవచ్చు.
- **సెప్టెంబర్ 30 తర్వాత పరిస్థితేంటి?**
  సెప్టెంబర్ 30 తర్వాత కూడా రూ.2,000 నోట్లు ప్రైవేటుగా ఎవరి దగ్గరైనా ఉంటే వాటి పరిస్థితి ఏంటనేది ఆర్‌బీఐ నిర్దిష్టంగా చెప్పలేదు. గతంలో రూ.500, 1,000 నోట్ల రద్దు సమయంలో డిపాజిట్ చేయడానికి ఇచ్చిన గడువు తర్వాత వాటిని ఎవరైనా ఉంచుకుంటే దాన్ని నేరంగా ప్రభుత్వం ప్రకటించింది. అయితే సెప్టెంబర్ 30 తర్వాత రూ.2,000 నోట్లను కలిగి ఉన్నవారిపై ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండబోవని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. డీమానిటైజేషన్ నిర్ణయానికి, తాజాగా రూ.2,000 నోట్ల ఉపసంహరణకు మధ్య చాలా తేడా ఉందని, దీనివల్ల ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉండదని కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ వ్యాఖ్యానించారు. కాగా పెద్ద నోట్లపై ఆధారపడటాన్ని తగ్గించి, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమే తాజా చర్య లక్ష్యమని మాజీ కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ చెప్పారు.

పెద్దగా ప్రయోజనం ఉండదు..



– ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఆర్థిక, రాజకీయరంగ నిపుణులు

గతంలో పెద్దనోట్ల రద్దు వల్ల మొత్తం నల్లడబ్బు బయటకు వస్తుందని కేంద్రం చెప్పింది. నల్లడబ్బు కేవలం నగదు రూపంలోనే ఉండదు. బంగారం, ఆస్తుల రూపంలో రకరకాలుగా ఉంటుందనే విషయం తెలిసిందే. కొన్ని అంచనాల ప్రకారం కేవలం 7 శాతమే నగదు రూపంలో ఉంటుంది. అయితే పెద్దనోట్ల రద్దు బ్లాక్‌మనీని వైట్ చేసుకునే ప్రక్రియకు ఉపయోగపడుతుందనే అనుమానాలు నిజమయ్యాయి. అప్పుడు రూ.1,000, రూ.500 రద్దు చేశారు. మళ్లీ ఇప్పుడు పెద్దనోటు ఉపసంహరించారు. మొత్తం మనీ సప్లయ్‌లో 2 వేల నోటు వినియోగం నామమాత్రమే కాబట్టి పెద్దగా ప్రయోజనం ఉండదు.

చెరుకుగడలకు టేపు చుట్టి... బాంబులని బెదిరించి

- మానవబాంబు అంటూ బ్యాంకులో యువకుడి హల్‌చల్
- సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తతతో ఊపిరి పీల్చుకున్న బ్యాంకు ఉద్యోగులు



నిందితుడు శివాజీని పట్టుకున్న సెక్యూరిటీ గార్డులు

జీడిమెట్ల (హైదరాబాద్): చేతిలో రిమోట్, ల్యాప్‌టాప్ పట్టుకుని, చెరుకుగడలకు టేపు చుట్టి బాంబులని చెప్పి బ్యాంకు సిబ్బందిని భయపెట్టి డబ్బులు నొక్కేయాలనుకున్నాడో ప్రబుద్ధుడు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో అడ్డంగా దొరికిపోయాడు. తానొకటి తలిచి వస్తే ఎదురుగున్నోళ్లు తలుపుచెక్కట్టుకుని తరిమేసినట్లుగా ఆ ప్రబుద్ధుడు అనుకున్న పనికి సెక్యూరిటీ సిబ్బంది అడ్డం పడ్డారు. శుక్రవారం జీడిమెట్లలోని ఓ ప్రైవేటుబ్యాంకులో జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. షాపూర్‌నగర్‌లోని సంజయ్‌గాంధీ నగర్‌కు చెందిన శివాజీ (32) క్రేన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతంలోని ఆదర్శ్ బ్యాంకులో సాయంత్రం ఐదుగంటలకు చొరబడ్డాడు. చేతిలో రిమోట్, ల్యాప్‌టాప్ పట్టుకుని తన నడుముకు మానవ బాంబు ఉంది డబ్బులివ్వకపోతే రిమోట్ నొక్కి బ్యాంక్‌ను పేల్చివేస్తానంటూ కొద్దిసేపు వీరంగం సృష్టించాడు. దీంతో బ్యాంకులో ఉన్న సిబ్బంది భయపడిపోయారు. ఇంతలో అదే బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తోన్న లావణ్య వెంటనే అత్యవసర బటన్ నొక్కి బ్యాంకు భద్రతా సిబ్బందిని అప్రమత్తం చేసింది. బ్యాంకు ఉన్న మొదటి అంతస్తుకు చేరుకున్న గార్డులు సుధాకర్, రాజు ధైర్యం చేసి శివాజీని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి అతడిని అదుపులోకి తీసుకున్నారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు శివాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరదాగా తిరిగొద్దామనుకుంటే..

కబళించిన మృత్యువు
- కారు ప్రమాదంలో నలుగురి మృతి
- ముగ్గురి పరిస్థితి విషమం..
- ఒకే కారులో 11 మంది ప్రయాణం... అంతా నిజాంపేట నివాసితుల పిల్లలే..

మణికొండ (హైదరాబాద్): వారంతా ఇంటర్, డిగ్రీ చదువుతున్న పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన పిల్లలు. వేసవి సెలవులు కావటంతో ఓ రోజంతా ఓషన్ పార్కు, వండర్‌లా లాంటి ప్రదేశాల్లో సరదాగా గడుపుదామని స్నేహితులతో కలిసి బయలుదేరారు. ఒకే కారులో 11 మంది ఎక్కారు. కబుర్లు చెప్పుకుంటూ, ఉత్సాహంగా వెళుతున్న వారికి ఊహించని ప్రమాదం ఎదురయ్యింది. ముందు వెళుతున్న బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో.. ఆగి ఉన్న లారీని కారు వేగంగా ఢీకొట్టింది. పిల్లల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

పార్క్ తెరవక పోవడంతో..

వీరంతా కూకట్‌పల్లి సమీపంలోని నిజాంపేట్‌లో నివసిస్తూ వాచ్‌మెన్‌లు, కూలీలుగా పనిచేస్తూ.. చిన్నచిన్న ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటున్న కుటుంబాల పిల్లలు. వీరిలో నిజాంపేటలో కూర గాయల వ్యాపారి అయిన ఈదులపల్లి శివారెడ్డి కుమార్తెలు అక్షిత, అంకిత కూడా ఉన్నారు. వీరు శుక్రవారం ఉదయమే స్నేహితులతో కలిసి తమ ట్రైబర్ (టీఎస్ 08 జీడబ్ల్యూ 3102) కారులో బయలుదేరారు. నిజాంపేటలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న ప్రసాద్ కారును నడుపుతున్నాడు. మొదట గండిపేటలోని ఓషన్ పార్కుకు 9.30 గంటల సమయంలో చేరుకున్నారు. అప్పటికి పార్కు తెరవక పోవటంతో గండిపేట చెరువు వెనుక ఖానాపూర్ వైపు అల్పాహారం కోసం వెళ్లారు. తిరిగి పార్కుకు వస్తూ ఖానాపూర్ గ్రామం దాటగానే లక్ష్మమ్మ అమ్మవారి దేవాలయం వద్ద ముందు వెళుతున్న బస్సును ఎడమవైపు నుంచి ఓవర్ టేక్ చేసేందుకు ప్రసాద్ ప్రయత్నించాడు. ఈ క్రమంలో రోడ్డుకు ఎడమవైపు నిలిచి ఉన్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ఎడమవైపు పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. దాంతో అటువైపే కూర్చున్న అంకిత (16), అక్షిత (18)లతో పాటు నితిన్ (17) అక్కడికక్కడే మృతి చెందారు. మిగతా వారిని పోలీసులు, స్థానికులు మెహిదీపట్నంలోని ప్రీమియర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాటి అమృత్ (25) అనే విద్యార్థి మృతి చెందాడు. ప్రమాద సమయంలో కారు 100 కి.మీ పైగా వేగంతో వెళుతున్నట్లు తెలిసింది.

ముగ్గురి పరిస్థితి విషమం..

కారును నడుపుతున్న ప్రసాద్‌కు తీవ్ర గాయాలు కావటంతో తొలుత మెహిదీపట్నంలోని ఆసుపత్రికి, అనంతరం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అతనితో పాటు ఎమలాపురి అర్జున్, చిన్నవుల ప్రదీప్‌కుమార్‌ల పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఎమలాపురి దివ్య, చిన్నవుల సుస్మిత, సత్యవాడ అఖిల, తాటి దనుష్యలు కూడా గాయపడ్డారని, వారి పరిస్థితి సాధారణంగానే ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. అర్జున్, దివ్యలు అక్కా, తమ్ముడు కాగా.. రెండు కుంటుంబాలకు చెందిన ఇద్దరు మృతి చెందటం, ఇద్దరు గాయపడటంతో వారి తల్లిదండ్రులు ఆసుపత్రుల కన్నీరుమున్నీరుగా విలపించారు.

అతి వేగమే కారణం..

అతి వేగంగా కారణంగానే ప్రమాదం జరిగిందని, నార్సింగి పోలీసులతో పాటు ఖానాపూర్ వాసులు తెలిపారు. బైక్ మెకానిక్‌గా పనిచేసే యువకుడు కారును నడపటం, ఎడమవైపు నుంచి ఓవర్ టేక్ చేయాలనుకోవటం, రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని గమనించక పోవడం వల్లే ప్రమాదం జరిగిందని వారు పేర్కొన్నారు.

మెడికల్ 3డి ప్రింటింగ్‌తో వైద్య ఉపకరణాలు

హైదరాబాద్‌లో జాతీయ సదస్సు

సాక్షి, హైదరాబాద్: దేశంలో ఆరోగ్య రక్షణ రంగంలో విప్లవాత్మక మార్పుల దిశగా మెడికల్ 3డి ప్రింటింగ్ ప్రస్థానం సాగుతోందని నేషనల్ సెంటర్ ఫర్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ (ఎన్‌సీఏఎం) సీఈఓ జస్ప్రీత్ సిద్ధు వెల్లడించారు. మెడికల్ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ (3డి ప్రింటింగ్)పై హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌సీఏఎం శుక్రవారం రెండో జాతీయ సదస్సు నిర్వహించింది. సిద్ధు మాట్లాడుతూ అడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ మార్కెట్ కూడా పెరుగుతోందన్నారు. 3డి ప్రింటింగ్ ద్వారా వైద్య ఉపకరణాల తయారీకి సంబంధించి వైద్య నిపుణులకు ఈ సదస్సు అవగాహన కలిగించింది. 3డి ప్రింటింగ్ టెక్నాలజీ ద్వారా దంత, వైద్య ఇంప్లాంట్లు, వైద్య ఉపకరణాలు తదితరాల డిజైన్, తయారీ అంశాలపై ఈ సదస్సు చర్చించింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ అధికారులతో పాటు దేశ నలుమూలల నుంచి 250 మంది వైద్య నిపుణులు పాల్గొన్నారు.

రాష్ట్ర వార్షిక రుణ లక్ష్యం రూ. 2.42 లక్షల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

లక్ష్యంలో 25 శాతమే చేరుకున్నాయి. ఇక బ్యాంకులు గృహ రుణాలు రూ.4,559 కోట్లు ఇవ్వగా, లక్ష్యంలో 44 శాతం చేరుకున్నట్లు ఎస్‌ఎల్‌బీసీ తెలిపింది.

వేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రంగా..

ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ మార్గనిర్దేశనంలో అనతి కాలంలోనే దేశానికి మార్గదర్శిగా తెలంగాణ నిలిచిందన్నారు. 'పెట్టుబడుల ఆకర్షణ, ఉద్యోగ కల్పనలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో గణనీయమైన వృద్ధి సాధించింది. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాన్ని అన్ని బ్యాంకులు చేరుకోవాలి. విద్య, గృహ, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు ఎక్కువ రుణాలు ఇవ్వాలి. ఆయిల్పామ్ విస్తరణకు బ్యాంకులు తోడ్పాటు అందించాలి. చిరు వ్యాపారులకు భరోసా ఇవ్వాలి. డిపాజిట్లలో అగ్రస్థానం కాబట్టి, బ్రాంచుల సంఖ్య కూడా పెంచాలి. రాష్ట్రంలోని 100 శాతం జిల్లాలు డిజిటల్ డిస్ట్రిక్స్ గా గుర్తింపు పొందడం గొప్ప విషయం. దేశ జీడీపీకి తెలంగాణ అందిస్తున్న వాటా 2014-15లో 4.1 శాతం ఉంటే, 2022-23 లో 4.8 శాతం పెరిగింది. రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ, కాళేశ్వరం సహా ఇతర సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం, ఫిషరీస్, గొర్రెల పంపిణీ తదితరాల వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2014-15లో జీఎస్‌వీఏ 16.3 శాతం ఉంటే, 2022-23కు 18.8 శాతం పెరిగింది' అని హరీశ్‌రావు చెప్పారు. సాగు విస్తీర్ణం పెరగడం వల్ల, పంట ఉత్పత్తి పెరిగి భారత ఆహార సంస్థకు అత్యధిక ధాన్యాన్ని సరఫరా చేస్తున్న రెండో రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. వరంగల్ జిల్లా తరహాలో అన్ని జిల్లాల్లో రుణ దరఖాస్తులు పెరిగేలా చూడాలని చెప్పారు. రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు వంటి పథకాల డబ్బును బ్యాంకుల ద్వారా లబ్ధిదారులకు అందిస్తుమని, వీటిని ఎక్కడా ఆపవద్దని కోరారు. టీఎస్ ఐపాస్ విధానం వల్ల 2022-23లో 2,518 కొత్త పరిశ్రమల ద్వారా రూ. 20,237 కోట్ల పెట్టుబడులు ఆకర్షించగా, 72,908 మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ మంత్రి నిరంజన్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్ దేబశిష్ మిత్రా పాల్గొన్నారు.

రియల్ రంగంలోకి 'సుడా'

▶ మొదటి పేజీ తరువాయి

తాగునీటి సౌకర్యం.. ఇలా సకల సౌకర్యాలతో మోడల్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నారు.

నేడు ప్రీబిడ్ మీటింగ్: ఈ నెల 29న తొలి విడతలో 101 ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా ముందుగా ప్రీబిడ్ మీటింగ్‌ను శనివారం పట్టణంలోని విపంచి కళానిలయంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పాట్లు కొనుగోలు చేయాలనుకునే వారి సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఒక్కో గజానికి ప్రభుత్వ ధరగా రూ.8 వేలు నిర్ణయించారు. ఆ ధర నుంచి సుడా అధికారులు వేలం ప్రారంభించనున్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు దరఖాస్తు ఫీజు కింద రూ.5 వేలు చెల్లించాలి. కాగా, ప్లాట్ల విక్రయాల ద్వారా వచ్చిన డబ్బుతో సుడా ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు చేపడతారు. కాగా మోడల్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తామని సుడా వైస్ చైర్మన్ రమణాచారి చెప్పారు. ఈ నెల 29న వేలం పాట నిర్వహిస్తామన్నారు.

అసైన్డ్ భూముల్లో 'రియల్' వ్యాపారం ఆపాలి: బండి



సాక్షి, హైదరాబాద్: దళితులు, గిరిజనులకు కేటాయించిన అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు సీఎం కేసీఆర్‌కు సంజయ్ శుక్రవారం బహిరంగలేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వాలు భూములు కేటాయిస్తే.. రక్షించాల్సిందిపోయి బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని ఆక్రమించడం దుర్మార్గమని మండిపడ్డారు. సిద్దిపేటలో దళితుల భూముల్లోనే వెంచ్ ప్రారంభించారని, శంషాబాద్‌లో గిరిజనుల భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు ప్రయత్నిస్తుస్తున్నదని ఆరోపించారు.

బీసీ డిక్లరేషన్ పేరిట బీజేపీ మోసం

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు, మండల్ కమిషన్ సిఫారసులను అడ్డుకునేందుకు గతంలో రథయాత్ర చేసిన బీజేపీ, ప్రస్తుతం బీసీ డిక్లరేషన్ పేరిట ప్రజలను మోసం చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ మాటే తెలంగాణ ప్రజలకు డిక్లరేషన్ లాంటిదని, కేసీఆర్ ముందు బీజేపీ జిమ్మిక్కులు పనిచేయవని అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీకి దమ్ముంటే ఆ పార్టీ పాలన ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ, బీసీ జనగణన, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే బీజేపీకి మద్దతు ఇస్తామన్నారు.

నీవే వాయుదేవుడవు, యముడవు, అగ్నివి, వరుణుడవు,
చంద్రుడవు, ప్రజాపతియైన బ్రహ్మవు, బ్రహ్మకును జనకుడవు.
నీకు వేలకొలది నమస్కారములు. మరల మరల నమస్కారములు.
– భగవద్గీత

సాక్షి
శనివారం, 20 మే 2023

ఆచి తూచి వ్యవహరించాలి


యుద్ధోన్మాదం పర్యవసానంగా మనిషి మృగంగా మారితే ఏమవుతుందో ప్రపంచానికి ఇప్పటికీ చాటుతూనే ఉన్న హిరోషిమా నగరంలో శుక్రవారం మూడురోజులపాటు జరిగే జీ–7 దేశాల శిఖరాగ్ర సదస్సు ప్రారంభమైంది. 15 నెలలుగా ఎడతెరిపి లేకుండా కొనసాగుతున్న రష్యా–ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో సహజంగానే ఈ సదస్సులో అది ప్రధానంగా చర్చకొస్తుంది. ఉక్రెయిన్‌లో రష్యా 'వ్యూహాత్మక ఓటమి'కి అందరూ ఏకం కావాలంటూ ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ పిలుపునిచ్చారు. పాశ్చాత్య దేశాలన్నీ రష్యాకు వ్యతిరేకంగా ఒక్కటయ్యాయి. ఉక్రెయిన్‌కు ఆయుధాలందిస్తూ రష్యా యుద్ధ వ్యూహాలను వమ్ముచేస్తున్నాయి. అయితే అదొక్కటే సరిపోదు. జీ–7 సమావేశాల వేదిక హిరోషిమా గనుక ఆ దేశాధినేతలందరూ చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా ఆలోచించి ఈ యుద్ధాన్ని కట్టడి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలేమిటన్న అంశంపై దృష్టి సారించాలి. గెలుపోటముల సంగతలావుంచి ఇది అణుయుద్ధంగా పరిణమించకుండా ఏంచేయాలో ఆలోచించాలి. ఎందుకంటే హిరోషిమా, నాగసాకి పట్టణాలపై రెండో ప్రపంచ యుద్ధ సమయంలో 1945 ఆగస్టు 9న అమెరికా అణుబాంబులు ప్రయోగించటం పర్యవసానంగా ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఆనాటి విషాద ఉదంతాల్లో రెండు లక్షలమందికిపైగా మృత్యువాత పడ్డారు. అనంతర దశాబ్దాల్లో మరిన్ని లక్షలమంది దీర్ఘకాల వ్యాధుల బారినపడి చనిపోయారు. బాంబు జారవిడిచిన ప్రాంతానికి చుట్టూవున్న 11 చదరపు కిలోమీటర్ల పరిధిలో కనీవినీ ఎరుగని విధ్వంసం చోటు చేసుకుంది. తరాలు గడుస్తున్నా ఇప్పటికీ అంగవైకల్యంతో జన్మిస్తున్నవారు అక్కడ ఎక్కువే. ఈ శిఖరాగ్ర సదస్సు అణు నిరాయుధీకరణ, అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక చర్యలపై దృష్టి సారిస్తుందంటున్నారు. అయితే అణ్వస్త్ర దేశాలన్నీ తమ వద్ద ఉన్న అణ్వాయుధాలను స్వచ్ఛందంగా వదులుకోవడానికి ముందుకు రానంతవరకూ ఈ లక్ష్యాలు నెరవేరవు. ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధంలో అణ్వస్త్రాలు ప్రయోగిస్తామని తరచు పుతిన్ బెదిరిస్తున్నారు. ఉత్తరకొరియా అణు క్షిపణులను అభివృద్ధి చేస్తున్నానంటున్నది. ఈ పరిణామాలు ఆందోళనకరమైనవే. కాదనలేం. అయితే తమ దగ్గర తప్ప వేరే ఎవరివద్దా అణ్వస్త్రాలు ఉండరాదన్న వాదంతో ఈ ప్రమాదాన్ని ఎదుర్కొనటం సాధ్యం కాదు. అసలు ఎవరిదగ్గరైనా మానవాళిని సర్వనాశనం చేసే ఆయుధాలు ఎందుకుండాలన్న ప్రశ్న ఎవరికి వారు వేసుకోవాలి. అమెరికా అణు ఛత్రఛాయలో కొనసాగుతున్న జపాన్ అణునిరాయుధీకరణ గురించి మాట్లాడటంపై విమర్శలు తలెత్తటంలో వింతేమీ లేదు.

జీ–7 సభ్యదేశాల ముందు పెద్ద ఎజెండాయే ఉంది. తైవాన్‌కు చైనా నుంచి వస్తున్న బెదిరింపులు, గతంలో పాశ్చాత్య దేశాలకు వలసలుగా ఉండి స్వాతంత్ర్యం పొంది ఇప్పుడు రష్యా, చైనాలకు సన్నిహితమవుతున్న పేద దేశాల విషయంలో అనుసరించాల్సిన వ్యూహం ఇందులో చర్చకు రాబోతున్నాయి. ఆర్థిక స్థితిగతులు సరేసరి. అరబ్ దేశాల వైఖరితో తలెత్తిన చమురు సంక్షోభం, దాన్ని వెన్నంటి వచ్చిన ఆర్థిక మాంద్యంతో నిలువెల్లా వణికిన పాశ్చాత్య దేశాలు 1975లో ఒక్కటై జీ–6గా ఏర్పడ్డాయి. ఇందులో ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, బ్రిటన్‌లతోపాటు అమెరికా చేరింది. ఆ మరుసటి ఏడాది కెనడా చేరికతో అది జీ–7 అయింది. చిత్రమేమంటే...అప్పటికి ప్రపంచ ఆర్థిక కార్యకలాపాల్లో యాభై శాతం వాటావున్న ఈ దేశాలకు ఇప్పుడు 30 శాతం మించిలేదు. చైనా, భారత్, బ్రెజిల్ ఆర్థిక వ్యవస్థలు చురుకందుకున్నాయి. రష్యా, చైనాలవైపు మొగ్గుతున్న పేద దేశాలకు ఆరోగ్యం, ఆహారభద్రత, మౌలిక సదుపాయాల కల్పన తదితర రంగాల్లో తోడ్పాటునందిస్తూ వాటిని అక్కున చేర్చుకోవాలని జీ–7 దేశాలు భావిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ ఇంధన సంస్థ, ఓఈసీడీ తదితర సంస్థల ప్రతినిధులు కూడా హాజరవుతున్నారు గనుక ఆ దిశగా విధాననిర్ణయాలుండొచ్చు. ఇక రష్యా చమురుపై విధించిన ఆంక్షల అమలుపై ఇందులో చర్చిస్తారంటున్నారు. దాంతోపాటు వజ్రాల వ్యాపారంలో కూడా రష్యాను కట్టడి చేయటంపై జీ–7 దృష్టి సారించబోతోంది. ఇది నేరుగా భారత్‌నూ, ప్రత్యేకించి గుజరాత్‌లో అధికంగా ఉన్న వజ్రాల పరిశ్రమనూ ప్రభావితం చేస్తుంది. ప్రపంచ వజ్రాల వ్యాపారంలో 40 శాతం వాటా ఉన్న రష్యా, గుజరాత్‌లోని సూరత్ వజ్రాల పాలిషింగ్ పరిశ్రమపై ప్రధానంగా ఆధారపడుతుంది. రష్యాపై విధిస్తున్న ఆంక్షలవల్ల ఆ దేశం ఒక్కటే కాదు... ముడి చమురు, వజ్రాలు తదితర ఉత్పత్తులపై ఆధారపడుతున్న భారత్‌వంటి దేశాలకు సైతం ఇబ్బందులు తలెత్తుతాయి. జీ–7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్న ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో మన వైఖరిని స్పష్టంగా తెలియజేయటం అవసరం.

ప్రచ్ఛన్న యుద్ధం ముగిసి మూడు దశాబ్దాలవుతోంది. ఇన్నేళ్లుగా ప్రపంచ దేశాల మధ్య పరస్పర విశ్వాసం వల్ల అయితేనేమి, ఎవరూ తొలుత అణ్వాయుధాలు వినియోగించరాదన్న నియమం పెట్టుకోవటం వల్ల అయితేనేమి ప్రమాదం లేకుండా పోయింది. అయితే ఆ దశ ముగిసి పరస్పరం హెచ్చరికలు, సవాళ్ల పర్వం మొదలైంది. యుద్ధం సంప్రదాయ ఆయుధాల పరిధిలోనే పరిభ్రమిస్తుందనుకోవటం ఆత్మవంచనే అవుతుంది. కనుక జీ–7 దేశాలు అత్యంత జాగురూకతతో ఈ అంశాన్ని పరిశీలించాలి. ఉక్రెయిన్‌కు ఆయుధాలందజేస్తూ పోవటం, ఆంక్షలు అమలు చేయటంవల్ల రష్యా లొంగుబాటులోకొస్తుందా, అది మరింత రెచ్చిపోయి ఉన్మాద స్థితికి చేరుతుందా అన్నది గమనించుకోవాలి. విజ్ఞతతో వ్యవహరించాలి. ఆ యుద్ధాన్ని ఆపటమే ధ్యేయంగా తదుపరి చర్యలుండాలి.

పెద్దన్నల రూట్ మారితే...

విశ్లేషణ



శ్యామ్ శరణ్

అమెరికా, చైనా మధ్య తుది ఘర్షణ చోటు చేసుకుంటే ఇది భారతదేశానికి వ్యూహాత్మక విన్యాసానికి చోటు లేకుండా చేస్తుంది. స్నేహితుడు, ప్రత్యర్థి ఇద్దరి నుంచీ 'నువ్వు ఉంటే మాతో ఉండు లేదా వ్యతిరేకంగా ఉండు' అనే ఒకే రకమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. కానీ ఆశ్చర్యకరంగా అమెరికా, చైనా మధ్య సంబంధాల 'స్థిరీకరణ' ప్రయత్నాలు సాగుతున్నాయి. ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు చైనా అప్రకటిత మద్దతు చెప్పడం కూడా వీటిని ఆపడం లేదు. ఈ పరిణామాలపై అప్పుడే భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేకపోవచ్చు. కానీ భారత్ ప్రయోజనాలపై ఇవి ప్రభావం చూపుతాయి కాబట్టి వీటిని జాగ్రత్తగా, నిర్దిష్టంగా అంచనా వేయాల్సి ఉంటుంది.

గత కొన్ని సంవత్సరాలుగా, తన ప్రపంచాధిపత్యానికి చైనా ముప్పు కలిగిస్తూ ఎదుగుతోందని అమెరికా గ్రహిస్తోంది. రెండు దేశాల మధ్య బలాబలాల అంతరం క్రమంగా క్షీణిస్తోంది. ఆర్థిక, సైనిక, సాంకేతికపరమైన ప్రతిశక్తి కొలమానంలోనూ ఇది కనిపిస్తోంది. ప్రపంచంలోనే చైనా రెండో అతిశక్తిమంతమైన దేశం. అమెరికాను అగ్రపీఠం నుంచి తప్పించి తాను నంబర్ వన్ దేశంగా మారాలన్న తన ఆకాంక్షను వ్యక్తపర్చే విషయంలో చైనా ఏమాత్రం మొహమాటపడదు. కాబట్టి రెండు దేశాల మధ్య ఘర్షణ వ్యవస్థీకృతంగానే ఉంటోంది.

పరివర్తన చెందుతున్న భౌగోళిక రాజకీయ వ్యవస్థ కేంద్రంగా తాను ఆవిర్భవించడం అనివార్యమని చైనా అభిప్రాయం. దీన్ని వెనక్కి తిప్పలేకపోయినా, కనీసం ఈ పరిణామాన్ని ఆపాలని అమెరికా కృతనిశ్చయంతో ఉంది. ఈ క్రమంలో ఎవరు నెగ్గుతారు అనేది స్పష్టం కావడం లేదు కానీ, దీని పర్యవసానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకించి ఆసియా దేశాలపై ప్రభావం చూపుతాయి. ఈ కారణం చేత, అమెరికా–చైనా సంబంధాలలోని పరిణామాలను చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంది. ఎందుకంటే అవి భారత్ భౌగోళిక రాజకీయ అవకాశాలపై గణనీయంగా ప్రభావితం చూపుతాయి.

నేను భారత్ దృక్కోణాన్ని అందిస్తాను. అన్ని రకాల ఘర్షణ, కుట్రల కోణంలో చూస్తే– అమెరికా, చైనా సంబంధాలు చివరి ఘర్షణ వైపుగా పయనిస్తున్నాయని అనుకోవచ్చు. కానీ ఈ తుది ఘర్షణ భారతదేశానికి ఒక వ్యూహాత్మక విన్యాసానికి చోటు లేకుండా చేస్తుంది. స్నేహితుడు, ప్రత్యర్థి ఇద్దరి నుంచీ 'నువ్వు ఉంటే మాతో ఉండు లేదా వ్యతిరేకంగా ఉండు' అనే ఒకే రకమైన ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎత్తుగడల రీత్యా అయినా సరే... నిర్దిష్ట ప్రభావిత రంగాలను గుర్తించడం ద్వారా తమ మధ్య పోటీని నియంత్రించడానికి రెండు పార్టీలూ తీసుకునే నిర్ణయం నుంచే అమెరికా, చైనా మధ్య పొత్తు సంభవించవచ్చు. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, నాటి సోవియట్ యూనియన్ మధ్య జరిగింది ఇదే. అలాంటిది ఏదైనా జరిగినప్పుడు చైనా తూర్పు ప్రపంచంపై తన ఆధిపత్యాన్ని స్పష్టంగా నొక్కి చెప్పుతుంది, అదే సమయంలో పశ్చిమార్ధగోళంలో అమెరికా ప్రాభవాన్ని అంగీకరిస్తుంది. చైనీస్ వ్యూహకర్తలు తరచుగా ఈ దోపిడీ విభజనను పశ్చిమ పసిఫిక్ మధ్య గీత గీయడం ద్వారా నొక్కి చెబుతారు. అప్పుడు హిందూ మహాసముద్రం వ్యూహాత్మకంగా చైనా ప్రభావంలో పడిపోతుంది. ఇది భారత్‌కు శాపం అవుతుంది. ఈ ఆకస్మికత అసంభవంగా కనిపిస్తున్నప్పటికీ, దాన్ని పూర్తిగా తోసిపుచ్చకూడదు.

ఈ నేపథ్యంలో అమెరికా, చైనా సంబంధాల్లోని ఇటీవలి కొన్ని పరిణామాల ప్రాధాన్యత ఏమిటి? మే 10, 11న అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సల్లివాన్, చైనా ప్రభుత్వ కౌన్సిలర్, మాజీ



విదేశాంగ మంత్రి వాంగ్ యీని వియన్నాలో కలిశారు. 'యుఎస్–చైనా ద్వైపాక్షిక సంబంధం, అంతర్జాతీయ, ప్రాంతీయ భద్రతా సమస్యలకు సంబంధించిన కీలక అంశాలపై నిష్కపటమైన, వాస్తవికమైన, నిర్మాణాత్మక చర్చలు జరిగా'యని వైట్ హౌస్ నివేదించింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం, తైవాన్ సమస్య తదితర అంశాలపై కూడా చర్చలు జరిగినట్లు తెలిపింది.

ఈ చర్చలను వివరించడానికి చైనా షిన్హ్వా న్యూస్ ఏజెన్సీ కూడా ఇదేవిధమైన పదజాలాన్ని ఉపయోగించింది. 'చైనా–అమెరికా సంబంధాల్లోని అవరోధాలను తొలగించి, స్థిరీకరించడంపై ఇరుపక్షాల మధ్య నిష్కపటమైన, లోతైన, వాస్తవికమైన, నిర్మాణాత్మక చర్చలు జరిగా'యని నివేదించింది.

ఇది అమెరికా, చైనా మధ్య వివిధ స్థాయిల్లో ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాల్లో చర్చలు, సంభాషణల పునరుద్ధరణకు మార్గాన్ని సుగమం చేసింది. అమెరికా వాతావరణ విభాగానికి సంబంధించి అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత జాన్ కెర్రీని చైనా సందర్శనకు ఆహ్వానించారని నివేదించారు కూడా. అమెరికా వాణిజ్య ప్రతినిధి కేథరీన్ తాయ్ మే 25–26 తేదీల్లో డెట్రాయిట్‌లో జరగనున్న అపెక్ వాణిజ్య మంత్రుల సమావేశంలో చైనా వాణిజ్యమంత్రి వాంగ్ వెన్‌తావోతో చర్చలు జరపనున్నారు. జూన్ నెలలో సింగపూర్‌లోని షాంగ్రి–లా చర్చల్లో అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, చైనా రక్షణమంత్రి జనరల్ లీ షాంగ్‌ఫుతో భేటీ కానున్నారు. చైనాలో నూతన రాజకీయ ప్రతినిధులతో కమ్యూనికేషన్ ఛానల్స్ ఏర్పాటుపై అమెరికా ఆసక్తితో ఉన్నట్లు కనిపిస్తోంది. బీజింగ్ కొత్త నాయకత్వంలో అనేక కొత్త ముఖాలు కనిపిస్తున్నాయి. దీనికి సంబంధించి చైనా పక్షం ముందడుగు వేస్తున్నట్లు కనిపిస్తోంది.

ఏప్రిల్ 20న జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీలో చేసిన, జాగ్రత్తగా రూపొందించిన ప్రసంగంలో అమెరికా ట్రెజరీ సెక్రటరీ జానెట్ ఎల్లెన్, అమెరికా–చైనా పొత్తులో ఈ నూతన దశ గురించి సంకేతాలిచ్చారు. 'సంపద్వంతమైన చైనా... అమెరికాకు, ప్రపంచానికి కూడా మంచిదే కాబట్టి పెరుగుతున్న చైనా సంపద ప్రమాదకరమని అమెరికా ఏమాత్రమూ భావించడంలే'దని ఎల్లెన్ ఆ ప్రసంగంలో వివరించారు. చైనా నుంచి మన ఆర్థిక వ్యవస్థను విడగొట్టాలని అమెరికా చూడటం లేదని ఆమె చెప్పారు. 'మన రెండు ఆర్థిక వ్యవస్థలూ సంపూర్ణంగా వేరుపడిపోతే అది రెండు దేశాలకూ వినాశకరమవుతుంది, అది తక్కిన ప్రపంచాన్ని కూడా అస్థిరపరుస్తుంది' అని ఆమె చెప్పారు. ఈ అంశాన్ని నొక్కి చెప్పడానికిగానూ, అమెరికా–చైనా వాణిజ్యం ప్రస్తుతం 750 బిలియన్ డాలర్లకు చేరుకుందని ఆమె తెలిపారు.

ఇది దేన్ని సూచిస్తుంది? ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యాకు చైనా నిశ్శబ్ద మద్దతు ప్రకటించడం అనేది చైనాతో సంబంధాల 'స్థిరీకరణ' కోసం అమెరికా చేపట్టిన ఈ ముఖ్యమైన చర్యను నిరోధించలేదు. ఇటీవలి కాలంలో ఘర్షణాత్మక దిశకు దారితీసిన తైవాన్ సమస్య ఇప్పుడు కాస్త సద్దుమణిగినట్లు కనిపిస్తోంది. చైనా పక్షం నుంచి కూడా దీనిపై కొన్ని వ్యాఖ్యలు వస్తున్నాయి. తైవాన్ స్థితి గీత దాటకూడని బాటమ్ లైన్‌కి ప్రాతినిధ్యం వహిస్తోందనీ, అది అమెరికా, చైనా సంబంధాల సంపూర్ణత్వాన్ని సూచించదనీ చైనా పేర్కొంది. స్పష్టంగానే, తైవాన్ జలసంధిలో ప్రమాదకరమైన ఘర్షణ నుంచి వెనక్కు మళ్లాలని ఇరు పక్షాలూ నిర్ణయించుకున్నాయి.

అమెరికా తీసుకున్న చొరవ తర్వాత గత నెలలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మెక్రాన్ చైనాను సందర్శించారు. ఉక్రెయిన్‌పై చైనా వైఖరి భిన్నంగా ఉన్నప్పటికీ ఇది చైనాను బుజ్జగించడానికి సంబంధించినదే అనడంలో సందేహం లేదు. చైనాను 'వ్యవస్థీకృత' ప్రత్యర్థిగా నిర్వచించినప్పటికీ, ఫ్రాన్స్, జర్మనీ రెండూ చైనాతో సంబంధాలు కొనసాగాల్సిన ప్రాధాన్యతను నొక్కి చెప్పాయి.

భారత్ ఈ పరిణామాల పట్ల ఆందోళన చెందాల్సిందేనా? బహుశా ఈ దశలో అవసరం లేకపోవచ్చు. ఎందుకంటే ఈ పరిణామాలన్నీ ఏ దిశను అనుసరిస్తాయో ఇంకా స్పష్టం కావడం లేదు. పైగా ఏదో అంశంపై తిరిగి ఘర్షణ ఏర్పడటం ద్వారా లేదా వివాదాస్పద సమస్య ద్వారా అమెరికా, చైనా బంధాలు మళ్లీ పట్టాలు తప్పుతాయా అన్నది కూడా అస్పష్టమే. అయితే ఇవి ఎలా పరిణమిస్తాయన్నదే భారత్ ప్రయోజనాలపై ప్రభావం చూపుతుంది కాబట్టి వీటిని జాగ్రత్తగా, నిర్దిష్టంగా అంచనా వేయాల్సి ఉంటుంది. కాకతాళీయంగా, చైనాతో సాయుధ ఘర్షణ సంభవించిన పక్షంలో భారత్‌పై అమెరికా పెద్దగా ఆధారపడి లేదని అమెరికాలో పలు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అంటే అమెరికా, చైనా మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవడంపై భారత్ ప్రతిస్పందనల పట్ల అమెరికా పెద్దగా సావధానత చూపదని ఇది సూచిస్తుంది.

వ్యాసకర్త విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెల్లుకు చెల్లు



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ 1990లో కేరళ ముఖ్యమంత్రికి హిందీలో లేఖ రాశారు, ఇంగ్లిష్ కాపీ లేకుండా. కేరళ సీఎం ఇ.కె. నయనార్ దానికి మలయాళంలో బదులిచ్చారు, ఇంగ్లిష్ కాపీ లేకుండా. అప్పుడు ఆగ్రహంతో ములాయం తిరిగి ఇంగ్లిష్‌లో లేఖ రాశారు. ఇవ్వాళ (మే 19) కామ్రేడ్ నయనార్ వర్ధంతి.

– అద్వైద్, చరిత్రకారుడు

అంతా?



క్రెడిట్ కార్డ్ (ఇంటర్నేషనల్) లావాదేవీల సౌకర్యం పొందడానికి పౌరులు ముందస్తు పన్నులు చెల్లించాల్సిన ఏకైక దేశం ప్రపంచంలో ఇండియా ఒక్కటే; అది కూడా 20 శాతం!

– గోవింద్‌రాజ్ ఎతిరాజ్, జర్నలిస్ట్

ఇట్టే వెళ్లొచ్చు



ఇండియాలోని పెద్ద నగరాలను దర్శించడం కన్నా నిజానికి థాయిలాండ్ పర్యటించడం చవక. మధ్యశ్రేణి హోటళ్లు 2,500–3,000 మధ్య ఉంటాయి. స్ట్రీట్ ఫుడ్ చాలా చవక (రూ. 95–150). ఏసీ ఫుడ్ కోర్ట్స్ కొంచెం ఎక్కువంతే. చాలాభాగం దక్షిణాసియా చూడ్డానికి మనం 'ధనవంతులం' కానక్కర్లేదు.

– మధు మేనన్, ఫొటోగ్రాఫర్, చెఫ్

ఎదుగుతాడు



సంతుష్టిగా ఉన్న మనిషి అల్ప విషయాలను విస్మరించగలిగి, అతిముఖ్య వాస్తవాలతో జీవించగలడు. క్లుప్తంగా చెప్పాలంటే, అతడు సాధారణంగా జీవిస్తూ అత్యున్నతంగా ఆలోచించడాన్ని సాధన చేస్తాడు.

– మౌలానా వహీదుద్దీన్ ఖాన్, ఇస్లామిక్ పండితుడు

ఆటలు చెల్లవు



ముస్లిం బ్రదర్‌హుడ్ తీవ్రవాదులకు అత్యంత దుస్స్వప్నంగా నిలుస్తున్న దేశం ఏదైనా ఉందంటే అది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ).

– హసన్ సజ్వానీ, పారిశ్రామికవేత్త

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఏ వర్సిటీని చూసినా ఏమున్నది...

సమాజానికి దిక్సూచిగా నిలవాల్సిన తెలంగాణ 'రాష్ట్ర విశ్వవిద్యాలయాలు' ప్రస్తుతం వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ వర్సిటీల ఉపకులపతులు (వీసీలు) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. కొందరు ప్రభుత్వ ఆదేశాలనూ బేఖాతరు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. తెలంగాణ వర్సిటీలో అనధికార పదోన్నతులు, అక్రమ నియామకాలు, నిధుల దుర్వినియోగం తదితర అంశాల్లో వీసీపై విజిలెన్స్, ఏసీబీకి ఫిర్యాదు చేయాలని విశ్వవిద్యాలయం పాలకమండలి సమావేశంలో తీర్మానించడం గమనార్హం. దీంతో పాటు పలు ఇతర వర్సిటీల్లోనూ పాలన గాడి తప్పింది. నేటి ఉపకులపతులు 2021 సంవత్సర మధ్య కాలంలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. దాదాపు రెండు సంవత్సరాలు పూర్తయినా ఇంత వరకు యూనివర్సిటీల ప్రధాన సమస్యలను వారు పట్టించుకోవడం లేదు.

ఉపకులపతుల నియామకం కోసం 2021లో జరిగిన సెర్చ్ కమిటీల సమావేశాల సమయంలోనే పలువురి పేర్లపై ఆరోపణలు వచ్చాయి. పీహెచ్‌డీ విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలతో మూడేళ్లపాటు ఓ ఆచార్యుడి గైడ్ షిప్‌ను ఓ విశ్వవిద్యాలయం రద్దు చేసింది. ఆ విషయం సర్కారు దృష్టికి వెళ్లినా ఆయనను ఒక వర్సిటీకి ఉపకులపతిగా నియమించారు. ఇప్పుడు ఆయనే ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ప్రొఫెసర్‌గా పదేళ్ళ అనుభవం లేని వారిని, గతంలో అవినీతి ఆరోపణలు ఉన్న వారినీ, నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ వయస్సు ఉన్న వారినీ వీసీలుగా అవకాశాలు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్రంలో రెండో అతిపెద్దదైన కాకతీయ విశ్వవిద్యాలయంలో పదవీ విరమణ పొందిన ఆచార్యుని రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తుండటం విమర్శలకు తావిచ్చింది. ఆయన పదవీ కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ సర్కారు జీ.వో ఇవ్వటం విడ్డూరం. తమ అనుమతి లేకుండా ఏ ఒక్క ఉద్యోగినీ నియమించరాదని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా, కొద్ది రోజుల క్రితం జేఎన్‌టీయూహెచ్‌లో పొరుగు సేవల కింద పలువురిని నియమించడం చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు కళాశాలలు స్వయంప్రతిపత్తి దిశగా అభివృద్ధి చెందాలని యూజీసీ చెబుతుండగా, ఈ వర్సిటీలో ఓ విభాగానికి అటానమస్ హోదా రద్దు చేసి ఇంజినీరింగ్ కళాశాలలో విలీనం చేయాలన్న నిర్ణయం వివాదాస్పదంగా మారింది. వర్సిటీ పరిధిలో డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లను పదవీకాలం ముగియకముందే మారుస్తూ ఉన్నారన్న విమర్శలూ ఉన్నాయి.

బాసర ఆర్‌జీయూకేటీలో భోజనం బాగుండటం లేదని, మెస్ గుత్తేదారును మార్చాలని తొమ్మిది నెలల క్రితం విద్యార్థులు ఆందోళన చేశారు. వారం రోజుల్లో కాంట్రాక్టు రద్దు చేస్తామని అప్పట్లో వీసీ ప్రకటించారు. తర్వాత ఐటీ మంత్రి సైతం ఆరా తీశారు. అయినా ఇప్పటికీ పాత కాంట్రాక్టరే కొనసాగుతున్నారు.

ఇక ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ ఫీజును రూ. 2,500 నుంచి ఏకంగా ఇప్పుడు రూ. 25 వేలకు పెంచడం విమర్శలకు తావిచ్చింది. పరిశోధన విద్యార్థులకు ప్రోత్సాహకంగా ఫెలోషిప్‌లు ఇవ్వడానికి బదులు, పేద విద్యార్థులను పరిశోధనకు దూరం చేసేలా అధిక ఫీజులు పెంచటం ఎంతవరకు సమంజసమని విద్యార్థి, అధ్యాపక సంఘాలవారు ప్రశ్నిస్తున్నారు. శాతవాహన వర్సిటీ ప్రస్తుత ఉపకులపతి రాగానే '12–బి' స్టేటస్ తీసుకరావడంలో కృషి చేసినా అక్కడ కూడా క్రీడా విభాగంలో ఒక అధ్యాపకుని ఆధ్వర్యంలో



నిధులు దుర్వినియోగం జరిగిందనీ, ఆయనను తొలగించాలని విద్యార్థి సంఘాలు విన్నవించినా ప్రయోజనం లేదు.

ప్రస్తుతం ఉన్న వీసీలు పదవులు చేపట్టి రెండేళ్లయినా... రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలను చేపట్టలేదు. కొత్త కోర్సుల ప్రస్తావన లేదు. ఉన్న కొన్ని కోర్సుల నిర్వహణ కూడా సరిగా లేదు. సకాలంలో పీహెచ్‌డీ ప్రవేశాలు కూడా చేయట్లేదు. ఫీజులను అధికంగా పెంచారు. ఈ ధోరణి మానుకొని ఇప్పటికైనా ఉపకులపతులు అందరూ యూనివర్సిటీల అభివృద్ధికై కృషి చేస్తారని ఆశిద్దాం!

– జి.వి.ఆర్., హైదరాబాద్

ప్రతి చోటా సమస్యల తోరణమే!

సమాజంలోని రుగ్మతలను అర్థం చేసుకొని, అధ్యయనం చేసి పరిష్కారాలను అందించాల్సిన విశ్వవిద్యాలయాలు ఈరోజు అందుకు పూర్తి విరుద్ధమైన వాతావరణంలో మనుగడ సాగిస్తున్నాయి. అవి సమస్యల నిలయాలుగా, అక్రమ నియామకాల అడ్డాలుగా, ప్రజాధనం కొల్ల గొట్టే దోపిడీ కేంద్రాలుగా, రాజకీయ ప్రాపకం ఉన్న వారి ఇష్టా రాజ్యాలుగా మారిపోయాయి.

గత కొన్ని రోజులుగా 'తెలంగాణ వర్సిటీ'లో వీసీ – పాలక మండలి (ఈసీ) సభ్యులకు మధ్య జరుగుతున్న యుద్ధం... విద్యార్థులు, టీచర్లు, ఇతర ఉద్యోగులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు వీసీ పాలకమండలి సమావేశానికి హాజరు కాకపోవడం, పాలకమండలి వీసీపై విచారణ కమిటీలు వేయడం; మరో వైపు, వీసీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గదికి తాళం వేయించాడనే వార్తలు రావడం, రాజకీయ నాయకులు కొందరు వీసీని సస్పెండ్ చెయ్యాలని గవర్నర్‌ను కోరడం వంటి వార్తలు చర్చనీయంగా మారాయి.

ఇటీవల బాగా వివాదాస్పదంగా వ్యవహరిస్తున్న మరో ఉపకులపతి కాకతీయ యూనివర్సిటీకి చెందిన ప్రొ. రమేష్. ఆయన కాకతీయ వర్సిటీలో వీసీగా నియామకం అయిన వెంటనే ఆ నియామకం అక్రమంగా జరిగిందనీ, వెంటనే నియామకాన్ని రద్దు చేయాలనీ ఉస్మానియా వర్సిటీ విశ్రాంత ఆచార్యులు ప్రొ. మనోహర్ రావు, నిజామాబాద్ డిగ్రీ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపాల్ డా॥ విద్యాసాగర్ రెడ్డిలు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ కేసు ఇంకా తేలకపోవడంతో వర్సిటీ వీసీ దూకుడు ఎక్కువైందని అధ్యాపక సంఘ నాయకులు అంటున్నారు. వ్యక్తిగత విభేదాల కారణంగా పదోన్నతులు రాకుండా అడ్డుకోవడం, మరొకరికి డిమోషన్ కల్పించడం వంటి ఆరోపణలనూ వీసీ ఎదుర్కొంటున్నారు. భౌతికంగా ఎక్కడా లేని సెంటర్ల పేరు మీద సెమినార్లు నిర్వహిస్తూ లక్షల డబ్బును దుర్వినియోగపరుస్తున్నారనే విమర్శ అయనపై ఉంది.

ప్రశ్నించే విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులపై అక్రమ కేసులు పెట్టుకుంటూ, బదిలీలు చేస్తూ, షోకాజ్ నోటీసులు ఇస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకుండా యూజీసీ నిబంధనలకు విరుద్ధంగా 12 మంది అనుబంధ అధ్యాపకుల నియామకం, ఆ నియామకంలో జరిగిన అవకతవకలను ఒకవైపు వార్తా పత్రికలు ఘోషించినా వీసీ పట్టించుకోకుండా ఒంటెద్దు పోకడతో పాలన సాగించడం పట్ల విద్యార్థి, ఉద్యోగ సంఘాల నాయకులు భగ్గుమంటున్నారు.

రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లో ఇటువంటి అపసవ్య వ్యవహారాలే జరుగుతున్నా ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర వహించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వమే వీసీలను నియమించింది కాబట్టి... తాను నియమించిన వీసీలపై వచ్చిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అలా చేస్తే రాజకీయ ప్రతిష్ఠ మంట గలుస్తుందనీ, వీసీలు కూడా ప్రభుత్వానికి ఎదురు తిరిగే అవకాశం ఉండవచ్చనీ విశ్లేషకులు భావిస్తున్నారు.

యూనివర్సిటీలకు ఛాన్సలర్‌గా వ్యవహరించే హోదాను వర్సిటీల చట్టం గవర్నర్‌కు ఇచ్చినప్పటికీ... ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనపై ఎటువంటి విచారణ లేకుండా యథావిధిగా ప్రతిపాదనను ఆమోదించవలసిన నియమం వల్ల గవర్నర్ ఏమీ చేయలేకపోతున్నారు. వీసీల నియామకంలో పునఃసమీక్ష చేసే అధికారం గవర్నర్ వినియోగించుకుంటే తప్ప వర్సిటీల్లోని సమస్యలకు పరిష్కారం దొరకదని విద్యార్థి, ఉద్యోగ సంఘాలు, మేధావులు భావిస్తున్నారు.

– డా॥ మామిడాల ఇస్తారి; జనరల్ సెక్రెటరీ, కేయూ టీచర్స్ అసోసియేషన్ | 9848 309231

అకారణ బంధుత్వం

'అకారణ బంధుత్వం' అన్న పదబంధాన్ని మన పూర్వకవులలో ఒకరిద్దరు చాలా ఇష్టంగా ఉపయోగించారు. వినడానికే కాదు ఆ మాట వెనక ఉన్న అర్థం గురించి ఆలోచించినా ఎంతో హృద్యంగా ఉంటుంది. ఒక మనిషి ఏ కారణమూ లేకుండానే కష్టంలో చిక్కుకున్న సాటి మనిషితో బంధుత్వాన్ని కలుపుకొని నిస్వార్థంగా తాను చేయగల సహాయం చేయడాన్ని ఈ పదబంధం సూచిస్తుంది.

వెన్నెలకంటి అన్నయ రచించిన 'షోడశకుమార చరితం' కావ్యం ద్వితీయాశ్వాసంలోని ఒక సన్నివేశం ఇది. ఒక రాకుమారుడు సపరివారంగా వేటకు వచ్చి అడవిలోకి దూకుడుగా చొచ్చుకుని వెళ్లాడు. ఒకానొక సమయంలో దారి తప్పిపోయి ఒంటరివాడై ఎటు వెళ్ళాలో తెలియక తిరుగుతూ ఉండగా, దగ్గర లోని ఒక ప్రవాహంలో ఆ అడవికి చెందినవాడే అయిన ఒక వృద్ధుడు, తన కాలు మొసలి నోటికి చిక్కి, తప్పించుకోలేక తన్నుకులాడుతూ కనపడతాడు. ఇది చూసిన రాకుమారుడు ఆ ప్రవాహం వద్దకు వెళ్ళి సాయంగా కత్తి, కటారు వంటి తన ఆయుధాలకు కాసింత సేపు పని పెట్టి, తానూ కష్టపడి పోరాడి ఆ వృద్ధ ఆటవికుడి కాలును ఎట్టకేలకు మొసలి నోటినుండి తప్పించి రక్షిస్తాడు. నీటిలో మొసలికి ఏనుగునైనా పడవేయగలంత బలం ఉంటుందని తెలిసినదే కదా! అయినా సరే, వెనుకాడకుండా, చేస్తున్న ప్రయత్నం మధ్యలో వదలక, ఎక్కడినుండి ఎలా వచ్చాడో తెలియని ఆ రాకుమారుడు తన ప్రాణాన్ని సైతం పణంగా పెట్టి చేసిన సహాయంతో ప్రాణం కాపాడుకున్న ఆ వృద్ధ ఆటవికుడి నోటి నుండి కృతజ్ఞతా పూర్వకంగా వెలువడిన మొదటి మాటలు 'పూని యకారణ బంధుడవై నా ప్రాణములు గాచి నసమాన కృపాంభోనిధి' అన్నవి.

'నేను పడుతున్న అవస్థను చూసి, మనకెందుకులే ఈ తంటాలు అనుకుని నా ప్రారబ్ధానికి నన్ను వదిలేసి పోకుండా, నేనంటే ఏమిటో, నా బ్రతుకు ఏమిటో ఏమీ గణనలోకి తీసుకోకుండా, ఏ కారణం లేకుండానే నన్ను నీ బంధువుని చేసుకుని, ఆప్తుడి వలె నన్ను ఈ మొసలి బారినుండి కాపాడిన నీకు నేను ఇప్పుడు దాసుడనయ్యాను' అంటాడు ఆ మనిషి. అతడు చెప్పి నట్లుగానే, అవతలి మనిషిని దాసుడిని చేసుకోగలిగే తత్త్వం 'అకారణ బంధుత్వ' చర్యలో అంతర్లీనమై ఉంటుందన్నది ఇందులో తెలుస్తుంది.

– వెంకట్ భట్టు

జ్యోతిర్మయం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.పాడ్యమి రా.8.43 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: కృత్తిక ఉ.7.34 వరకు, తదుపరి రోహిణి, వర్జ్యం: రా.12.09 నుండి 1.50 వరకు, దుర్ముహూర్తం: ఉ.5.31 నుండి 7.11 వరకు, రాహుకాలం ఉ.9.00 నుండి 10.30 వరకు ; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.46, సూర్యాస్తమయం: 6.38.

అంత్యక్రియల్లో ఆఖరి జన్మదిన వేడుక

ఆసిఫాబాద్ రూరల్: అంత్యక్రియల రోజే కుమారుడి చివరి జన్మదిన వేడుక నిర్వహించాల్సి రావడం కన్నా విషాదం ఏముంటుంది. కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం బాబాపూర్‌లో శుక్రవారం కంటతడి పెట్టించిన ఈ సంఘటన వివరాలివి. గ్రామానికి చెందిన చునార్కర్ గుణాంతరావు, లలిత దంపతుల చిన్న కుమారుడు సచిన్ (15) గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. శుక్రవారం పుట్టినరోజు కావడంతో చివరిసారిగా తల్లిదండ్రులు మృతుని చేతితో కేక్ కట్ చేయించారు.



మృతునితో కేక్ కట్ చేయిస్తూ..

మావోయిస్టు డిప్యూటీ కమాండర్ అరెస్టు

భద్రాచలం అర్బన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో మావోయిస్టు డిప్యూటీ కమాండర్ పట్టుబడ్డాడు. భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ శుక్రవారం వెల్లడించిన వివరాలు ఇలా... చర్ల మండలం లెనిన్ కాలనీ – పూసుగుప్ప రహదారిపై చర్ల పోలీసులు, 141 బెటాలియన్, సీఆర్పీఎఫ్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. సదరు వ్యక్తి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తర్రెం పోలీస్‌స్టేషన్ పరిధి కోమటిపల్లి పంచాయతీకి చెందిన మిలీషియా డిప్యూటీ కమాండర్ సోడి దేవాగా గుర్తించారు. ఆయన 2019లో మావోయిస్టు పార్టీ కోమటిపల్లి మిలీషియా సభ్యుడిగా చేరి ఏడాదిగా డిప్యూటీ కమాండర్‌గా పనిచేస్తున్నాడన్నారు. గత జూలైలో పూసుగుప్ప వద్ద పోలీసులను హతమార్చేందుకు ప్రెజర్ మైన్స్ అమర్చడంతో పాటు పలు ఘటనల్లో పాల్గొన్నాడని చెప్పారు.

బాలుడిని చంపిన వీధి కుక్కలు

హనుమకొండలోని కాజీపేట రైల్వే కాలనీలో విషాద ఘటన

- బతుకుదెరువు కోసం యూపీ నుంచి అజ్మీర్‌కు వెళ్తున్న మూడు సంచార కుటుంబాలు
- వెళ్లే క్రమంలో కాజీపేటలో కుక్కల దాడికి బలైన బాలుడు

కాజీపేట రూరల్, జోగిపేట(అందోల్): కాజీపేట జంక్షన్ రైల్వే కాలనీలోని చిల్డ్రన్స్ పార్క్ సమీపంలో శుక్రవారం ఏడేళ్ల బాలుడ్ని వీధి కుక్కల గుంపు దాడి చేసి కరిచి చంపేశాయి. ఉత్తరప్రదేశ్, బెనారస్‌కు చెందిన మూడు కుటుంబాలు బతుకుదెరువు నిమిత్తం బొమ్మలు, ఉంగరాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాయి. ఈ క్రమంలో వారు రాజస్తాన్‌లోని అజ్మీర్‌కు బయలుదేరారు. గురువారం రాత్రి మార్గమధ్యలో హనుమకొండలోని కాజీపేట జంక్షన్‌కు చేరుకున్నారు. రాత్రి ఇక్కడ నిద్రించి శుక్రవారం భోజనం చేసుకొని రాజస్తాన్‌లోని అజ్మీర్‌కు వెళ్దామనుకున్నారు. భోజనానికి కావాల్సిన వంట సరుకులు, కూరగాయలు తెచ్చుకోవడానికి కొందరు వెళ్లగా, మల్కన్, సునీత దంపతుల బాలుడు చోటు(7) బహిర్భూమి కోసం పార్క్ వెనుకకు వెళ్లాడు. ఈక్రమంలో వీధి కుక్కలు ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసి మెడ, కాళ్లను తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు చూసి వెంటనే కుక్కలను తరిమారు. అప్పటికే బాలుడికి తీవ్రగాయాలు కావడంతో రక్తస్రావమై చనిపోయాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలముకున్నాయి. భయ్యా చోటు ఉటో భయ్యా అంటూ బాలుడి చెల్లెలు, చిన్నారులు రోదిస్తున్న తీరు స్థానికులను కలచి వేసింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వ చీఫ్ విప్ వినయ్‌భాస్కర్, మేయర్ సుధారాణిలు రూ.లక్ష నగదు సాయం అందించి వాహనంలో స్వగ్రామానికి పంపించారు. కాగా, గ్రేటర్ మున్సిపాలిటీ వర్గాలు వెంటనే రెండు డాగ్ క్యాచింగ్ వ్యాన్లతో ఆ ప్రాంతంలోని ఆరు కుక్కలను పట్టుకున్నాయి.



చోటు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

కన్‌సాన్‌పల్లిలో పిచ్చికుక్క స్వైర విహారం ఇద్దరికి తీవ్రగాయాలు

జోగిపేట మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లిలో శుక్రవారం గ్రామానికి చెందిన బాలుడు సురేందర్‌ను, గృహిణి సంగన్నగారి సంధ్యను పిచ్చి కుక్క కరువగా తీవ్రగాయాలయ్యాయి. వీరిరువురికీ జోగిపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ ఘటనలతో గ్రామస్తులు పిచ్చికుక్కను వెంటపడి చంపివేశారు.

- సామాజిక, ఆర్థిక రాజకీయ రంగాలలో బీసీలు వెనుకబాటుతనాన్ని అధిగమించలేకపోవడానికి గత పాలకులే కారణమని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ ఆరోపించారు. దీనిపై ఈనెల 21న నిజామాబాద్‌లో బీసీల రాజ్యాధికార సమ్మేళనాన్ని నిర్వహించనున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీసీబంధు ప్రకటించాలి: జాజుల

కవాడిగూడ: బీసీల ఆర్థిక తోడ్పాటుకోసం లక్ష రూపాయలను ప్రకటిస్తూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం.. ఎన్నికల్లో బీసీల ఓట్ల కోసమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే బీసీ బంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో మీడియా సమావేశంలో జాజుల మాట్లాడారు. బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.2 లక్షలు రుణాలు తీసుకోవచ్చని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీతో 3 లక్షల 20 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, ఒక్కరికీ రుణం మంజూరు కాలేదని తెలిపారు. బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు హామీ ఏమైందని నిలదీశారు. ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయలు బీసీలకు ఆర్థిక తోడ్పాటునందిస్తాయా అని ప్రశ్నించారు. తొమ్మిదేళ్లుగా సీఎం కేసీఆర్ బీసీలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రూ.2,000 నోట్ల రద్దుపై ఎవరేమన్నారంటే...

విశ్వగురు పనితీరుకు ఇదొక ఉదాహరణ

''తనను తాను విశ్వగురు అని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ పనితీరుకు రూ.2,000 నోట్ల ఉపసంహరణ ఒక ఉదాహరణ. మొదట అనుకున్నది చెసెయ్యి. ఆ తర్వాత ఆలోచించు అనేదే ఆయన విధానం. రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేయడం ఒక మూర్ఖపు నిర్ణయం. 2016 నవంబర్ 8న మోదీ తుగ్లక్ ఫర్మానా జారీ చేశారు. ఆ గాయానికి మందు పూయడానికి రూ.2,000 నోటును తీసుకొచ్చారు. డిమానిటైజేషన్ విఫలమైనట్లుగానే ఈ రెండో డిమానిటైజేషన్ విఫలం కావడం ఖాయం. 2016 నవంబర్ 8 నాటి భూతం దేశాన్ని మరోసారి వెంటాడడానికి, ప్రజలను కష్టాలపాలు చెయ్యడానికి వచ్చింది''

- కాంగ్రెస్

ఏం సాధిస్తారో చెప్పాలి

''రూ.2,000 నోటు ద్వారా, ఇప్పుడు దాని రద్దు ద్వారా సాధించిందేమిటో మోదీ ప్రభుత్వం చెప్పాలి. నోట్ల రద్దు విజయవంతమైందని సంబరపడ్డారు. మరిప్పుడు రూ.2,000 నోటును వెనక్కి తీసుకోవడానికి కారణమేమిటి?''

- ఎన్సీపీ అధినేత శరద్ పవార్

శ్వేతపత్రం విడుదల చేయాలి

''నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు కలిగిన మేలు ఏమిటో మోదీ ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. మన దేశ ఆర్థిక వ్యవస్థను కొందరు తుగ్లక్‌లు నియంత్రిస్తున్నారు. రూ.2,000 నోటును రద్దు చేయాలని వారు ఇప్పుడు నిర్ణయించారు''

- సీపీఐ

చురుగ్గా నైరుతి

న్యూఢిల్లీ: మండే ఎండల నడుమ ఓ చల్లని కబురు. నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. శుక్రవారానికల్లా అవి అండమాన్ నికోబార్ దీవుల్లోని పలు ప్రాంతాలతో పాటు బంగాళాఖాతం, దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించినట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు మూడు రోజుల్లో మరింత విస్తరిస్తాయని పేర్కొంది. ఏటా నైరుతి జూన్ 1కల్లా కేరళలోకి ప్రవేశిస్తుంటుంది. ఈసారి మూడు రోజుల దాకా ఆలస్యం కావచ్చని వాతావరణ శాఖ ఇటీవల అంచనా వేయడం తెలిసిందే. రుతుపవనాలను బాగా బలహీనపరిచే ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం ఈసారి ఆందోళనకు కారణంగా మారింది. దానివల్ల రుతుపవనాల ఆగమనం, వర్షపాతం బాగా ప్రభావితం కావచ్చన్న అంచనాల నేపథ్యంలో నైరుతి విస్తరించడం శుభ పరిణామం.

ఫ్లాష్‌బ్యాక్...

ఆ నిర్ణయంతో... అతలాకుతలం

అప్పట్లో దేశాన్ని కుదిపేసిన రూ.1,000, 500 నోట్ల రద్దు

నల్లధనం, నకిలీ నోట్లు, నగదు లావాదేవీల కట్టడే లక్ష్యం • ఒక్కటీ నెరవేరక విఫల ప్రయోగంగా మిగిలిన వైనం

అది 2016. నవంబర్ 8. రాత్రి 8 గంటల సమయం. ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా ఉన్న వేళ. ప్రధాని నరేంద్ర మోదీ ఉన్నట్టుండి టీవీ తెరల మీద ప్రత్యక్షమయ్యారు. జాతినుద్దేశించి మాట్లాడటం మొదలు పెట్టారు. ఏమిటా అని ఆసక్తిగా చూస్తున్న వాళ్లందరికీ షాకిస్తూ పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని ప్రకటించారు. నల్లధనాన్ని రూపుమాపడమే లక్ష్యంగా రూ.1,000, రూ.500 నోట్లను తక్షణం రద్దు చేస్తున్నట్టు పేర్కొన్నారు. నకిలీ నోట్ల బెడద పోవడమే గాక నగదు రహిత డిజిటల్ లావాదేవీలకు కూడా ఈ నిర్ణయంతో ఊపొస్తుందని చెప్పుకొచ్చారు. ఫలితంగా 2016 నవంబర్ 8 అర్ధరాత్రి నుంచి పెద్ద నోట్లు పనికిరాకుండా పోయాయి! కానీ అనంతర పరిణామాలను, ముఖ్యంగా నోట్ల మార్పిడి ప్రక్రియను సజావుగా డీల్ చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైంది. దాంతో కొద్ది నెలల పాటు దేశమంతా అక్షరాలా అల్లకల్లోలమైపోయింది. పెద్ద నోట్లను మార్చుకునేందుకు ఏ బ్యాంకు ముందు చూసినా కొండవీటి చాంతాటిని తలదన్నే లైన్లే. ఆ లైన్లలోనే కుప్పకూలిన ప్రాణాలు. నగదు మీదే ఆధారపడి నడిచే వ్యాపారాలు పడకేసి ఆర్థికంగా చితికిపోయిన సగటు బతుకులు. ఇలా ఎవరిని కదిలించినా కన్నీటి కథలే! మనసుల్ని మెలిపెట్టే గాథలే. వ్యవసాయం మొదలుకుని ఆటోమొబైల్, నిర్మాణ తదితర కీలక రంగాలు నగదు కటకటతో కొన్నాళ్ల పాటు పూర్తిగా పడకేశాయి. మొత్తంగా దేశ ఆర్థిక రంగమే అతలాకుతలమైపోయింది. ఇంతా చేస్తే నోట్ల రద్దు వల్ల నల్లధనం ఏ మాత్రమూ కట్టడి కాలేదని తర్వాతి కాలంలో గణాంకాలతో పాటు నిరూపణ కావడం మరో విషాదం. అప్పట్లో ప్రవేశపెట్టిన రూ.2,000 కరెన్సీని ఆర్బీఐ తాజాగా రద్దు చేసిన నేపథ్యంలో నాటి చేదు జ్ఞాపకాలను జనం మరోసారి భయంభయంగా గుర్తు చేసుకుంటున్నారు...



నోట్ల రద్దు-కొన్ని వాస్తవాలు

- పలు అంచనాల ప్రకారం మన దేశ జీడీపీలో 20 నుంచి 25 శాతం దాకా నల్లధనమే. అంటే రూ.30 లక్షల కోట్ల పై చిలుకు!
- నల్లధనం లేని బంగారు భవిష్యత్తు కోసం తాత్కాలికంగా కాస్త బాధను ఓర్చుకోక తప్పదని నోట్ల రద్దు వేళ ప్రధాని చెప్పుకొచ్చారు. జనం కూడా అందుకు సిద్ధపడ్డారు.
- నోట్ల రద్దుతో తమకు కలిగిన నష్టాలను, వ్యయప్రయాలను పళ్ల బిగువున భరించారు.
- నోట్ల రద్దు వల్ల కనీసం బ్యాంకింగ్ వ్యవస్థకు ఆవల ఉన్న రూ.3 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్ల విలువైన నల్లధనం చెత్త కాగితం కింద మారుతుందని కేంద్రం ఆశించింది.
- కానీ వాస్తవంలో జరిగింది అందుకు పూర్తిగా విరుద్ధమని గణాంకాలు తేల్చాయి.
- నోట్ల రద్దు నిర్ణయం నాటికి దేశం చలామణిలతో ఉన్న నగదులో ఏకంగా 86 శాతం (రూ.16.24 లక్షల కోట్లు) రూ.1,000, రూ.500 నోట్లే. ఇందులో రూ1,000 నోట్ల వాటా 38 శాతం కాగా రూ.500 నోట్లది 47 శాతం. అదంతా రాత్రికి రాత్రి పనికిరాకుండా పోయింది.
- ఈ మొత్తంలో ఏకంగా 99 శాతానికి పైగా కరెన్సీ క్రమంగా బ్యాంకింగ్ వ్యవస్థలోకి తిరిగొచ్చిందని అనంతరం రిజర్వు బ్యాంకే అధికారికంగా ప్రకటించింది. నల్లధనం కట్టడి లక్ష్యం ఇసుమంతైనా నెరవేరలేదని తద్వారా స్పష్టమైంది.
- నగదు కార్యకలాపాలను తగ్గించాలన్న ఉద్దేశమూ నెరవేరలేదు. 2016 నవంబర్‌లో దేశ ప్రజల దగ్గర రూ.17.7 కోట్ల విలువైన నగదుంటే 2022 అక్టోబర్ నాటికి ఆ మొత్తం ఏకంగా రూ.30.88 లక్షల కోట్లకు పెరిగింది.
- నకిలీ నోట్ల చలామణి కూడా పెద్దగా తగ్గలేదని తర్వాతి కాలంలో గణాంకాలతో పాటు రుజువైంది. నకిలీ నోట్లలో అత్యధికం వంద రూపాయల నోట్లే కావడం ఇందుకు కారణమని తేలింది.
- కాకపోతే నోట్ల రద్దు వల్ల ఇటు ప్రజలకు, అటు ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టం అపారం.
- నగదు కార్యకలాపాల మీదే ఆధారపడే 48 కోట్ల మందికి పైగా భారతీయులను పెద్ద నోట్ల రద్దు కోలుకోలేని దెబ్బ కొట్టింది.

ఆర్థికవేత్తల విస్మయం

పలువురు ఆర్థికవేత్తలు కూడా నోట్ల రద్దు నిర్ణయంలో ఔచిత్యమేమిటో అంతుబట్టడం లేదంటూ అప్పట్లో ఆశ్చర్యపోయారు. ''నల్లధనంలో మహా అయితే ఓ 5 శాతం మాత్రం నగదు రూపంలో ఉంటుందేమో. మిగతాదంతా భూములు, బంగారం వంటి ఆస్తుల రూపేణా మాత్రమే ఉంటుంది. ఇది అందరికీ తెలిసిన సంగతే. అలాంటప్పుడు కేవలం పెద్ద నోట్ల రద్దుతో నల్లధనం మాయమైపోతుందని ఆర్బీఐ అనుకున్నారో!'' అన్నారు.

- 2016 సెప్టెంబర్ దాకా ఆర్‌బీఐ గవర్నర్‌గా చేసిన రఘురాం రాజన్ నోట్ల రద్దు ప్రతిపాదనను తాను సమర్థించలేదని కుండబద్దలు కొట్టారు.
- నోట్ల రద్దు నిర్ణయాన్ని చట్టబద్ధమేనని గత జనవరిలో తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు కూడా, 'ఆరేళ్ల తర్వాత ఇప్పుడు కాలాన్ని వెనక్కు తిప్పలేం' అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేసింది. ఆ నిర్ణయం లక్ష్యాన్ని సాధించిందా లేదా అన్నది ఇప్పుడు అప్రస్తుతమని స్పష్టంగా పేర్కొంది.
- దేశ జీడీపీలో 45 నుంచి 60 శాతం దాకా వాటా ఉండే పలు రంగాలు కొన్నాళ్ల పాటు అత్యంత తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

ముగ్గురు న్యాయమూర్తులకు

సుప్రీంకోర్టు వీడ్కోలు

వారి సేవలను కొనియాడిన సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

న్యూఢిల్లీ: పదవీ విరమణ చేయనున్న జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ వి.రామసుబ్రమణియన్ సేవలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ డీవై చంద్రచూడ్ కొనియాడారు. జూన్ 16న జస్టిస్ కేఎం జోసెఫ్, జూన్ 17న జస్టిస్ అజయ్ రస్తోగి, జూన్ 29న జస్టిస్ వి.రామసుబ్రమణియన్ పదవీ విరమణ చేయనున్నారు. ఈ నెల 22 నుంచి సుప్రీంకోర్టుకు వేసవి సెలవులు ప్రారంభం కానున్నందున శుక్రవారమే వీరికి చివరి పనిదినం అయింది. ఈ సందర్భంగా సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలో ప్రత్యేక వీడ్కోలు సమావేశం ఏర్పాటైంది. ముగ్గురు న్యాయమూర్తులతో తనకు అనుబంధాన్ని సీజేఐ గుర్తుకు తెచ్చుకున్నారు. 'జోసెఫ్ నాకు చిన్ననాటి స్నేహితుడు. 1972లో ఢిల్లీకి వచ్చిన కొత్తలో నా మొట్టమొదటి స్నేహితుడు. అటువంటి వ్యక్తి రిటైరవుతుండటంతో నా విచారం రెట్టింపయింది' అని పేర్కొన్నారు. ఒకే ధర్మాసనంలో జస్టిస్ జోసెఫ్‌తో కలిసి పనిచేయడం సంతోషదాయకమన్నారు. రాజ్యాంగ చట్టాలు మొదలుకుని వాణిజ్య చట్టాల వరకు ఎంతో పట్టున్న జస్టిస్ కేఎం జోసెఫ్ సేవలను ఇకపై తాము మిస్ అవుతున్నామన్నారు. సామాన్యుడికి కూడా న్యాయం అందాలంటే బార్ సహాయం ఎంతో అవసరమని జస్టిస్ జోసెఫ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2018 ఆగస్టులో సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ జోసెఫ్ బాధ్యతలు చేపట్టారు.

జస్టిస్ అజయ్ రస్తోగి గొప్ప మిత్రుడు

సున్నితత్వం, దయా గుణం కలిగిన జస్టిస్ అజయ్ రస్తోగి తనకు గొప్ప మిత్రుడని సీజేఐ కొనియాడారు. సివిల్, కార్మిక చట్టాలు వంటి అనేక అంశాల్లో తరచూ జస్టిస్ రస్తోగి విశేష పరిజ్ఞానంపైనే ఆధారపడే వాడినన్నారు. 'బ్రదర్ రస్తోగి, తీర్పు రాసిన జడ్జీల్లో మీ పేరు కనిపిస్తే చాలా ప్రశాంతత, భరోసాతో ఉండే వాడిని' అని తెలిపారు. కొలీజియం సమావేశాల్లో తనకు ఎంతో మద్దతుగా నిలిచే వారన్నారు. 1958లో జన్మించిన జస్టిస్ రస్తోగి 2018 నవంబర్‌లో సుప్రీం జడ్జిగా నియమితులయ్యారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి జస్టిస్ రామసుబ్రమణియన్

జస్టిస్ రామసుబ్రమణియన్ వినయశీలి, బహుముఖ ప్రతిభావంతుడైన న్యాయమూర్తి, మానవతా వాదిగా సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కొనియాడారు. 'రిటైరయ్యాక ఏదైనా ట్రిబ్యునల్‌కు చైర్మన్ పదవిని చేపట్టాలని జస్టిస్ రామ్‌ని కోరగా తిరస్కరించారు. అయినా నా ప్రయత్నం మానను'' అని సీజేఐ అన్నారు. 2006 నుంచి మద్రాస్ హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ సుబ్రమణియన్ 2016లో ఉమ్మడి ఏపీ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అనంతరం తెలంగాణ హైకోర్టు జడ్జిగా కొనసాగారు. 2019లో హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు సీజేగా పదోన్నతిపై వెళ్లారు. అదే ఏడాది సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు.



ప్రమాణస్వీకారం అనంతరం సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో జస్టిస్ మిశ్రా

సుప్రీం జడ్జిగా జస్టిస్ పీకే మిశ్రా ప్రమాణం

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ పీకే మిశ్రా, సీనియర్ న్యాయవాది కేవీ విశ్వనాథన్ ప్రమాణం చేశారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ప్రధాన న్యాయమూర్తి కోర్టులో వీరిద్దరితో సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రమాణం చేయించారు. దీంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య ఆమోదిత 34కు చేరింది. జస్టిస్ పీకే మిశ్రా ఆగస్టు 2029 వరకూ, జస్టిస్ కేవీ విశ్వనాథన్ మే 25, 2031 వరకూ సేవలందించనున్నారు. జస్టిస్ జేబీ పార్దీవాలా పదవీ విరమణ అనంతరం మే 25, 2031 వరకూ జస్టిస్ విశ్వనాథన్ సీజేఐగా సేవలందించనున్నారు.



శుక్రవారం ఢిల్లీలో ప్రియాంక, రాహుల్‌గాంధీలతో సిద్దరామయ్య, డీకే

కర్ణాటక కేబినెట్ ప్రమాణం నేడే

ఢిల్లీలో పార్టీ పెద్దలతో సిద్దరామయ్య, శివకుమార్ చర్చలు

కేబినెట్ కూర్పు, పోర్ట్‌ఫోలియోలకు తుది రూపు

న్యూఢిల్లీ: కర్ణాటకలో కాంగ్రెస్ మంత్రివర్గం ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం ఢిల్లీ చేరుకున్న సీఎల్పీ నేత సిద్దరామయ్య, కేపీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌లు కేబినెట్ కూర్పు, పోర్టుఫోలియోలపై పార్టీ పెద్దలతో విస్తృత చర్చలు జరిపారు. డీకే శివకుమార్ ప్రత్యేకంగా కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రాలను కలిసి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్‌తోపాటు మంత్రులుగా కొందరు ప్రమాణం చేస్తారంటూ అధిష్టానం ముందుగానే ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్, సూర్జేవాలాలతో సిద్దరామయ్య ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం వీరి చర్చల్లో శివకుమార్ పాలుపంచుకున్నారు. నలుగురూ కలిసి జన్‌పథ్-10లో ఉంటున్న రాహుల్ గాంధీని వెళ్లి కలిశారు. గంటన్నరకుపైగా వారి మధ్య చర్చలు నడిచాయి. ఆపై రాహుల్ గాంధీ, సూర్జేవాలా, వేణుగోపాల్‌లు పార్టీ చీఫ్ ఖర్గేను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కేబినెట్‌లోకి ఎందరిని తీసుకోవాలనే విషయమై తుది నిర్ణయానికి వచ్చారు. కేబినెట్‌లోకి తీసుకునే 20 మంది పేర్లను ఖారారు చేసినట్లు అనంతరం పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలోని వివిధ వర్గాలు, ప్రాంతాలు, వర్గాలకు సముచిత స్థానం దక్కేలా కేబినెట్ కూర్పు ఉంటుందన్నాయి.

హాజరుకానున్న నేతలు

ప్రమాణ స్వీకారోత్సవానికి కంఠీరవ స్టేడియాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. లక్ష మందికి పైగా కార్యకర్తలు, అభిమానులు పాల్గొంటారని అంచనా. విస్తృతంగా బందోబస్తు కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమానికి బిహార్ సీఎం నితీశ్, తమిళనాడు సీఎం స్టాలిన్, ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ చీఫ్ ఫరూక్ అబ్దుల్లా హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ తనకు బదులుగా పార్టీ ప్రతినిధిని పంపుతారని సమాచారం. కంఠీరవ స్టేడియంలో ఏర్పాట్లను శుక్రవారం ఉదయం డీకే శివకుమార్ స్వయంగా పరిశీలించారు. ప్రజా ప్రతినిధులైన జేడీఎస్, బీజేపీ నేతలను కూడా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించినట్లు శివకుమార్ చెప్పారు. శనివారమే జరిగే కేబినెట్ మొదటి భేటీలో కాంగ్రెస్ ప్రధాన హామీ అయిన 5 గ్యారంటీల అమలుపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

రష్యాకు శిక్ష తప్పదు

ఆ దేశంపై ఇక మరిన్ని ఆంక్షలు • ఉక్రెయిన్‌కు మా మద్దతు కొనసాగుతుంది • జి-7 దేశాల అధినేతల ప్రకటన

హిరోషిమా/న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌లో మారణకాండ సాగిస్తూ అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న రష్యాకు శిక్ష తప్పదని జి-7 దేశాల అధినేతలు హెచ్చరించారు. రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించబోతున్నట్లు తేల్చిచెప్పారు. ఉక్రెయిన్‌కు తమ మద్దతు కొనసాగుతుందని తేల్చిచెప్పారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జి-7 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు కూటమి దేశాల అధినేతలు శుక్రవారం జపాన్‌లోని హిరోషిమాకు చేరుకున్నారు. అనంతరం సమాశమై, తాజా అంతర్జాతీయ పరిణామాలపై చర్చించారు. ఉక్రెయిన్‌పై రష్యా చట్ట విరుద్ధమైన, న్యాయ విరుద్ధమైన యుద్ధం సాగిస్తోందని మండిపడ్డారు. రష్యాకు వ్యతిరేకంగా కలిసికట్టుగా ముందుకు సాగాలని జి-7 దేశాల నేతలు ప్రతిన బూనారు. రష్యా ప్రారంభించిన ఈ యుద్ధాన్ని రష్యానే ముగించాలని అన్నారు. హిరోషిమాలోని శాంతి పార్కును వారు సందర్శించారు. రెండో ప్రపంచ యుద్ధంలో బాంబు దాడిలో దెబ్బతిన్న డోమ్ వద్ద గ్రూప్ ఫొటోలు దిగారు. అక్కడ పుష్పగుచ్ఛాలు ఉంచి, అమర వీరులకు నివాళులర్పించారు. జి-7 శిఖరాగ్ర సదస్సుకు గుర్తుగా చెర్రీ మొక్కను నాటారు.

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో రాజీలేదు: మోదీ

సార్వభౌమత్వం, గౌరవాన్ని కాపాడుకొనే విషయంలో భారతదేశం పూర్తిస్థాయిలో సన్నద్ధమై ఉందని, ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. భవిష్యత్తులో భారత్-చైనా సంబంధాలు మెరుగుపడడం అనేది కేవలం ఇరు దేశాల మధ్య పరస్పర గౌరవం, పరస్పర ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని తేల్చిచెప్పారు. శుక్రవారం జపాన్ వార్తా సంస్థ 'నిక్కీ ఆసియా' ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడారు. పలు అంశాలపై తన అభిప్రాయాలు పంచుకున్నారు. పొరుగు దేశాలతో సాధారణ ద్వైపాక్షిక సంబంధాలు ఉండాలంటే సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులు కొనసాగడం తప్పనిసరి అని చెప్పారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి, చట్టబద్ధ పాలనకు, వివాదాలకు శాంతియుత పరిష్కారం కనుగొనడానికి తాము అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. భారత్-చైనా మధ్య సంబంధాలు సాధారణ స్థాయికి చేరుకుంటే ఇరు దేశాలకే కాకుండా ప్రపంచానికి కూడా లబ్ధి చేకూరుతుందని తెలియజేశారు. భారత్ ప్రగతి పథంలో దూసుకుపోతోందని వివరించారు. 2014లో ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇప్పుడు ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని గుర్తుచేశారు. పాకిస్తాన్‌తో సాధారణ, ఇరుగుపొరుగు సంబంధాలను నరేంద్ర మోదీ కోరుకుంటున్నట్లు నిక్కీ ఆసియా వెల్లడించింది.

హిరోషిమాలో మోదీ

జి-7, క్వాడ్ దేశాల అధినేతల సదస్సులో పాల్గొనడానికి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం జపాన్‌లోని హిరోషిమా నగరానికి చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు జపాన్ సీనియర్ అధికారులు, భారత రాయబార కార్యాలయం అధికారులు స్వాగతం పలికారు. హిరోషిమాలో ల్యాండ్ అయ్యానంటూ మోదీ ట్వీట్ చేశారు. ఆయన ఈ నెల 21 దాకా హిరోషిమాలో పర్యటిస్తారు. జి-7 సదస్సుతోపాటు వివిధ కార్యక్రమాలు, సమావేశాల్లో పాల్గొంటారు. జపాన్ పర్యటనకు బయలుదేరేముందు ఢిల్లీలో మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. ''జి-20 కూటమికి ఈ ఏడాది భారత్ సారథ్యం వహిస్తోంది. ఈ నేపథ్యంలో హిరోషిమాలో జి-7 దేశాల అధినేతలతో సమావేశమై, చర్చించేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నా. ప్రపంచ సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించబోతున్నాం'' అన్నారు.



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న భారతీయులు

సదస్సులో పాల్గొననున్న జెలెన్‌స్కీ

జి-7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సైతం పాల్గొనబోతున్నారు. ఆయన ఆదివారం సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ విషయాన్ని ఉక్రెయిన్ నేషనల్ సెక్యూరిటీ, డిఫెన్స్ కౌన్సిల్ సెక్రటరీ ఒలెక్సీ డానిలోవ్ నిర్ధారించారు. తమ దేశంలో నెలకొన్న అస్థిరతను పరిష్కరించడానికి తమ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్తారని, ఎవరినైనా కలుస్తారని చెప్పారు.



గవర్నర్ ఇంటిముందు మంత్రుల బైఠాయింపు

ఢిల్లీ ప్రభుత్వ సర్వీసుల ఉద్యోగులపై పూర్తి అధికారాలు రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటాయన్న సుప్రీంకోర్టు తీర్పును తక్షణం అమలు చేయాలనే డిమాండ్‌తో శుక్రవారం లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా నివాసం ముందు బైఠాయించి ధర్నా చేస్తున్న ఆప్ మంత్రులు గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్, ఆతిషి తదితరులు. దాదాపు 90 నిమిషాల ధర్నా అనంతరం ఎల్జీ వారిని లోనికి పిలిచి చర్చించారు.

ఒరిజినల్ రికార్డులు సమర్పించండి

ఆనంద్‌మోహన్ విడుదలపై బిహార్ సర్కారుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: తెలుగు దళిత ఐఏఎస్ అధికారి జి.కృష్ణయ్య హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షపడిన మాజీ ఎంపీ ఆనంద్ మోహన్ శిక్షాకాలం తగ్గింపునకు సంబంధించి మొత్తం ఒరిజినల్ రికార్డులు సమర్పించాలని బిహార్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఆనంద్ మోహన్ నేర చరిత్ర వివరాలు సైతం అందజేయాలని సూచించింది. ఈ కేసులో విచారణకు ఇక వాయిదా వేయలేమని, రికార్డులన్నీ సమర్పించాల్సిందేనని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జేబీ పార్దీవాలాతో కూడిన ధర్మాసనం బిహార్ సర్కారు తరఫు న్యాయవాది మనీశ్ కుమార్‌కు తేల్చిచెప్పింది. శిక్షాకాలం ముగియక ముందే ఆనంద్ మోహన్‌ను జైలు నుంచి విడుదల చేస్తూ బిహార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జి.కృష్ణయ్య భార్య ఉమా కృష్ణయ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ చేపట్టింది. తమ ప్రతిస్పందనను తెలియజేసేందుకు కొంత గడువు ఇవ్వాలన్న మనీశ్ కుమార్ విజ్ఞప్తిని తిరస్కరించింది. నిబంధనల్లో సవరణలు చేసి మరీ ఆనంద్ మోహన్ శిక్షాకాలాన్ని తగ్గించి అతన్ని విడుదల చేస్తూ నితీశ్ కుమార్ ప్రభుత్వం ఏప్రిల్ 10న ఉత్తర్వు జారీ చేసిన సంగతి తెలిసిందే.

సునాక్ దంపతుల సంపద తగ్గింది



లండన్: గత ఏడాది యూకే ధనవంతుల జాబితాలో తొలిసారిగా చోటుదక్కించుకున్న బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్, అక్షతా మూర్తి దంపతుల సంపద ఈ ఏడాది కొంత తగ్గిపోయింది. ఏడాది వ్యవధిలో వారు 201 మిలియన్ పౌండ్ల సంపద కోల్పోయినట్లు శుక్రవారం విడుదలైన 'ద సండే టైమ్స్ రిచ్ లిస్ట్-2023'ను బట్టి తేటతెల్లమవుతోంది. ఇన్ఫోసిస్ కంపెనీలో అక్షతా మూర్తి షేర్ల విలువ పడిపోవడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. 2022 నాటి సంపన్నుల జాబితాలో రిషి సునాక్ దంపతులు 222వ స్థానంలో నిలిచారు. ఈ ఏడాది జాబితాలో వారి ర్యాంక్ 275కు చేరింది. ప్రస్తుతం వారి సంపద 529 మిలియన్ పౌండ్లని (రూ.5,461 కోట్లు) అంచనా. సునాక్ దంపతుల సంపదలో సింహభాగం ఇన్ఫోసిస్ షేర్ల రూపంలోనే ఉంది. ఇక 35 బిలియన్ పౌండ్లతో (రూ.3.61 లక్షల కోట్లు) బ్రిటన్ సంపన్నుల జాబితాలో ఈ ఏడాది కూడా తొలి స్థానాన్ని భారత సంతతికి చెందిన హిందుజా కుటుంబమే దక్కించుకుంది.

ఎలిజబెత్ అంత్యక్రియలకు రూ.1,655 కోట్లు

లండన్: క్వీన్ ఎలిజబెత్-2 అంత్యక్రియలకు 162 మిలియన్ పౌండ్లు (రూ.1,655 కోట్లు) ఖర్చయినట్లు బ్రిటన్ కోశాగార విభాగం (ట్రెజరీ) వెల్లడించింది. రాణి అంత్యక్రియల ఖర్చులను ట్రెజరీ చీఫ్ సెక్రెటరీ జాన్ గ్లెన్ పార్లమెంట్‌కు సమర్పించారు. 70 ఏళ్ల పాటు బ్రిటన్ మహారాణి హోదాలో కొనసాగిన ఎలిజబెత్-2 గత ఏడాది సెప్టెంబర్ 8న మరణించిన సంగతి తెలిసిందే. గత సెప్టెంబర్ 19న జరిగిన ఆమె అంత్యక్రియలకు వివిధ దేశాల నేతలు, ప్రతినిధులు హాజరయ్యారు

టీచర్ల తొలగింపుపై కలకత్తా హైకోర్టు స్టే

కోల్‌కతా: ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 32 వేల మంది టీచర్ల నియామక ఉత్తర్వులను రద్దు చేస్తూ ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై కలకత్తా హైకోర్టు స్టే విధించింది. ఎటువంటి శిక్షణ లేకుండా కేవలం టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) ప్రాతిపదికన 2016లో నియమితులైన సుమారు 32 వేల మంది టీచర్లను తొలగించాలంటూ సింగిల్ బెంచ్ మే 12న తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వును సవాల్ చేస్తూ పశ్చిమబెంగాల్ ప్రాథమిక విద్య బోర్డ్, బాధిత ఉపాధ్యాయులు వేసిన పిటిషన్లను శుక్రవారం కోర్టు విచారించింది. బాధితులకు అర్థవంతమైన రక్షణ హక్కు అవకాశం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడంపై ప్రాథమికంగా న్యాయపరమైన జోక్యం అవసరమని భావిస్తున్నట్లు పేర్కొంది.



కుల వృత్తులకు అండగా ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్రంలో కులవృత్తిదారులకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందుతున్నాయని తెలంగాణ సాహిత్య ఆకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. -8లో



వెంకటాద్రి @ 48

కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి వెళ్లే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు, కాచిగూడ-మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమై 47 సంవత్సరాలు పూర్తి చేసుకుని 48లోకి అడుగుపెట్టాయి. -8లో

కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్ నేటి నుంచి...

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కొరియన్ సినిమా, పాటలకు క్రేజ్ పెరుగుతున్న నేపథ్యంలో కొరియా కాన్సులేట్ జనరల్ ఆధ్వర్యంలో కొరియన్ సినిమా పండుగ నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఈ చిత్రోత్సవం ఉంటుందని 2 రోజుల పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అరడజను సినిమాలు ప్రదర్శిస్తామని నిర్వాహకులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఐబీడీని నిర్లక్ష్యం చేయొద్దు



ఖైరతాబాద్: పొట్టను ముప్పు తిప్పలు పెట్టే ఐబీడీ (ఇన్ఫ్లమేటరీ బొవెల్ డిసీజ్) వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని వైద్యులు సూచించారు. ప్రపంచ ఐబీడీ దినోత్సవం సందర్భంగా సోమాజిగూడలోని యశోద హాస్పిటల్స్, సౌత్ ఏషియన్ ఐబిడి అలయన్స్ సహకారంతో ఈ వ్యాధి గురించి అవగాహన కల్పించేందుకు హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో అవగాహన వాకథాన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, ఐబిడి స్పెషలిస్ట్ డాక్టర్ కిరణ్ పెద్ది మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా చూస్తే ప్రస్తుతం భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో ఐబిడి కేసులు నమోదవుతున్నయని అన్నారు. ఈ కార్యక్రమంలో యశోద డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్, డాక్టర్. శారద తదితరులు పాల్గొన్నారు.

మహాప్రస్థానం ట్రస్ట్‌కే 'మహాపరినిర్వాణ' నిర్వహణ

- జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఆమోదం

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ పంపిన ప్రతిపాదనల మేరకు ఎల్‌బీనగర్ జంక్షన్‌కు తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి జంక్షన్‌గా మునిసిపల్ పరిపాలన శాఖ జారీ చేసిన జీవో నెంబర్ 54కు, ఎల్‌బీనగర్ కుడివైపు ఫ్లై ఓవర్‌కు మాల్‌మైసమ్మ ఫ్లై ఓవర్‌గా జారీచేసిన జీవోనెంబర్ 53కు శుక్రవారం జరిగిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. వీటితోపాటు మరో తొమ్మిది అంశాలకు కమిటీ ఆమోదం తెలిపింది. వాటిల్లో ముఖ్యాంశాలు..

- సీఎస్సార్‌కింద ధనియాల గుట్ట మహాపరినిర్వాణ (శ్మశానవాటిక) నిర్వహణ మహాప్రస్థానం ట్రస్ట్‌కు ఐదుసంవత్సరాల పాటు అప్పగింత.
- గాజుల రామారం పెరికి చెరువు వద్ద రూ.3 కోట్ల అంచనా వ్యయంతో డ్రైనేజీ డైవర్షన్ పనులు.
- జీహెచ్ఎంసీ కాల్‌సెంటర్(040-21 11 11 11) నిర్వహణ మరో మూడు సంవత్సరాలు పొడిగింపు. అందుకుగాను ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ సర్వీసెస్‌కు రూ. 2.27 కోట్ల చెల్లింపు.
- సీఎస్సార్ ద్వారా ప్రైవేటు సంస్థలకు పేట్‌బషీరాబాద్‌లో రోడ్డు నిర్మాణం, ట్రిపుల్‌ఐటీ జంక్షన్ నుంచి ర్యాడిసన్ హోటల్ వరకు సెంట్రల్ మీడియన్స్/ట్రాఫిక్ ఐలాండ్ల నిర్వహణ పనులు.

పేద విద్యార్థులకు అన్యాయం జరగొద్దు

- తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి

బంజారాహిల్స్: నూతన విద్యా విధానం-2020 ద్వారా అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. ఆర్.లింబాద్రి అన్నారు. అందుకు అవసరమైన మార్పులు చేర్పులు అవసరమని సూచించారు. డా.బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం 'నూతన విద్యావిధానం -2020 అమలు ముందుకు వెళ్లడం' అనే అంశంపై యూనివర్సిటీ క్యాంపస్‌లో జాతీయ సదస్సును ప్రత్యక్ష వెబినార్ మోడ్‌లో నిర్వహించారు. ప్రొ.ఆర్.లింబాద్రి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ..21వ శతాబ్దికి అవసరమైన విధానాలను నూతన విద్యా విధానం -2020లో పొందుపర్చారని పేర్కొన్నారు. అయితే ప్రైవేటు విశ్వ విద్యాలయాల విషయంలో సమస్యలు రానున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్లోబల్ విద్యాలయాలు వస్తున్న నేపథ్యంలో పేదవర్గాల విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవన్నారు. ఉస్మానియా వర్సిటీ వీసీ ఆచార్య డి.రవీందర్‌మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నియామకాలు లేక భారీ సంఖ్యలో ఖాళీలు పేరుకుపోతున్న సమయంలో ఆంక్షలు విధించడం విశ్వవిద్యాలయాలను ఒత్తిడికి గురిచేయడమే అన్నారు. అంబేద్కర్‌వర్సిటీ ఉప కులపతి ప్రొ.కే.సీతారామారావు, సెంట్రల్ యూనివర్సిటీ ఉప కులపతి ప్రొ.బీజే.రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు జనరిక్ మందులనే రాయాలి

పంజగుట్ట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైద్యులు తప్పనిసరిగా జనరిక్ మందులనే ప్రిస్క్రిప్షన్‌లో రాయాలని, ఆ మందులు రోగులకు అందుబాటులో ఉండేలా చూడాలని దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఈ నెల 12వ తేదీన వెల్లడించిన ఆదేశాల ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రుల్లోని వైద్యులు జనరిక్ మందులు రాయకపోతే వారిపై చర్యలు ఉంటాయని చెప్పిందని గుర్తుచేశారు.



మీ నవ్వు బంగారం గానూ..

ఆభరణాలంటే అతివలకు ఎంతో మక్కువ. ఇక ఏకంగా ఎగ్జిబిషన్‌ను సందర్శిస్తే వారి సంబరమే వేరుగా ఉంటుంది. మాదాపూర్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ ఆభరణాల ప్రదర్శనలో శుక్రవారం కొందరు యువతులు ఇలా నగలు తిలకిస్తూ...నవ్వులు చిందిస్తూ సందడి చేశారు.

2థౌజండ్‌వాలా.. డీలా!

రూ.2 వేల నోట్లు రద్దుతో ఉలిక్కిపడ్డ 'నల్ల' కుబేరులు





- ఎలక్షన్ ఇయర్ కావడంతో అవాక్కైన రాజకీయ నేతలు
- మార్పిడి, ప్రత్యామ్నాయాలపై మొదలైన సంప్రదింపులు
- హవాలా లావాదేవీలు సైతం పెరిగిపోయే అవకాశాలు

సాక్షి, సిటీబ్యూరో: దేశంలో ఆరున్నరేళ్ల తర్వాత మరో డీమానిటైజేషన్ చోటు చేసుకుంది. క్లీన్ నోట్ పాలసీలో భాగంగా రూ.2 వేల నోట్లను ఉపసంహరిస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23 నుంచి వీటిని మార్చుకునేందుకు అవకాశం ఇచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు మాత్రమే బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి అంగీకరిస్తారు. ఈ పరిణామాలు 'గ్రేటర్' పరిధిలోని రియల్టీ, కన్‌స్ట్రక్షన్ రంగాల్లో ఉన్న పెద్దలతో పాటు రాజకీయ నాయకులకు పెద్ద షాక్ ఇచ్చింది.

సగానికి పైగా నల్లధనమే...

రియల్‌ఎస్టేట్ రంగంలో జరిగే లావాదేవీల్లో అత్యధికం నగదు రూపంలో, అదీ నల్లధనం చెలామణి ఎక్కువ. ఏ భూమి చూసినా దాని కార్డ్ వాల్యూకి, మార్కెట్ ధరకు మధ్య పొంతన ఉండదు. వీటి మధ్య దాదాపు 60 నుంచి 80 శాతం వరకు వ్యత్యాసం ఉంటుంది. కార్డ్ వాల్యూగా పిలిచే ప్రభుత్వ ధర రూ.లక్షల్లో ఉంటే మార్కెట్ రేటు రూ.కోట్లకు చేరుతుంది. ఈ కారణంగానే డాక్యుమెంట్లలో కార్డ్ వాల్యూ నమోదు చేసే క్రయవిక్రయదారులు ఆ మేరకు మాత్రమే డీడీలు, చెక్కులు తదితర రూపాల్లో బదిలీ చేసుకుంటాయి. మిగిలిన మొత్తం నగదు రూపంలో ఇచ్చిపుచ్చుకుంటారు. దీంతో పాటు నిర్మాణ రంగంలోనూ నగదు లావాదేవీలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఈ రెండు చోట్లా చెలామణి అయ్యే వాటిలో రూ.2 వేల నోట్లే ఎక్కువగా ఉంటాయన్నది జగమెరిగిన సత్యం.

నేతలు, బినామీల వద్దా ఇవే...

రాష్ట్ర శాసనసభకు ఈ ఏడాది చివరలో, పార్లమెంట్‌కు వచ్చే ఏడాది ప్రథమార్థంలో ఎన్నికలు జరుగనున్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిణామాల నేపథ్యంలో గ్రేటర్ పరిధిలోని చిన్న ఎమ్మెల్యే నియోజకవర్గానికీ రూ.కోట్లలో ఖర్చు పెట్టాల్సిందే. ఎన్నికల సంఘానికి చిక్కకుండా చేసే ఈ ఖర్చుల్లో నల్లధనమే ఎక్కువగా ఉంటుంది. దీని కోసం బడా, ఛోటా నేతలు, వాళ్ల బినామీలు భారీ మొత్తం రూ.2 వేల నోట్ల రూపంలో దాచిపెట్టారన్నది బహిరంగ రహస్యం. ఈ కారణంగానే రూ.3 లక్షల కోట్లకు పైగా విలువైన రూ.2 వేల నోట్లు చెలామణిలో ఉన్నాయని ఆర్బీఐ చెప్తున్నా..బ్యాంకుల్లో మాత్రం ఇవి అందుబాటులో లేవు. బ్యాంకుల్లో లేవనే విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ సైతం అంగీకరిస్తోంది. అలా దాచి పెట్టుకున్న నేతలకు ప్రస్తుతం ఆర్బీఐ తీసుకున్న నిర్ణయం శరాఘాతంగా మారింది.

నిఘా పెంచాలని పోలీసుల నిర్ణయం...

ఈ పరిణామాల నేపథ్యంలో నోట్ల మార్పిడికి భారీగా డిమాండ్ రానుంది. దీన్ని అదునుగా చేసుకుని హవాలా ర్యాకెట్లు లావాదేవీలు ఒక్కసారిగా పెరిగిపోతాయి. వీటన్నింటికీ మించి కమీషన్ తీసుకుని నోట్లు మార్పిడి చేసి ఇచ్చే వ్యవస్థీకృత ముఠాలు, ఆ పేరు చెప్పి మోసాలకు పాల్పడే కేటుగాళ్లు రెచ్చిపోతారు. 2016 నవంబర్ 10న అమలులోకి వచ్చిన డీమానిటైజేషన్ సందర్భంలో ఇలాంటి అనేక ఉదంతాలు నగరంలో చోటు చేసుకున్నాయి. వీటిని పరిగణలోకి తీసుకుంటున్న పోలీసు, నిఘా విభాగాలు సైతం అప్రమత్తమం అవుతున్నాయి. ఇప్పటికే నగరంలో ఉన్న హవాలా రాకెట్లు, గతంలో ఈ కేసుల్లో అరెస్టు అయి బయటకు వచ్చిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నారు. వీటికి తోడు త్వరలో ఎదురుకానున్న నోట్ల మార్పిడి కష్టాలు తలుచుకుంటూ నగర వాసులు సైతం ఉలిక్కిపడుతున్నారు. 2016 నాటి అనుభవాలను నెమరువేసుకుంటున్నారు.

సెగ భగలు..





నగరంలో ఎండ భగభగలు కొనసాగుతున్నాయి. పగటిపూట జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. శుక్రవారం నగరంలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో మధ్యాహ్నం వేళ రహదారులన్నీ బోసిగా కన్పించాయి. ట్యాంక్‌బండ్ రహదారి ఇలా నిర్మానుష్యంగా మారింది..



ఇక లేక్‌సిటీ

జంట జలాశయాల చేరువలో..

- జీవో 111 ఎత్తివేత నేపథ్యంలో త్వరలో మరో కొత్త జీఓ
- సగానికి పైగా తగ్గనున్న జంట జలాశయాల బఫర్‌జోన్

సాక్షి, సిటీబ్యూరో: జీవో 111ను పూర్తిగా ఎత్తివేసిన నేపథ్యంలో హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకొని మరో అద్భుతమైన లేక్‌సిటీ నిర్మాణానికి కార్యాచరణ ఆరంభమైంది. ఆకాశాన్నంటే హైరైజ్‌డ్ బహుళ అంతస్తుల భవనాలతో జంట జలాశయాలకు చేరువలో ఈ లేక్‌సిటీ రూపుదిద్దుకోనుంది. హెచ్ఎండీఏ నిబంధనలకు అనుగుణంగానే జీవో 111 పరిధిలోని గ్రామాల్లో భవన నిర్మాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ఐటీ పరిశ్రమలు తదితర నిర్మాణాలకు అనుమతులనివ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వెల్లడించిన దృష్ట్యా ఆ దిశగా హెచ్ఎండీఏ కసరత్తు చేపట్టింది. ప్రస్తుతం మాస్టర్‌ప్లాన్ ప్రకారమే హెచ్ఎండీఏ పరిధిలో నిర్మాణ అనుమతులను అందజేస్తున్నారు. ఇదే పద్ధతిలో 111 జీవో పరిధిలోని 84 గ్రామాల్లో కూడా నిర్మాణాలను చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల పరిరక్షణ కోసం తెచ్చిన జీవో 111 పూర్తిగా ఎత్తివేసిన దృష్ట్యా ప్రభుత్వం మరో కొత్త జీఓను తేవాల్సి ఉంది. 'కొత్త జీఓలోని విధివిధానాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ ఉంటుందని హెచ్ఎండీఏ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇందుకోసం కొంత సమయం పట్టవచ్చునన్నారు. మరోవైపు గత సంవత్సరం ఏప్రిల్ 20వ తేదీన జీవో 111 ఎత్తివేస్తూ దానిస్థానంలో జీఓ 69 విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా ప్రణాళికాబద్ధమైన నగర నిర్మాణం కోసం ప్రభుత్వం ఒక కమిటీని కూడా నియమించింది. ఆ కమిటీ ఇటీవల సమర్పించిన నివేదికను అనుగుణంగానే కొత్త మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేయనున్నట్లు హెచ్ఎండీఏ అధికారి పేర్కొన్నారు.

సగానికి పైగా తగ్గనున్న బఫర్‌జోన్...

ప్రస్తుతం జంట జలాశయాలకు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏడు మండలాల పరిధిలోని 84 గ్రామాలలో జలాశయాల పరిరక్షణ దృష్ట్యా నిర్మాణాలను నిషేధించిన సంగతి తెలిసిందే. 111 జీఓ ఎత్తివేత దృష్ట్యా రెండు జలాశయాల బఫర్ జోన్ పరిధిని భారీగా కుదించే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి వరకు 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో భారీఎత్తున నివాస ప్రాంతాలు అందుబాటులోకి రానున్నాయి. మరోవైపు ఇప్పటికే చేపట్టిన అక్రమ కట్టడాలన్నింటికీ అనుమతులు లభించవచ్చు. మెయినాబాద్, శంషాబాద్, షాబాద్, కొత్తూరు, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల మండలాల పరిధిలో పరిధిలో సుమారు 1.32 లక్షల ఎకరాల భూమి వినియోగంలోకి రానుంది. ఇందులో ప్రస్తుతం బయోకన్సర్వేషన్‌జోన్‌లో ఉన్న 90 శాతం భూమిపైన ఆంక్షలు తొలగడంతో భారీ ఎత్తున నిర్మాణ అనుమతులు లభించనున్నాయి. 'ప్రస్తుతం నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటలు, తదితర జలవనరులు, అడవులు, పర్యావరణ పరిరక్షణకు జీవవైవిధ్య సమతుల్యతకు పాటిస్తున్న ప్రమాణాలనే 111జీవో పరిధిలో కూడా అమలు చేస్తూ మాస్టర్‌ప్లాన్‌కు రూపకల్పన చేస్తాం' అని అధికారులు చెప్పారు.

'చెత్త' చార్జీలకు ఎన్నికల దెబ్బ!

నగరంలో ఎన్నికల పవనాలు మొదలయ్యాయి. మరో ఆరేడు నెలల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటికే పలు కార్యక్రమాలకు సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం..ప్రజలు వ్యతిరేకిస్తారనుకునే ఏ చిన్న అంశాన్నీ అమలు చేయాలనుకోవడం లేదు. ఈ కోవలోనే ఇటీవల చెత్త తరలింపుపై యూజర్ చార్జీలు వడ్డించాలని నిర్ణయించి..మళ్లీ నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. - సాక్షి, సిటీబ్యూరో

- చెత్త తరలింపు యూజర్ చార్జీలపై బల్దియా వెనుకడుగు
- వ్యతిరేకత వస్తుందనే తలంపుతోనే..



జీహెచ్ఎంసీలో ఇంటింటినుంచి చెత్త తరలింపునకు స్వచ్ఛ ఆటోలు పంపిణీ చేశారు. చెత్త తరలించే కార్మికులు ఆయా ప్రాంతాల్ని బట్టి, ప్రజల స్థోమతల్ని బట్టి నెలకు రూ. 50 నుంచి రూ.500 వరకు తీసుకుంటున్నారు. ఇది ఓవైపు దృశ్యం కాగా, మరోవైపు ఇళ్ల నుంచి ప్రతిరోజూ చెత్త తరలించడం లేదనే ఫిర్యాదులున్నాయి. చెత్త తరలించకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలో కూడా తెలియని పరిస్థితి. అధికారుల నుంచీ దీనిపై స్పందన లేదు. ఈ నేపథ్యంలో ప్రతి ఇంటికీ ఆటో వెళ్లేలా తగిన చర్యలు తీసుకోవడంతోపాటు స్వచ్ఛకార్మికులకు స్థిర ఆదాయం కల్పించాలనే తలంపుతో చెత్త తరలింపునకు యూజర్ చార్జీలు అమల్లోకి తేవాలని భావించారు. వాటిని కాలనీల్లో నెలకు ఇంటికి కనీసంగా రూ.100, స్లమ్స్‌లో కనిష్ఠంగా రూ.50 వసూలు చేసేలా అమలు చేయాలనుకున్నారు. దాన్ని స్టాండింగ్ కమిటీలో ఆమోదింపచేసేందుకు గత బుధవారం జరగాల్సిన స్టాండింగ్‌కమిటీ అజెండాలో మొదటి అంశంగా చేర్చారు. ఈ అంశంపై కొన్ని వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో కమిషనర్ అందుబాటులో లేరనే సాకుతో ఆరోజు స్టాండింగ్‌కమిటీ సమావేశాన్ని నిర్వహించకుండా శుక్రవారానికి వాయిదా వేశారు. ఈలోగా ఆ అంశాన్ని మరిచిపోయారనుకున్నారో ఏమో శుక్రవారం సమావేశంలో అజెండాలోనే లేకుండా తొలగించారు. కారణమేమిటంటే ఎవరి నుంచీ స్పందన లేదు.

కాలనీ ఏది..స్లమ్ ఏది..?

విశ్వసనీయ సమాచారం మేరకు.. ఎన్నికలకు ముందు కొత్త విధానాలతో లేనిపోని తలనొప్పులు ఎందుకనే యోచనలో ప్రభుత్వ పెద్దలున్నట్లు తెలిసింది. రూ. 50, రూ.100లను కనీస చార్జీలని పేర్కొనడంతో అంతకంటే ఎక్కువ వసూలు చేసేందుకూ వీలుంటుంది. గరిష్ఠ చార్జీకి ఒక పరిమితి అంటూ లేదు. మరోవైపు ఇప్పటికే రూ. 100 కన్నా ఎక్కువ ఇస్తున్న ప్రజలు సైతం రూ. 100 లనే జీహెచ్ఎంసీ నిర్ణయించిందని ఎక్కువ చెల్లించేందుకు నిరాకరించే పరిస్థితులున్నాయి. దాని వల్ల స్వచ్ఛ కార్మికులకు ఆదాయం తగ్గుతుంది. జీహెచ్ఎంసీ లెక్కల మేరకు ఇంకా స్లమ్స్‌జాబితాల్లో ఉన్నవి సైతం ఇప్పుడు కాలనీలుగా అభివృద్ధి చెందాయి. అక్కడ స్లమ్‌చార్జీలు, కాలనీ చార్జీలు అనే పంచాయితీ జరుగుతుంది. అంతే కాకుండా యూజర్ చార్జీలని చెప్పి అధికారికంగా వసూలు చేసినప్పుడు.. సకాలంలో చెత్త తరలించకపోతే ప్రజలనుంచి ఫిర్యాదులు పెరుగుతాయి. వాటిని పరిష్కరించే వారు లేరు. ఇలా వివిధ కోణాల్లో వ్యతిరేక ఫలితాలొచ్చే ప్రమాదమున్నందున ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు గుట్టుచప్పుడు కాకుండా అజెండా నుంచే ఈ అంశాన్ని తొలగించారు.

ఎన్నికల చూపుతోనే వార్డు కార్యాలయాలు..

ఎన్నికల చూపుతోనే వచ్చేనెల నుంచి వార్డు కార్యాలయాల ద్వారా ప్రజల స్థానిక సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. కొత్తగా విధించే చార్జీల వల్ల స్థానికంగా ఏర్పడే వార్డు కార్యాలయాల్లో ఈ చెత్త సమస్యలే ఎక్కువయ్యే అవకాశాలున్నాయి. స్థానిక సమస్యల్ని త్వరితంగా పరిష్కరించడం ద్వారా ప్రజల్లో మంచిపేరు పొందాలనే తలంపుతోనే హడావుడిగా వార్డు కార్యాలయాలకు సిద్ధమయ్యారు. కమ్యూనిటీ హాళ్లనే వార్డు కార్యాలయాలుగా మారుస్తున్నారు.

అభివృద్ధి కార్యక్రమాలతో ప్రచారానికి శ్రీకారం

మరోవైపు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి వచ్చే సంవత్సరానికి పది సంవత్సరాలు పూర్తికానుండగా, ఎన్నికల చూపుతోనే దశాబ్ది ఉత్సవాల పేరిట ఒక యేడాది ముందుగానే రాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి విభాగాల వారీగా భారీయెత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఏ కార్యక్రమం చూసినా ఎన్నికలతో ముడిపడి ఉండటాన్ని గుర్తించాలని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

క్రమ'శిక్షణ'తో..

ప్రాంగణమే ప్రాణం.. నేర్పడమే ధ్యేయం

- స్వచ్ఛందంగానే కొండంత అండగా కోచ్‌లు
- అయినా పట్టించుకోని జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లకు ఎంతో క్రేజ్. వీటిలో ఏటా వేలసంఖ్యలో బాలలు శిక్షణ పొందుతున్నారు. అలాగే జీహెచ్ఎంసీకి చెందిన 520 ప్లేగ్రౌండ్లలో ఔత్సాహికులకు వివిధ క్రీడల్లో ప్రతిరోజూ శిక్షణనిస్తున్న కోచ్‌లకు మాత్రం ఎలాంటి వేతనాలు లేవు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా కనుగుణంగా నగరంలో మరిన్ని క్రీడాప్రాంగణాలను అభివృద్ధి చేసి ఎక్కువ మందికి శిక్షణ అవకాశం కల్పించాలని కోరుతున్నారు.


గౌరవ వేతనమైనా లేదు..

జీహెచ్ఎంసీలో 520 ఓపెన్‌ప్లేసెస్/గ్రౌండ్స్,5 స్కేటింగ్ గ్రౌండ్స్,29స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. వీటన్నింటికీ కేవలం 77 మంది పార్ట్‌టైమ్ కోచ్‌లను మాత్రం జీహెచ్ఎంసీ నియమించింది. మిగతా కోచ్‌లంతా స్వచ్ఛందంగానే సేవలందిస్తున్నారు. వీరి శిక్షణలో పతకాలు, కప్పులు లభించినప్పుడు మాత్రం తమ గొప్పగా చెప్పుకొంటోంది. వీరికి కనీసం గౌరవ వేతనమైనా ఇవ్వాలని వారివద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థులు కోరుతున్నారు.

బాస్కెట్‌బాల్ అంటే అంజిబాబు..

- వివిధ స్థాయిల్లో ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన కోచ్‌లలో కొందరిది మరింత ప్రత్యేక స్థానం. అలాంటి వారిలో ఒకరు బసివి అంజిబాబు. బాస్కెట్‌బాల్‌ను మరో ప్రాణంగా భావించే అంజిబాబు ఓవైపు ప్రభుత్వోద్యోగిగా కులీకుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నా, మిగతా సమయమంతా ఉండేది తను ప్రాణంగా చూసుకునే కూకట్‌పల్లి ఏడో ఫేజ్‌లోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లోనే. ఎందుకూ పనికిరాని స్థలాన్ని క్రీడాప్రాంగణంగా తీర్చిదిద్దారు.ఎప్పటికప్పుడు వెంటపడి ప్రభుత్వం నుంచి నిధులు పొంది మోడల్ ప్లేగ్రౌండ్‌గా అభివృద్ధి చేశారు. ఆయన వద్ద శిక్షణ పొందిన షేక్ ఖాజావలి సబ్‌జూనియర్, యూత్ నేషనల్స్ నుంచి యూనివర్సిటీ నేషనల్స్ వరకు ఆరు పర్యాయాలు వివిధ రాష్ట్రాల్లో జరిగిన పోటీల్లో పాల్గొనడంతో పాటు బాస్కెట్‌బాల్ చాంపియన్‌గా ఎదిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఈఖాతాలో ఇంకా ఎంతో మంది ఉన్నారు.

ప్రభుత్వమే నిర్వహించాలి: అంజిబాబు



శిక్షణకు భారీ ఫీజులు వసూలు చేసే సంస్థలకు ప్రభుత్వస్థలాలను లీజుకివ్వకుండా ప్రభుత్వమే స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలి. పేద పిల్లలకు ఎక్కువ మందికి అవకాశం లభించేందుకు కోచ్‌లకు కనీసం గౌరవవేతనమిస్తే ఇంకా ఎందరో కోచ్‌లుగా పనిచేసేందుకు ముందుకొస్తారు.

వజ్రాలుగా తీర్చిదిద్దుతున్న ప్రతాప్..

- పాతబస్తీ ఉప్పుగూడ శివాజీనగర్‌కు చెందిన బాక్సింగ్ కోచ్ ప్రతాప్‌ప్రదీప్ గత ఎనిమిదేళ్లుగా పూల్‌బాగ్ చమన్ జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు. ఈయన వద్ద శిక్షణ పొందుతున్న కర్శిమరాణి షిండే 2019లో హరియాణాలో, 2022లో మణిపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. ఇంకా పలువురు విద్యార్థులు జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొన్నారు. అంజిబాబు, ప్రతాప్‌లలాగే స్వచ్ఛందంగా సేవచేస్తూ విద్యార్థులను క్రీడల్లో రాణించేలా చేస్తున్నవారెందరెందరో ఉన్నారు. జీహెచ్ఎంసీకి కనీసం మరో 120మంది కోచ్‌లైనా కావాల్సి ఉందని తాత్కాలిక కోచ్‌లు చెబుతున్నారు.



బాల బాలికలకు శిక్షణ ఇస్తున్న ప్రతాప్ ప్రదీప్

కూకట్‌పల్లి నుంచే క్రీడా ప్రస్థానం..



కూకట్‌పల్లి బాస్కెట్‌బాల్ గ్రౌండ్ నుంచే చాంపియన్‌స్థాయికి ఎదిగాను. ఆగ్రౌండ్‌లో ఎన్నో క్రీడలకు శిక్షణనిస్తున్నా బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌గానే పేరుపడిందంటే దాని ప్రత్యేకతఏంటో, కోచ్ అంజిబాబు కృషి ఏంటో గుర్తించవచ్చు. ఉత్సాహం ఉన్నవారిని క్రీడా రత్నాలుగా తీర్దిదిద్దే అంజిబాబు శిక్షణతోనే ఈస్థాయికి ఎదిగాను. - షేక్ ఖాజావలి

ఏసీబీ వలలో ఫీవర్ ఆస్పత్రి హెల్త్ ఇన్‌స్పెక్టర్


హెల్త్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

నల్లకుంట: ఔట్ సోర్సింగ్ ఉద్యోగి నుంచి రూ. 15 వేలు లంచం తీసుకుంటూ నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి హెల్త్ ఇన్‌స్పెక్టర్ రెడ్‌హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఈగల్ సెక్యూరిటీ ఏజెన్సీ ద్వారా షబానా అనే మహిళ ఫీవర్ ఆస్పత్రి ఔట్ సోర్సింగ్ విభాగంలో రెండు నెలల క్రితం స్వీపర్‌గా విధుల్లో చేరింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల హాజరు నమోదు చేసే బాధ్యతలు నిర్వర్తించే హెల్త్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సదరు మహిళను రూ. 20 వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. పథకం ప్రకారం ఆసుపత్రిలో మాటు వేసిన ఏసీబీ డీఎస్పీ శ్రీకాంత్ తన బృందంతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం షబానా నుంచి హెల్త్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఉన్నతాధికారుల స్టేట్‌మెంట్ రికార్డు

ఈ విషయమై ఏసీబీ అధికారులు ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మోహన్ దాసుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం, సిబ్బంది హాజరు, వేతనాల చెల్లింపు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సతీష్ కుమార్, శ్రీకాంత్, ఆజాద్, జగన్ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నిందితుడు వెంకటేశ్వర్లును అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు.

కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి ఐదేళ్ల జైలు

మల్కాజిగిరి: కన్నకూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ అడిషనల్ జిల్లా కోర్టు న్యాయమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐ వెంకట్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.తూప్రాన్‌కు చెందిన నర్సింహ భార్య, ఇద్దరు పిల్లలతో సహా నగరానికి వలసవచ్చి గౌతంనగర్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య ఇళ్లల్లో పనిచేసేది. 2020 అక్టోబర్‌లో భార్య పనికి వెళ్లగా, చిన్నకూతురు, కుమారుడిని దుకాణానికి పంపించి , పెద్ద కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.

యాదవులకు రేవంత్ క్షమాపణ చెప్పాలి


మాట్లాడుతున్న శ్రీశైలం యాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ఈ నెల 24లోగా గొల్లకురుమలు, మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌కు క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో 25న గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలంయాదవ్ అన్నారు. శుక్రవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ నేతగా ఓటుకు నోటు కేసులో పట్టుబడి, ఆ తర్వాత అడ్డదారిలో టీపీసీసీ అధ్యక్షపదవి పొందిన రేవంత్‌రెడ్డికి యాదవులను విమర్శించే అర్హత లేదన్నారు. రాష్ట్రంలో అతి చిన్న వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొంది పలు మార్లు మంత్రిగా సేవలందించిన మంత్రి శ్రీనివాస్ యాదవ్‌పై విమర్శలు చేయడం దారుణమన్నారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు గొల్లకురమల వృత్తిని, జీవనశైలిని కించపరిచేలా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రేవంత్‌రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేని పక్షంలో ఈ నెల 25న గాంధీ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ చైర్మన్ కావటి సతీష్‌యాదవ్, టీఎస్ జేఏసీ అధ్యక్షులు పోగుల చిరంజీవి యాదవ్, తలసాని యువసేన అధ్యక్షులు రెమడాల శ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజ్‌యాదవ్, నాగారం ప్రశాంత్‌మాదిగ, ఓయూ జేఏసీ నాయకులు వేల్పుకొండ రామకృష్ణమాదిగ, నాగేందర్‌రావు, అవినాష్, శ్రావణ్‌యాదవ్, నగేష్‌యాదవ్, మల్లేష్‌మాదిగ, రమేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక..

నవ వధువు ఆత్మహత్య


నిషిత (ఫైల్)

కుత్బుల్లాపూర్: భర్త వేధింపులు తాళలేక ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్‌బషీరాబాద్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ మండలం, దబిల్‌పూర్ గ్రామానికి చెందిన సంతోష్‌రెడ్డికి కుత్బుల్లాపూర్ బాపూనగర్‌కు చెందిన నిషితతో ఈ నెల 5న వివాహం జరిగింది. పెళ్లి సమయంలో వధువు కుటుంబ సభ్యులు 60 తులాల బంగారం, రెండు కిలోల వెండి కట్నంగా ఇచ్చారు. గుమ్మడిదలలోని 550 గజాల స్థలాన్ని పది రోజుల్లో రిజిస్టర్ చేస్తామని తెలిపారు. పెళ్లైనా వారం రోజులకే సంతోష్‌రెడ్డి ప్లాట్ రిజిస్ట్రేషన్ విషయమై భార్యను వేధిస్తున్నాడు. ఈ నెల 17న నిషితను ఆమె ఇంటికి తీసుకువెళ్లిన సంతోష్‌రెడ్డి ఆమె మొబైల్ ఫోన్‌లో నంబర్లను చూపించి తల్లిదండ్రుల ఎదుటే ఆమెను దుర్భాషలాడటమేగాక చేయి చేసుకున్నాడు. 18న మధ్యాహ్నం బాపునగర్‌లోని అత్తారింటికి వచ్చిన సంతోష్‌రెడ్డి మరోసారి భార్యను ఫోన్ నెంబర్ల విషయమై వేధించాడు. రాత్రి 8 గంటలకు పెద్ద మనుషుల మధ్య మాట్లాడుతుండగా మరోమారు భార్యను తిట్టడంతో మనస్తాపానికి గురైన నిషిత గ్రౌండ్ ఫ్లోర్‌లోని స్లాబ్ హుక్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వెంకటాద్రి@48


కాచిగూడ రైల్వే స్టేషన్‌లో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు వద్ద వేడుకలు నిర్వహిస్తున్న అభిమానులు

కాచిగూడ: కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి వెళ్లే వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైలు, కాచిగూడ – మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రారంభమై 47 సంవత్సరాలు పూర్తి చేసుకుని 48వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా సౌత్ సెంట్రల్ రైల్వే రైల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో రైలు వద్ద కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో స్టేషన్ డైరెక్టర్ కె.బాలాజీ, స్టేషన్ మేనేజర్ ఆర్‌బి మీనా, రైల్వే అధికారులు, సిబ్బంది, రైల్ ఫ్యాన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్ వీరంగం

- ముగ్గురిపై కత్తితో దాడి
- ఒకరి పరిస్థితి విషమం


గాయపడిన జహీర్

నాంపల్లి: అర్ధరాత్రి కత్తితో వీరంగం సృష్టించిన ఓ రౌడీ షీటర్ కత్తితో ముగ్గురిపై దాడి చేశాడు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన గురువారం రాత్రి హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దర్గా షా ఖామూస్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. లతీఫ్ అనే వ్యక్తి స్థానిక మెడికల్ స్టోర్‌లో పని చేస్తున్నాడు. గురువారం రాత్రి అతను ఇంటికి వెళుతుండగా గంజాయి మత్తులో ఉన్న రౌడీ షీటర్ మోయిద్ తన స్నేహితులతో కలిసి లతీఫ్‌ను డబ్బులు ఇవ్వమని బెదిరించాడు. దీంతో అతను వారి నుంచి తప్పించుకుని ఇంటికి వెళ్లి తన అన్న మహమ్మద్ జహూర్‌కి ఈ విషయం చెప్పాడు. దీంతో అక్కడికి వచ్చిన జహూర్ మోయిద్‌ను నిలదీయగా అతడిపై కత్తితో దాడి చేశారు. ఈ క్రమంలో జహూర్ తండ్రి అతని సోదరి అడ్డుకునేందుకు యత్నించగా వారిపై కూడా కత్తితో దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన జహూర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడదామని పిలిచి కత్తితో దాడి

బంజారాహిల్స్: మాట్లాడదామంటూ పిలిపించి కత్తితో దాడికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... హకీంపేట ఎన్ఎస్ఎఫ్‌కాలనీకి చెందిన మహ్మద్ ఫైసల్‌ను ఈ నెల 17న సాయంత్రం అతడి స్నేహితుడు నవాజ్ ఫోన్ చేసి మాట్లాడే పని ఉందని హకీంపేట కమ్యూనిటీ హాల్ వద్దకు రావాలని చెప్పాడు. అక్కడికి వచ్చిన ఫైజల్‌ను నవాజ్‌తో పాటు అతడి స్నేహితుడు అలీమ్ అకారణంగా దూషించడంతో పాటు జేబులో ఉన్న కత్తి తీసి బెదిరించడంతో అతను అక్కడి నుంచి పారిపోయాడు. అదేరోజు రాత్రి మరోసారి ఫైజల్‌కు ఫోన్‌చేసి లిమ్రా హోటల్ వద్దకు రావాలని పిలిచాడు. వారి మాటలు నమ్మి అక్కడకి వచ్చిన ఫైజల్‌పై నవాజ్ కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాయిని శైలజకు ఓయూ డాక్టరేట్


నాయిని శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ: నగరంలోని సరోజిని నాయుడు వనితా మహా విద్యాలయంలో జువాలజీ అధ్యాపకురాలిగా పని చేస్తున్న నాయిని శైలజకు ఓయూ డాక్టరేట్ లభించింది. జంతుశాస్త్రం అధ్యాపకులు ప్రొ.సబితరాజు పర్యవేక్షణలో 'స్టడీస్ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ ఫర్స్కోలిన్ ఆన్ ద ఊజిప్టె' (ఎక్సోరిస్టా బాంబిసిస్) అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. వనితా మహావిద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ శోభన, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ రాధిక, ఉపేందర్, న్యాక్ కోఆర్డినేటర్ సుబ్బారావుతో పాటు ఆదిత్యమార్గమ్, విజయ్‌కుమార్, దిలీప్ రెడ్డి తదితరులు నాయిని శైలజకు అభినందనలు తెలిపారు.

కుల వృత్తులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం


మాట్లాడుతున్న జూలూరి గౌరీ శంకర్

ఉప్పల్: తెలంగాణ రాష్ట్రంలో కులవృత్తిదారులకు ప్రభుత్వం నుంచిసంపూర్ణ సహాయ, సహకారాలు అందుతున్నాయని తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. శుక్రవారం ఉప్పల్ భగాయత్‌లోని విశ్వ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ స్పీకర్ మధుసూదనాచారి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రత్యేక శద్ధ తీసుకుంటుందన్నారు. కులవృత్తులతో జీవనం సాగించే వారికి రూ. లక్ష సహాయం అందించడమేగాక, భవిష్యత్తులోనూ వీరి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుందన్నారు. జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ కుల వృత్తుల చేసుకునే వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు ఈ పథకం దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ అధ్యక్షులు లాల్‌కోట వెంకటాచారి, కార్యదర్శి బోడ్డుపల్లి సుదర్శన్, ఉపాధ్యక్షులు వేముల వాడ మదన్ మోహన్, గణేష్ హనుమాండ్లు, లక్ష్మీ రామాచారి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీలో ఆకస్మిక బదిలీలు

- 56 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు
- 83 మంది సూపరింటెండెంట్‌లకు స్థానచలనం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆకస్మిక బదిలీలు జరిగాయి. 56 మంది అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు (ఏఎంసీ), 83 మంది సూపరింటెండెంట్‌లను బదిలీ చేస్తూ కమిషనర్ లోకేష్ కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో ఒకేసారి ఇంతమంది అధికారులకు స్థానచలనం కలగడం ఇదే తొలిసారి. వార్డు పాలనా వ్యవస్థలో భాగంగా తాజా బదిలీలు చేపట్టినట్లు సమాచారం.

నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై దాడి

రాజేంద్రనగర్: నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి, 200 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్, 20 ప్యాకింగ్ మెషిన్లు, 40 సంచుల అల్లం, 10 లీటర్ల యాసిడ్ మిశ్రమాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఎంఎం పహడీ ప్రాంతంలో దక్కన్ ట్రేడర్స్ పేరిట సోహేల్ అనే వ్యక్తి పరిశ్రమను ఏర్పాటు చేసి నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తూ నగరంలో విక్రయిస్తున్నాడు. ప్రమాదకర రసాయనాలను వినియోగించి దీనిని తయారు చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందడంతో ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి భారీగా ముడి పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రాజేంద్రనగర్ పోలీసులకు అప్పగించారు.


స్వాధీనం చేసుకున్న నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్

అప్పుల బాధ తాళలేక..

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలవన్మరణం

కుషాయిగూడ: అప్పులు తీర్చే దారిలేక ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. భవానీనగర్ కాలనీకి చెందిన గేదెల సుదర్శనరావు కుమారుడు నిరంజన్‌కుమార్ (28) సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న అతను అప్పులపాలయ్యాడు. కొంతకాలంగా మనోవేదనకు గురైన నిరంజన్‌కుమార్‌కు షుగర్ వ్యాధి బారిన పడ్డాడు. గురువారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా కింది పోర్షన్‌లో గదిలోకి వెళ్లి సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...

నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌గా గురు శివరామకృష్ణ


గురుశివరామకృష్ణ

హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ (ఇన్‌స్పెక్టర్)గా మోర్ల గురు శివరామకృష్ణ (ఎంజీఏస్‌ఆర్) బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సీపీ సీవీ ఆనంద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలసి చార్జ్ తీసుకున్నారు. 1998వ బ్యాచ్‌కు చెందిన ఆయన సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చేశారు. ఇటీవల నగర వ్యాప్తంగా జరిగిన 96 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఎస్‌బీ నుంచి నారాయణగూడకు బదిలీపై వచ్చారు. దాదాపు 27 రోజుల తర్వాత నారాయణగూడకు ఎంజీఎస్‌ఆర్‌ను ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

ఎమ్మెల్యేకు సమస్యల ఏకరువు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 2లోని ఇందిరానగర్ నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు రమేష్ కొడిచెర్ల, ఉపాధ్యక్షుడు సింగిడాల రూపేష్, కార్యదర్శి కానుల రామేష్, కోశాధికారి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రహిత జీవనశైలిపై అవగాహన నడక



బంజారాహిల్స్: జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం కార్మికులు శుక్రవారం ఫిలింనగర్‌లో పర్యావరణ రహిత జీవన శైలిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్యూస్, రీ యూజ్, రీ సైకిల్ అనే థీమ్‌తో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన నడక నిర్వహించారు. మేరి లైఫ్–మేరా స్వచ్ఛ షహర్ పేరుతో ఈ బ్యానర్లు ఏర్పాటు చేసి స్థానికులకు పర్యావరణంపై అవగాహన కలిగించారు. సేవ్ ఎనర్జీ, సేవ్ వాటర్, నో ప్లాస్టిక్, రెడ్యూస్ వేస్ట్, రెడ్యూస్ ఈ వేస్ట్ ప్లకార్డులను కూడా ప్రదర్శించారు. వీరితో పాటు స్థానికులు ర్యాలీలో పాల్గొన్నారు. శానిటేషన్ డీఈ శివానంద్, సూపర్‌వైజర్లు శానప్ప, కృష్ణ, మహేందర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



వెంగళరావునగర్: రహమత్‌నగర్ చౌరస్తాలో వర్తక సంఘం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య అన్నదాన్ని ప్రారంభించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు విజయ్‌కుమార్, శ్యాంరావు, వేణు, పూజారి బాల్‌రాజ్, సత్యనారాయణ, కృష్ణమూర్తి గుప్తా, నటరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

సంస్కృతిపై అవగాహనకు రూట్‌మార్చ్

ఖైరతాబాద్: మహిళల్లో దేశ, ధర్మ, సంస్కృతి పట్ల నిష్ఠను పెంచుతూ రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఖైరతాబాద్‌లోని సరస్వతి విద్యామందిర్ పాఠశాల నుంచి మహిళలు, విద్యార్థులతో రూట్ మార్చ్ నిర్వహించారు. రూట్ మార్చ్ ఖైరతాబాద్ నుంచి ఐమాక్స్ మీదుగా సరస్వతి విద్యామందిర్ వరకు సాగింది. రాష్ట్ర సేవికా సమితి అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్‌తోపాటు పెద్ద ఎత్తున విద్యార్థినులు పాల్గొన్నారు.

తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

వెంగళరావునగర్: జవహర్‌నగర్‌లో నెలకొన్న తాగునీరు, మురుగు నీటి సమస్యలను పరిష్కరించాని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జింకా ఆలీస్ తెలిపారు. శుక్రవారం జలమండలి అధికారులకు సమాచారం అందించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... ప్రతి ఏడాది వానలు వచ్చే సమయంలో మురుగునీరు రోడ్లపై పారుతుంటుందన్నారు. ఇప్పుడు ఎండాకాలంలో కూడా ప్రవహిస్తుందని అన్నారు. కొంతకాలంగా మంచినీటి పైప్‌లైన్ల గుండా మురుగునీరు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నీటిని తాగితే రోగాల బారిన పడాల్సి వస్తుందన్నారు. తక్షణమే చర్చి గల్లీలో ఉన్న ఈ సమస్యలను జలమండలి అధికారులు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యను స్థానిక కార్పొరేటర్‌తో పాటుగా ఎమ్మెల్యే మాగంటి దృష్టికి తీసుకెళుతున్నట్లు పేర్కొన్నారు.

ముమ్మరంగా ఓటర్ల గుర్తింపు ప్రక్రియ

- ఒకే ఇంట్లో ఎక్కువ ఓట్లు ఉంటే తనిఖీలు
- మరణించిన వారి పేర్లను తొలగిస్తున్న అధికారులు
- కొత్తగా పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు చర్యలు


ఫిలింనగర్ వినాయకనగర్ బస్తీలో సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

బంజారాహిల్స్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఓటర్ల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నది. ఒకే ఇంట్లో ఆరుకంటే ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్న బీఎల్‌వోలు ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. జాబితా ప్రకారం ఓట్లను పరిశీలించి ఇంటి నెంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఒకే ఫొటోతో మరెక్కడైనా ఓటు ఉన్నట్లయితే ఒక చోట తొలగించేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నారు.

- క్షేత్ర స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఏఆర్‌వోలు సమావేశాలు ఏర్పాటుచేసి ఫిర్యాదులు స్వీకరించి వాటిని పరిశీలిస్తున్నారు.
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2,79,497 మంది ఓటర్లు ఉండగా ఇందులో 1,45,951 పురుషులు, 1,33,532 మహిళలు, 18 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు.
- 245 పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రస్తుతం బీఎల్‌వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలు తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియలోనే ఇంటి నెంబర్లు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నారు.
- ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాట్లు కూడా చర్యలు తీసుకున్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే వాటిని గుర్తిస్తున్నారు.
- ఎన్నికల నియమావళి ప్రకారం నియోజకవర్గంలో కొత్త భవనాలు, నిర్మాణం పూర్తి చేసుకున్న భవనాలు పోలింగ్ కేంద్రంలో మార్చేందుకు సంబంధిత అధికారులను సిఫారసు కూడా చేస్తున్నారు. ఇంకోవైపు ఓటరు జాబితా సవరణపై చర్యలు తీసుకుంటున్నారు.
- ఈ సందర్భంగా మరణించిన ఓటర్ల పేర్లను కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి తొలగిస్తున్నారు. ఈ విషయంపై రాజకీయ పార్టీల నుంచి ఫిర్యాదులు వస్తే పరిశీలిస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిన (పోలింగ్ బూత్ మారిన) ఓటర్లు ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు.
- కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ కూడా చేపడుతున్నారు అక్కడికక్కడే వారి పేర్లను నమోదుచేయడమే కాకుండా ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేసుకోవాలో అవగాహన కలిగిస్తున్నారు.

వృద్ధులు.. ఆదర్శవంతులు

శరీరదానాలు చేసేందుకు ముందుకొచ్చిన ఏడుగురు వృద్ధులు


మీనా ముత్తా


లలిత్ కుమార్ ముత్తా


బాలచంద్ సంచేతి


సుశీలా సంచేతి


సంతోష్ బెన్


ముత్తా ఉదయ్ చంద్

బంజారాహిల్స్: తమ మరణం తర్వాత శరీరాలు కాలిబూడిదై మట్టిలో కలిసిపోకుండా భావితరాల భవిష్యత్ వైద్య ప్రయోగాలకు ఉపయోగపడాలనే మహోన్నతాశయంతో అవసాన దశలో ఉండి కూడా సామాజిక ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం ఆ వృద్ధులను సంఘంలో భేష్ అనేలా చేస్తున్నది. ఇందులో కొంత మంది మెహిదీపట్నంలోని జైన్ సేవాశ్రమం వృద్ధాశ్రమంలో ఆవాసం ఏర్పర్చుకోగా మరికొందరు తమ ఇళ్లల్లో వృద్ధాప్యాన్ని నెట్టుకొస్తున్నారు. వీరంతా తీసుకున్న నిర్ణయం సమాజానికి ఎంతగానో ఉపయోగపడేలా చేయడమే కాకుండా మిగతావారికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నది. తాము మరణించిన తర్వాత శరీరాలను బూడిద చేయవద్దని ఏదైనా మెడికల్ కాలేజీకి అందజేయడం ద్వారా విద్యార్థుల వైద్య ప్రయోగాలకు ఉపయోగించేలా చూడాలని బతికుండగానే దరఖాస్తులను అందజేశారు. ఒకేసారి ఏడుగురు వృద్ధులు ఈ నిర్ణయాన్ని తీసుకొని ఔరా అనిపించారు. నగరానికి చెందిన అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘానికి వీరంతా తమ దరఖాస్తులను అందించారు. కాటికి కాలుచాపిన తరుణంలో వీరంతా ఈ నిర్ణయానికి వచ్చి తమ దరఖాస్తులను స్వయంగా నిర్వాహకులకు అందజేశారు. ఇందులో మీనా ముత్తా, ఆమె భర్త లలిత్ కుమార్ ముత్తా ఇద్దరూ జైన్ సేవా శ్రమంలో ఉంటున్నారు. భార్యాభర్తలిద్దరూ తీసుకున్న ఈ నిర్ణయం అందరి హర్షామోదాలు పొందేలా చేసింది.

గుంతల రోడ్డుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..


ఫిలింనగర్ రాజరాజేశ్వరి ఆలయం వద్ద మరమ్మతు చేసిన రోడ్డు

బంజారాహిల్స్: పది రోజులుగా నరకయాతన అనే శీర్షికన శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి జలమండలి అధికారులు ఎట్టకేలకు స్పందించారు. రోడ్డుపై గుంతలు పూడ్చి సిమెంటుతో మరమ్మతులు చేయించారు. ఇటీవల ఇక్కడ డ్రెయినేజీ పైప్‌లైన్ పనులు చేపట్టడంతో పాటు మ్యాన్‌హోల్ నిర్మాణ పనులు జరిగాయి. పైపులు, మ్యాన్‌హోల్ మరమ్మతులు పూర్తయిన తర్వాత గుంతలను సంబంధిత కాంట్రాక్టర్ గాలికి వదిలేసి జారుకున్నాడు. అసలే ఇరుకుగా, ఎత్తుగా ఉన్న ఈ రోడ్డులో వాహనాలు స్తంభించిపోతూ తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు జలమండలి పైప్‌లైన్ పనులు సమస్యాత్మకంగా మారడంతో ట్రాఫిక్ పోలీసులు గత పది రోజుల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ట్రాఫిక్ మళ్లింపులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలోనే 'సాక్షి' సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేయడం పట్ల స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్ఫూర్తిప్రదాత పుచ్చలపల్లి సుందరయ్య

వెంగళరావునగర్: కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జూబ్లీహిల్స్ కన్వీనర్ రాపర్తి అశోక్ అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని మధురానగర్‌కాలనీలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ... పుచ్చలపల్లి వ్యవసాయ కార్మికులకు సైతం కార్మిక సంఘాలను ఏర్పాటు చేశారని, కూలీరేట్లు పెంపు కోసం, ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, వెనుకబడిన తరగతులందరినీ ఐక్యం చేసి భూస్వాములకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేసిన నాయకుడని కొనియాడారు. నేటితరం యువత ఆయన అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వి.ప్రసాద్, పుల్లయ్య, కృష్ణ, ముత్తయ్య, కుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


పుచ్చలపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బీజేపీని మరింత బలోపేతం చేయాలి: చింతల


రాజ్‌నగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

బంజారాహిల్స్: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఎంఎస్ మక్తా రాజ్‌నగర్‌లో శుక్రవారం ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. స్థానికులతో మాట్లాడి పలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బూత్ పరిధిలోని బీజేపీ నేతలు, కార్యకర్తలతో మమేకమయ్యారు. వారితో సమావేశమై బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతపై చర్చించారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు తెలియజేసి కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించడం ద్వారా బీజేపీ మరింత బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్ బీజేపీదే అని.. తెలంగాణలో బీజేపీ పవనాలు వీస్తున్నాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు. అందుకే బీజేపీని ఆదరిస్తారని చింతల ధీమా వ్యక్తం చేశారు.

ఖైరతాబాద్ డివిజన్‌లో...

ఖైరతాబాద్: బూత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖైరతాబాద్ డివిజన్‌లో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి పర్యటించారు. రాజ్‌నగర్‌లో గడప గడపకూ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజ్‌నగర్ బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులు వర్ణనాతీతమన్నారు. నాయకులు వీరి సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన ఆరోపించారు.

చిన్నారికి వైద్యం చేయించేందుకు ఎమ్మెల్యే హామీ

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని జ్ఞాని జైల్‌సింగ్ నగర్ బస్తీకి చెందిన రాజు, లక్ష్మమ్మ దంపతుల ఎనిమిదేళ్ల కూతురు లక్కీ గుండె జబ్బు బారిన పడింది. చికిత్సకు రూ. లక్షల్లో ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. పేద కుటుంబానికి చెందిన ఈ దంపతులు తమ కూతురి వైద్య చికిత్స చేయించుకునే పరిస్థితి లేకపోవడంతో స్థానిక నేతల సహకారంతో శుక్రవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిశారు. చిన్నారి గుండెజబ్బుకు సంబంధించి శస్త్ర చికిత్స ఖర్చులు మొత్తం తానే భరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

హైకోర్టు స్టే ఇచ్చినా పనులు ఆపరా: కరాటే కళ్యాణి


మాట్లాడుతున్న కరాటే కళ్యాణి యాదవ్

పంజగుట్ట: ఎన్టీఆర్ రూపంలో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు పనులు నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చినా ప్రభుత్వం పనులు ఆపకుండా అక్కడ 144 సెక్షన్ పెట్టి మరీ వేగవంతంగా చేయించడం ఎంతవరకు సబబని పలు సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిభట్ల కళాపీఠం వ్యవస్థాపకురాలు కరాటే కళ్యాణి యాదవ్, జై శ్రీకృష్ణ జేఏసీ వ్యవస్థాపకులు ప్రభాకర్ యాదవ్, న్యాయవాది చెలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ... గురువారం కోర్టు స్టే ఇచ్చిందని తెలియగానే హైదరాబాద్ నుంచి ఖమ్మంకు విగ్రహాన్ని తరలించారన్నారు. తదుపరి తీర్పు వచ్చేవరకు అక్కడ ఎలాంటి పనులు చేయరాదని హైకోర్టు స్టే ఇచ్చినా పట్టకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడుతూ పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ రూపంలో దేవుడి బొమ్మ పెట్టరాదని ఒక చట్టం చేసేవరకు తమ పోరాటం ఆగదని కరాటే కళ్యాణి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కు ఎన్టీఆర్ మీద అభిమానం ఉంటే ఎన్టీఆర్ విగ్రహం పెట్టుకోవాలని, శ్రీకృష్ణుడి మీద అభిమానం ఉంటే కృష్ణుడి విగ్రహం పెట్టుకోవాలి అన్నారు. అయితే యావత్ హిందూ సమాజాన్ని కించపరిచేలా మానవుని రూపం దేవుడి విగ్రహాన్ని పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దేవుని రూపం నువ్వు చూశావా అని ప్రశ్నిస్తున్న కుహనా మేధావులు వారి ముత్తాతలను చూశారా అని వ్యాఖ్యానించారు. వారికి రూపం ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా వెంటనే పనులు ఆపాలని, విగ్రహాన్ని పూర్తిగా మార్చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దీన్ని దేశ వ్యాప్త ఉద్యమంగా తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో భారత్ యాదవ్ సమితి ప్రతినిధి శ్రీనివాస్ యాదవ్, ఇస్కాన్ ప్రతినిధి కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ కార్డులతో కార్మికులకు ఎన్నో ప్రయోజనాలు

జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని గౌతంనగర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ భవన నిర్మాణ రంగ కార్మికులకు ఈ–శ్రమ్ లేబర్ కార్డులను అందజేశారు. కార్మిక శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్డులు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ... తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ లేబర్ కార్డుకు అర్హులు అన్నారు. ఈ కార్డు వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయని వెల్లడించారు. ప్రతి కార్మికుడికీ లేబర్ కార్డు ఉంటే 18–55 వయసు వారు సహజమరణం చెందితే రూ. 1.30 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. ప్రమాదంలో మరణిస్తే రూ. 2 లక్షల బీమా వర్తిస్తుందని, ఆడ పిల్లల వివాహ ఖర్చులకు రూ. 30 వేలు ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. ప్రసవాలకు రూ. 30 వేలు ఇస్తారని ఆయన వివరించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సమన్వయకర్త బ్రహ్మం, ఫీల్డ్ ఆఫీసర్ సందీప్, షేక్‌పేట్ మండల సమన్వయకర్త మాధవి, స్థానిక నేతలు గని, మారెమ్మ, ఓర్సు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు బీమా తప్పనిసరి

బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు


మాట్లాడుతున్న బేగంపేట టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బంజారాహిల్స్: థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ పాలసీ అనేది బీమా చేసిన వ్యక్తిపై దావా వేయబడిన లేదా మూడో పక్షానికి చెందిన గాయాలు లేదా నష్టాన్ని చట్టబద్ధంగా బాధ్యత వహించాల్సి వస్తే బీమా కంపెనీ అతనిపై నష్టపరిహారం చెల్లించడానికి అంగీకరించే పాలసీ అని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు అన్నారు. పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బజాజ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సోమాజిగూడ కార్యాలయంలో ఏడవ యూఎన్ గ్లోబల్ రోడ్ సేఫ్టీ వీక్‌లో భాగంగా నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, అదనపు కమిషనర్ జి.సుధీర్‌బాబు ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీమా సంస్థ, బీమా చేయబడిన వారు మొదటి, రెండో పక్షాలు, మరణం, గాయాలు, వ్యతిరేకంగా నష్టపరిహారం క్లెయిమ్ చేసే ఇతర వ్యక్తులు మూడో పక్షం కింద వస్తారని తెలిపారు. మోటారు వాహనచట్టం 1988 సెక్షన్ 145(జి) థర్డ్ పార్టీ కింద ప్రభుత్వం ఉంటుందన్నారు. ఈ చట్టం కింద నోఫాల్ట్ లయబిలిటీ లేదా ఫాల్ట్ లయబిలిటీ కింద పరిహారం కోసం క్లెయిమ్ చేసుకోవచ్చన్నారు. అయితే శారీరక గాయం, ప్రాణనష్టానికి మాత్రమే అపరిమిత పరిహారం అందుబాటులో ఉంటుందని ఆస్తికి నష్టం జరిగితే బీమాదారి బాధ్యత గరిష్టంగా పరిమితం చేయబడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగానే రోడ్డు భద్రతపై ఇక్కడి ఉద్యోగులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో బజాజ్ ఫైనాన్స్ అడ్మిన్ టీమ్ చంద్ర శరవరణ్, సాయి షిరిడీ మిశ్రా, వాయినాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

లిబర్టీ: అన్ని రంగాల్లో వెనుకబడి దయనీయ పరిస్థితుల్లో జీవితాలు వెళ్లదీస్తున్న ముదిరాజ్ కులస్తులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి కోరారు. సంప్రదాయ వృత్తిని నమ్ముకుని బతుకుబండి లాగుతున్నారని తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ముదిరాజ్ చైతన్య వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు రూ. 10 వేల కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో ముదిరాజ్‌లు అత్యధికంగా ఉన్నారని వారు వృత్తిని జీవనభృతిగా మార్చుకుని దుర్భర జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. తరతరాలుగా శ్రమను నమ్ముకుని చేపల వృత్తి, పళ్లు అమ్ముకుని జీవనం సాగిస్తున్నారని వారికి ఆర్థికంగా ప్రగతిపథంలో తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.


బండపల్లి చంద్రమ్మ మృతి తీరనిలోటు

జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి


నివాళులర్పిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, భవానీశంకర్ తదితరులు

రహమత్‌నగర్: మాజీ కార్పొరేటర్ దివంగత బండపల్లి చంద్రమ్మ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండేవారని, అమ్మ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు అని జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బండపల్లి చంద్రమ్మ ద్వితీయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం రహమత్‌నగర్‌లో సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ... చంద్రమ్మ రెండు పర్యాయాలు రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్‌గా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారని గుర్తుచేశారు. నాయకులు భవానీశంకర్, లియాకత్‌అలీ, వినోద్‌కుమార్ గౌడ్, ఖదీర్, కృష్ణకుమార్ అశోక్, సుశీల్, గ్యార నాగరాజు, కేశవులు, రాములు, సాయి, ఆండాళు, యాదగిరి, సుందర్, మాలాకీ, హరుణ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

బెల్లంపల్లి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ భవన్ వద్ద ఫ్లెక్సీలు



బంజారాహిల్స్: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై బంజారాహిల్స్‌లోని బీఆర్‌ఎస్ భవన్ వద్ద బ్యానర్లు వెలిశాయి. వివిధ ఆరోపణలతో అరిజన్ డైరీ పేరుతో శుక్రవారం తెల్లవారుజామున పెద్ద ఎత్తున బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పలు మీడియా సంస్థల కార్యాలయాలు, పలు చౌరస్తాల్లో ఈ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మాకు న్యాయం చేయండి అంటూ ముఖ్యమంత్రికి విన్నవించుకునే బ్యానర్లు ఏర్పాటయ్యాయి. బెల్లంపల్లి నియోజకవర్గం అవినీతి నిలయంగా మారిందని భూ బకాసురులు తయారయ్యారని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కమీషన్ తీసుకునే అవినీతి తిమింగళాలు ఎక్కువయ్యాయని ఇందులో ఆరోపించారు. ఎమ్మెల్యే చిన్నయ్య కన్నాల శివారులో గృహ నిర్మాణ నిమిత్తం ఆరిజన డైరీ వద్ద రూ. 30 లక్షలు తీసుకొని దానికి బదులుగా సంస్థకు భూమి ఇస్తానని చెప్పి ప్రభుత్వ భూమిలో భూమి పూజ చేయించి నమ్మించి మోసం చేశారని అందులో ఆరోపించారు. ఇదేమని అడిగితే తప్పుడు కేసులు బనాయించి తమను అడ్డు తొలగించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ ఫ్లెక్సీల్లో స్పష్టం చేశారు. తెల్లవారుజామున ఏర్పాటైన ఈ ఫ్లెక్సీలు కలకలం రేపాయి.

మున్నూరుకాపు భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా పురుషోత్తమరావు

పంజగుట్ట: మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా సర్దార్ పుట్టం పురుషోత్తమరావు నియమితులయ్యారు. ఎర్రమంజిల్‌లోని మున్నూరు కాపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు కేటాయించారని అందులో భాగంగా మున్నూరు కాపులకు కోకాపేటలో 5 ఎకరాల స్థలం, భవన నిర్మాణానికి రూ. 5 కోట్లను మంజూరు చేశారన్నారు. మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డు చైర్మన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో తనను నిర్మాణ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. సభ్యులుగా గంగుల సుధాకర్, మెట్టు శ్రీనివాస్, పూల రవీందర్, గాలి అనీల్ కుమార్, మంగళారపు లక్ష్మణ్, రంజిత్ కుమార్, విష్ణు జగతి, బండి సంజీవ్, ఈసంపల్లి వెంకన్న, బండి పద్మ, గోపాల గణేష్, విజయకుమార్, జయపాల్, రామారావు, హనుమంతరావులను ఎంపిక చేసినట్లు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా మున్నూరు కాపు యువతకు, ప్రతి ఒక్కరికీ ఆమోదయోగ్యంగా ఉండే భవనం నిర్మించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

భర్తతో వెళ్తున్న యువతి పట్ల అసభ్యకర ప్రవర్తన


నిందితుడిపై కేసు నమోదు


నిందితుడు ఉపయోగించిన కారు

బంజారాహిల్స్: భర్తతో కలిసి వెళ్తున్న యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై బంజారాహిల్స్ పీఎస్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. వివరాలివీ... కాప్రాకు చెందిన యువతి(33) ఈ నెల 14న మధ్యాహ్నం 2.15 సమయంలో తన భర్తతో కలిసి బంజారాహిల్స్ రోడ్ నెం–2 మీదుగా నాగార్జున సర్కిల్‌వైపు వెళ్తోంది. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఏపీ 39 జేడీ 9999 (స్కోడా) కారు నడిపిస్తున్న రిష్వంత్ ఎల్లూరి పల్లి అనే యువకుడు ఆమెను అడ్డగించాడు. అసభ్యకరమైన సైగలతో కారును వెంబడించడంతో పాటు దూషణలకు దిగాడు. కారులోంచి క్రికెట్ బ్యాట్ చూపిస్తూ దాడి చేస్తానని బెదిరించాడు. రిష్వంత్ అసభ్య ప్రవర్తనను తన భర్త వీడియో తీశాడు. ఇవే దృశ్యాలు తాను సోషల్ మీడియాలో పెట్టిన బాధిత యువతికి నిందితుడు బెదిరింపు సందేశాలు పంపించాడు. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడు రిష్వంత్‌పై పోలీసులు ఐపీసీ 341, 509, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెమలీకల టోపీ ధరించి కోలాహలంగా ఆడతారు.
రేలా... రే... రేలా అంటూ గొంతు కలిపి పాడతారు.
ప్రకృతి గురువు నేర్పిన పాఠాలకు ఆనవాళ్లు వారు.
మొన్నటి వరకు అడవి తల్లి ఒడిలో దాగిన కళారూపాలివన్నీ.
నేడవి అడవి గోడలు దాటి నగరాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి.
దేశం ఎల్లలు కూడా దాటే వరకు గుస్సాడి ఆడాలంటున్నారు...
పద్మశ్రీ కనకరాజు.





గుస్సాడి గుండెచప్పుడు

పద్మశ్రీ కనకరాజు

కనకరాజు పేరులో ఇంటి పేరు కనక, ఆయన పేరు రాజు. ఇన్ని వివరాలు మాకక్కర్లేదు, గుస్సాడి నృత్యం చేస్తాడు, మా అందరి చేత అడుగు వేయిస్తాడు కాబట్టి ఆయన మాకు 'గుస్సాడి రాజు' అంటారు స్థానికులు. ఆయన పద్మశ్రీ అందుకున్నప్పటి నుంచి నాగరక ప్రపంచం ఆయన మీద దృష్టి కేంద్రీకరించింది. కనక రాజు అని ఇంటిపేరుతో కలిసి వ్యవహారంలోకి వచ్చారు. అయినప్పటికీ వారి గూడేలకు వెళ్లి కనకరాజు అని అడిగితే వెంటనే గుర్తుపట్టరు. గుస్సాడి కనకరాజు అంటే టక్కున చెప్పేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మర్లవాయి ఆయన ఊరు. ప్రస్తుతం కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, అంతేకాదు, కుమ్రుం భీమ్ వారసులు కూడా. ఆదిలాబాద్‌లో విస్తరించిన గోండ్ తెగకు చెందిన వాళ్లందరూ భీమ్ వారసులుగా గర్వంగా భావిస్తారు. ఎనభై ఏళ్ల కనకరాజు... తండ్రి చెప్పిన మాట కోసం గుస్సాడి నృత్యం పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేశారు. గుస్సాడితో మమేకమైన తన జీవితానుభవాలను సాక్షితో పంచుకున్నారాయన.

ఆట... పాట... జీవితం!

''మా ఆదివాసీల జీవనంలో ప్రకృతి, నృత్యం, గానం కలగలిసి పోయి ఉంటాయి. బిడ్డ పుడితే పాట, పెళ్లి వేడుకకీ పాట, అంతే కాదు... మనిషి పోయినా పాట రూపంలో ఆ వ్యక్తితో మా అనుబంధాన్ని గుర్తు చేసుకుంటాం. దండారీ ఉత్సవాలంటే మాకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేస్తుంది. మగపిల్లలకు నృత్యం, ఆడపిల్లలకు రేలా పాట చిన్నప్పటి నుంచే నేర్పిస్తాం. గుస్సాడి నృత్యంలో అడుగులు వేయడం ఎప్పుడు మొదలైందో నాకు గుర్తు లేదు. కానీ మా నాన్న ఒక మాట చెప్పేవారు. 'ఈ నృత్యమే మనకు దైవం. 'ఈ నృత్యాన్ని మరువద్దు. తరతరాలుగా మోసుకొస్తున్నాం. దీన్ని కాపాడుకుంటేనే దేవుడు మనల్ని కాపాడుతాడు' అని చెప్పేవాడు. ఆ మాట నాలో నాటుకుపోయింది. నాకు వయసొచ్చినప్పటి నుంచి నృత్యంలో తొలి ఆటగాడిగా అడుగులు వేస్తుండేవాణ్ని. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసించే రెండువేల గూడేలకూ నేను తెలిసిపోయాను.

గణతంత్ర వేడుక

గణతంత్ర వేడుకల్లో మా ప్రాచీన వారసత్వ కళ అయిన గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం నాకు 1982లో వచ్చింది. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మా గుస్సాడి టోపీ పెట్టించి, గజ్జెలు కట్టించాం. ఆమె మాతో అడుగులు వేసింది. ఆ తర్వాత ఓసారి అబ్దుల్ కలామ్ కూడా మాతో అడుగులు వేశారు. హైదరాబాద్‌లో ఎన్ని ప్రదర్శనలిచ్చామో లెక్కే లేదు. ఢిల్లీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో కూడా మా గుస్సాడిని ప్రదర్శించాం. మరో పది దఫాలు యువతతో చేయించాం. నాయన మాట మీద గుస్సాడి కోసం బతికినందుకే మా దేవుడు మెచ్చి గొప్ప వాళ్ల కిచ్చే పద్మశ్రీని ఇప్పించాడనుకుంటున్నా.



2021లో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ...



సంప్రదాయ వస్త్రధారణలో గుస్సాడి కనకరాజు

నెమలీకల టోపీ

మా నృత్యం సాధన చేయడమే కాదు, టోపీ, దుస్తులు, గజ్జెలు అన్నీ ప్రత్యేకమే. వాటిని తయారు చేయడానికి చాలా నైపుణ్యం ఉండాలి. పెద్ద టోపీకి రెండు వేల పింఛాలుంటాయి. మా ఇళ్లలో వాటిని భద్రపరుచుకోవడం పెద్ద పని. మా ముత్తాతలు ధరించిన టోపీ ఇంకా నేను ధరిస్తూనే ఉన్నాను. కొత్తవాళ్ల కోసం టోపీలు తయారు చేస్తున్నాం. పెద్ద టోపీ, దుస్తులతోపాటు మొత్తం వేషానికి ఇరవై వేల రూపాయలవుతాయి. మా ఆదివాసీ వ్యక్తి తుకారామ్ సాబ్ కలెక్టర్ అయిన తరవాత ఈ నృత్యానికి ఇంకా కొన్ని చేర్పులు చేసి బాగా మంచిగా చేశారు. పద్మశ్రీ వచ్చిన తర్వాత ఐటీడీఏ ఆఫీసర్‌లు గుస్సాడి నృత్యం నేర్పించడానికి వందకు పైగా బడులు పెట్టారు. ఒక్కో బడిలో రెండు-మూడు వందల మంది నేర్చుకుంటున్నారు. నేను పెద్ద మాస్టర్ (చీఫ్ డాన్స్ మాస్టర్)ని. గుస్సాడి, రేలా పాట నేర్పించడానికి 30 మందిని ప్రత్యేకంగా తయారు చేశాను. మరో రెండు వందల మందికి సంపూర్ణంగా శిక్షణనిచ్చాను. ఇంక మామూలుగా నేర్చుకుని ఆడే వాళ్లు ఎన్ని వేల మంది ఉన్నారో నేను ఎప్పుడూ లెక్క చెప్పుకోలేదు.

అడవి తల్లికి అందరూ ఒక్కటే!

మా ఆదివాసీల్లో మగపిల్లాడు ఎక్కువ, ఆడపిల్ల తక్కువనే ఆలోచనే ఉండదు. బిడ్డలంతా సమమే. పెళ్లిలో కట్నకానుకలు ఉండవు. ఆడబిడ్డ పుట్టిందని చింతపడడం మాకు తెలియదు. నాకు ఎనిమిది మంది కూతుళ్లు, ముగ్గురు కొడుకులు. బతకడానికి ఆశ్రమ పాఠశాలలో రోజు కూలీగా పని చేస్తూ కూడా అందరికీ చదువు చెప్పించాను. తొమ్మిది- పది తరగతుల వరకు అందరూ చదువుకున్నారు. రెండో కొడుకు వెంకటేశ్ మాత్రం డిగ్రీ చదివి టీచర్ ఉద్యోగం చేస్తున్నాడు. తరతరాలుగా అడవులకే పరిమితమైపోయిన గుస్సాడి నృత్యాన్ని నేను దేశానికి తెలియ చెప్పాను. మీరు మన ఆట, పాటలను ఇతర దేశాలకు తీసుకెళ్లాలని నా పిల్లలు, శిష్యులకు చెబుతున్నాను'' అని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు గుస్సాడి కనకరాజు.

– వాకా మంజులారెడ్డి

సందర్భం

స్కూల్ రోజుల్లో నియతికి లెక్కలు అంటే లెక్కలేనంత భయం.
ఇప్పుడు ఆమెకు వ్యాపార లెక్కలు కొట్టిన పిండి.
అప్పట్లో సైన్స్ సబ్జెక్ట్ పేరు వినబడగానే ముఖం తిప్పుకునేది చిన్నారి నియతి.
ఇప్పుడు ఆమెకు వంటల శాస్త్రం లోతుపాతులు బాగా తెలుసు.
చిన్న వయసులోనే 'స్టార్ చెఫ్'గా పేరు తెచ్చుకున్న
ముంబైకి చెందిన **నియతిరావు** 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా–2023'
జాబితాలో చోటు సంపాదించింది...

సాహోరే స్టార్ చెఫ్



నియతిరావు

చిన్నప్పుడు నియతిరావు బడి అంటే భయపడేది. లెక్కలు, సైన్స్ అంటే చాలు ఆమెకు వణుకు వచ్చేది. అలాంటి నియతికి అమ్మ, అమ్మమ్మలు చేసే వంటలు అంటే ఇష్టం. వాళ్లు వంటలు చేస్తుంటే ఆసక్తిగా గమనించేది.

తల్లి గుజరాతీ. తండ్రి దక్షిణ భారతం. దీంతో అటు వంటకాలు ఇటు, ఇటు వంటకాలు అటూ వెళ్లేవి. వంటలను అమితంగా ప్రేమించే ఆ ఇంట్లో ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా ఎన్నో వంటకాలు చవులూరించేవి. 'తినరా మైమరిచి' అని ఆప్యాయంగా పిలుస్తుండేవి.

'అదృష్టాన్ని నమ్ముకోకుండా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోండి, అద్భుత ఫలితాన్ని సొంతం చేసుకోండి' అనే మాటను ఎన్నోసార్లు విన్న నియతి తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని చెఫ్‌గా మారింది.

కోపెన్‌హెగన్(డెన్మార్క్)లో వరల్డ్ ఫేమస్ రెస్టారెంట్ నోమాలో ఇంటర్న్‌షిప్ తరువాత తిరిగి ముంబైకి వచ్చింది.

'ఇప్పుడు ఏ వ్యాపారమైనా రిస్క్' అనుకునే సమయం అది.

నేను తెలుసుకున్న సత్యం





వంటకం అంటే ఆకలి తీర్చుకోవడం. రుచులను ఆస్వాదించడానికే పరిమితమైనది కాదు. అది మన సంస్కృతి. మనం పరస్పరం ఇచ్చుకునే గౌరవం. తరం నుంచి తరానికి మధ్య కదిలే జ్ఞాపకం. గత దశాబ్ద కాలంలో నేను నేర్చుకున్న ఏకైక విషయం... మన భారతీయ వంటకాలు ఎంతో గొప్పవి అని. వాటికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది అని. మన వంటకాలలో ఉపయోగించే దినుసులపై ప్రత్యేకంగా దృష్టి పెడితే ఎన్నో కాంబినేషన్‌లు, టెక్నిక్స్ గురించి తెలుసుకోవచ్చు, కొత్త రుచులను ఆస్వాదించవచ్చు.

– నియతిరావు

అలాంటి సమయంలో 'ఎక్కా' రెస్టారెంట్ ప్రారంభించడానికి రెడీ అయింది. ప్రాజెక్ట్ పట్టాలెక్కుతున్న సమయంలో ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేశారు.

'కొన్ని సమయాల్లో డబ్బు కంటే మన మీద మనకు నమ్మకం చాలా అవసరం' అంటున్న నియతి ఆరోజు ధైర్యాన్ని కోల్పోయి ఉంటే, 'ఇక చేసేదేమీ లేదు' అనే నిర్లిప్తతకు గురై ఉంటే 'స్టార్ చెఫ్'గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

కొత్త ఇన్వెస్టర్‌లను ఒప్పించడానికి ఎంత కష్టపడిందో తెలియదుగానీ మొత్తానికైతే 'ఎక్కా' రెస్టారెంట్ కలను సాకారం చేసుకుంది.

పద్నాలుగు నెలల వ్యవధిలోనే 'ఎక్కా' ఆసియాలోని అత్యుత్తమ రెస్టారెంట్‌ల జాబితాలో చోటు సంపాదించింది.

ఈ ఘన విజయానికి కారణం ఏమిటి?

'మెనూ చూడగానే నోరూరడం మాత్రమే కాదు, పాత జ్ఞాపకాలు మదిలో నిండి పోవాలి. ఆ రోజుల్లో మా అమ్మ ఈ వంటకాన్ని అలా చేసేది. ఎంత బాగుండేదో కదా!... ఇలాంటి జ్ఞాపకాలెన్నో దృశ్యాలై కళ్లముందు నిలవాలి' అంటున్న నియతి తన రెస్టారెంట్‌ను ఆషామాషీగా ప్రారంభించలేదు.

ఎంతో గ్రౌండ్ వర్క్ చేసింది.

ఎన్నోచోట్ల సర్వే చేసి కస్టమర్‌ల అభిప్రాయాలను, అభిరుచులను తెలుసుకుంది.

ఏ రెస్టారెంట్ ఎందుకు సక్సెస్ అయింది? ఎందుకు అట్టర్ ఫ్లాప్ అయింది? తెలుసుకోవడానికి కేస్‌స్టడీ చేసింది.

వాటన్నిటినీ ఒక దగ్గర జోడించి, దానికి రుచి జత చేసి పక్కా ప్లాన్‌తో 'ఎక్కా' మొదలుపెట్టింది.

'నేను నేర్చుకున్నాను' అనేవారు ఒక రకం.

'నేను నేర్చుకుంటూనే ఉంటాను' అనేవారు రెండో రకం.

నియతి రెండో రకం.

'భారతీయ వంటకాలలో ఉపయోగించే దినుసులు వేటికవే ప్రత్యేకమైనవి. వాటి ఘుమఘుమలు మరో లోకంలోకి తీసుకువెళతాయి' అంటున్న నియతి దినుసులతో కొత్త ప్రయోగాలు చేస్తూ, కొత్త రుచులను పరిచయం చేస్తుంటుంది.

'ఎక్కా' నిర్వహిస్తున్న బిల్డింగ్‌లోనే 'కేయంసీ' అనే కమ్యూనిటీ స్పేస్‌ను లాంచ్ చేసింది నియతి. 'కేయంసీ' అనేది సృజనాత్మక వంటల ఎగ్జిబిషన్. వాటి గురించి వివరంగా మాట్లాడుకునే చర్చా వేదిక.

'నియతి భవిష్యత్ దార్శనికురాలు. నిత్యప్రయోగశీలి. తన చురుకుదనంతో టీమ్ మెంబర్స్‌లో ఉత్సాహం నింపుతుంది. ప్రతిభ, నాయకత్వ సామర్థ్యం ఉన్న నియతి చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది' అంటున్నారు 'ఎక్కా' ఫస్ట్ ఇన్వెస్టర్ శిల్ప లక్ష్మీనారాయణ్.

'రెస్టారెంట్ అంటే రుచుల సమ్మేళనం మాత్రమే కాదు దానికి సామాజిక బాధ్యత కూడా ఉంది' అంటున్న 28 సంవత్సరాల నియతిరావు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

కొత్త దారి

ఆ కట్టుబడికి తరించేను గుర్రపుడెక్క జన్మ!

'గుర్రపు డెక్కతో సమస్యలు ఇన్నిన్ని కాదయా' అనే విషయం మనకు తెలియనిదేమీ కాదు. నీటివనరుల పాలిట శత్రువుగా పరిగణించే గుర్రపు డెక్క నుంచి అందమైన చీరలు తయారు చేస్తూ 'ఆహా' అనిపిస్తున్నాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ గౌరవ్ ఆనంద్...


25 కిలోల గుర్రపు డెక్క నుంచి ఒక ఫ్యూజన్ చీర తయారు చేయవచ్చు.

జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన గౌరవ్ ఆనంద్ టాటా స్టీల్‌లో పనిచేస్తున్న రోజుల్లో నదుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ సమయంలో నదులలో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క అతడి దృష్టిలో పడేది.

'దరిద్రపు మొక్కలు' అని దాన్ని గురించి ప్రజలు తిట్టుకోవడాన్ని ఎన్నోసార్లు విన్నాడు.

'క్లీన్ రివర్ గంగా' మిషన్‌లో పాల్గొన్న తరువాత ప్రతివారం ఎక్కడో ఒకచోట నదులు, కాలువలు, చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనేవాడు.

'నది లేదా చెరువులు, కాలువలను ఒకసారి గుర్తు తెచ్చుకుంటే నీళ్లు కాదు గుర్రపుడెక్క మాత్రమే కళ్ల ముందుకు వచ్చేది' అంటాడు గౌరవ్.





గుర్రపు డెక్క నుంచి తయారైన చీర ధరించిన మహిళ

జలవనరుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా పాల్గొనడానికి కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి 'స్వచ్ఛత' అనే ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టాడు గౌరవ్. ఒకవైపు పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు గుర్రపు డెక్కపై ప్రయోగాలు చేసేవాడు.

మొదట్లో...

గుర్రపు డెక్కను ఉపయోగించి ల్యాంప్ షేడ్స్, పేపర్లు, నోట్‌బుక్‌లు, మ్యాట్‌లు... మొదలైనవి తయారు చేసేవాడు. ఆ సమయంలో 'ఇంకా ఏం చేయలేమా?' అని మేధోమథనం చేస్తున్న క్రమంలో పుట్టిన ఆలోచనే... గుర్రపు డెక్క నుంచి చీర. ఇలాంటి చీర ప్రపంచంలోనే మొదటిది. అయితే 'గుర్రపు డెక్క నుంచి చీరె' అనేది అంత సులువైన పని కాదు. ఎంతో ఓపిక ఉండాలి.

కాండాలను వారం రోజులపాటు ఎండ బెట్టడం, హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ద్వారా గుజ్జు నుంచి క్రిములను తొలగించడం, ఆ తరువాత దారం తయారు చేయడం పెద్ద పనే. అయితే గౌరవ్ ఎక్కడా డీలా పడలేదు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం అలవాటు చేసుకున్నాడు.

ఈ ఏడాది చివరికల్లా 1000 చీరెలను తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు గౌరవ్.

పనికిరాని గుర్రపు డెక్క నుంచి అందమైన చీరెలను తయారు చేయడం ఒక కోణం అయితే గుర్రపు డెక్కను సేకరించి అమ్ముకోవడం ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందడం అనేది మరో కోణం.

నలభై ఏడు సంవత్సరాల రమ్యకు భర్త చనిపోయాడు. ఆమె ఒక పొగాకు ఫ్యాక్టరీలో తక్కువ జీతానికి పనిచేసేది. ఆరోగ్యం దెబ్బ తినడంతో ఉద్యోగం మానేసింది. గుర్రపు డెక్క సేకరణ ద్వారా రమ్య ఉపాధి పొందుతోంది.

'రోజుకు రెండు నుంచి మూడు గంటలు కష్టపడితే చాలు' అంటుంది రమ్య.

ప్రస్తుతం జంషెడ్‌పూర్ (జార్ఖండ్), ఖరగ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఈ చీరెలను అమ్ముతున్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ధరలు నిర్ణయించారు.

'చీరెల ద్వారా లాభాలు గడించాలనేది నా లక్ష్యం కాదు. చేనేత కార్మికుల ఆర్థిక స్థాయి మెరుగు పడాలనేది నా కోరిక' అంటున్నాడు గౌరవ్ ఆనంద్.

'చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పుడు అంతూపొంతూ లేని గుర్రపు డెక్కను చూసి బాగా కోపం వచ్చేది. తిట్టుకునేదాన్ని కూడా. ఇప్పుడు అది అపురూపంగా కనిపిస్తోంది. ఉపయోగించుకుంటే ఏదైనా ఉపయోగమే' అంటుంది పర్యావరణ కార్యకర్త నళిని.

ఇప్పుడు తన ఫేవరెట్ చీర... గుర్రపు డెక్క నుంచి తయారుచేసిన ఫ్యూజన్ చీర!

✻ న్యూ బిజినెస్

ఫేస్ యోగా విత్ ఆయిల్స్



బ్యూటీ ప్రాడక్ట్స్‌తో అరోరా

తనకు వచ్చిన కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోలేదు విభూతి అరోరా. నిరాశగా అనిపించే రోజులనే అవకాశాలుగా మార్చుకొని నేడు సౌందర్య ఉత్పత్తుల వ్యాపారంలో అగ్రగామిగా నిలిచింది. దానికి ముందు అనుభవించిన శారీరక, మానసిక బాధ దానిని ఎదుర్కొన్న పరిణామాలను వివరిస్తుంది ఈ గురుగ్రామ్ వాసి.

''నాకు పాతికేళ్ల వయసులో చర్మానికి సంబంధించిన 'లూపస్' అనే ఆటో ఇమ్యూన్ సమస్య వచ్చింది. ముఖం అంతా దద్దుర్లు వచ్చాయి. చర్మం పగిలి రక్తం కారుతుండేది. ఈ పరిస్థితి ఎంత భయంకరంగా ఉండేదంటే నా రూమ్ దాటి బయటకు వచ్చేదాన్నే కాదు. నా ముఖం ఎవరూ చూడకూడదని లోపలే ఉండిపోయేదాన్ని. రోజంతా ఏడుస్తూ నిద్రపోయేదాన్ని. ఎవరిలోనూ కలవకపోవడం వల్ల నా బంధుమిత్రులకు వ్యతిరేకిని కూడా అయ్యాను. కొన్ని రోజులకు ఒంటరితనంతో నాకు పిచ్చిపడుతుందేమో అనిపించేది.

పెళ్ళిని వదిలేసి..

ఇంతలో మా ఫ్రెండ్ పెళ్లికి రమ్మని ఆహ్వాన పత్రిక వచ్చింది. చాలా సంతోషం అనిపించింది నా స్నేహితులందరినీ కలవచ్చని. ఒక రోజు ముందే ఆ పెళ్లికి వెళ్లాను. డాక్టర్ చెప్పిన మందులను ఆ రాత్రి వేసుకున్నాను. మొత్తం రియాక్షన్ వచ్చింది. ముఖంతో పాటు శరీరం అంతా దద్దుర్లు. దీంతో పెళ్లిలో ఎవరినీ కలవకుండానే ఇంటికి తిరిగివచ్చేశాను. మళ్లీ డాక్టర్ని కలిశాను కానీ, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

అమ్మమ్మ చిట్కాతో...

ఏం తింటున్నాను, ఏం షాంపూ, ఫేస్ వాష్ ఏది వాడుతున్నాను అనేవి మళ్లీ మళ్లీ చెక్ చేసుకున్నాను. ఎందువల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందో నాకు అర్థం కాలేదు. చాలామంది వైద్యులను సంప్రదించాను. కానీ, నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఒకరోజు మా అమ్మమ్మ సూచించిన ఇంటి చిట్కాను ఉపయోగించడం మొదలుపెట్టాను. దేశీ నెయ్యితో ముఖానికి మసాజ్ చేయడం ప్రారంభించాను. దాంతోపాటు కొద్దిగా ఫేస్ యోగా చేయడం మొదలుపెట్టాను. మెల్ల మెల్లగా ఆ ప్రభావం నాకు తెలిసి వచ్చింది. దాదాపు పదేళ్లుగా పోరాడుతున్న సమస్యకు ఉపశమనం లభించింది.

కొత్త ఉత్పత్తి

దేశీ ఆవు నెయ్యి నాకు అమోఘంగా పని చేసింది. దీంతోపాటు ఫేస్ యోగాతో నా చర్మ సమస్యకు పరిష్కారం లభించింది. అంతే, ఇక నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆయుర్వేద నూనెలు, ఫేస్ యోగాతో అనుసంధానిస్తూ ఒక కొత్త ఉత్పత్తిని తయారు చేయడం మొదలుపెట్టాను. అలా, నాలుగేళ్ల క్రితం 'హౌస్ ఆఫ్ బ్యూటీ' మొదలైంది.

సెల్ఫ్ డిజైన్ ఫేస్ యోగా

రుగ్వేదంలో ముఖానికి 8 యోగాసనాలు ఉన్నాయి. నాకు అనారోగ్యం వచ్చినప్పుడు దాదాపు 80 ముఖ యోగా భంగిమలు చేశాను. దీంతో తేలికపాటి మచ్చలు కూడా తగ్గిపోయాయి. దాని ప్రభావం నా ముఖంపై కనిపించినప్పుడు మా కుటుంబ సభ్యులు, స్నేహితులు అడగడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మాకు కూడా ఫేస్ యోగాను నేర్పించండి అని తెలిసినవారు అడుగుతుండేవారు. దీంతో ముఖం కోసం 80 యోగాసనాలతో కూడిన కోర్సును డిజైన్ చేసి, ఉత్పత్తులతో సహా మార్కెట్‌లోకి విడుదల చేశాను. మొదట జనం దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, వాడి, ఆ ఫలితాన్ని అనుభవించిన వాళ్లు నా క్లాస్‌కి రావడం, వాళ్ల ద్వారా మరికొంతమంది చేరడం మొదలుపెట్టారు. మెల్ల మెల్లగా ఫేస్‌యోగా ప్రజాదరణ పొందింది.

సౌందర్య ఉత్పత్తులు

దేశీనెయ్యి, బాదం నూనెతో మసాజ్ ఆయిల్స్ తయారు చేశాను. రసాయనాలు లేని, అన్ని రకాల చర్మ తత్వాలకు సరిపోయే వివిధ సౌందర్య ఉత్పత్తులను తయారు చేశాను. ఏ రసాయనాలు లేని ఉత్పత్తులు వాడటం వల్ల ఎలాంటి చర్మ సమస్యలూ తలెత్తవు. అయితే, అది అంత తేలికైన పనికాదని కొన్ని రోజులకే అర్థమైంది. ఇప్పటికే ఎన్నో బ్యూటీప్రాడక్ట్స్ మార్కెట్‌ని ఏలుతున్నాయి. నా సొంత ఆలోచనతో పనిచేయడానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. రసాయన రహిత ఉత్పత్తుల షెల్ఫ్ కాలం రెండేళ్లు మాత్రమే ఉంటుంది. కాబట్టి, అమ్మడం కష్టంగా ఉండేది. బ్యూటీప్రాడక్ట్స్ మార్కెట్ చేసే వాళ్లు నా ప్రాడక్ట్స్‌ని తీసుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో నా వ్యాపారానికి చాలా ప్రతిబంధకాలు ఉన్నాయని అని అర్థమైంది.



ఫేస్ మసాజ్



ఫేస్ యోగా చేస్తూ...

ఫేస్‌యోగా విత్ బ్యూటీ ప్రాడక్ట్

కానీ, నేడు అలియాభట్, మలైకా అరోరా వంటి సెలబ్రిటీలు నా ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వాళ్లు నా ఫేస్ మసాజ్ టూల్‌తో మా ప్రాడక్ట్స్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో చాలా విజయం సాధించాను అనిపించింది. ఇది నాకు ఉచితంగా లభించిన ప్రమోషన్. దీంతో నా ఉత్పత్తులకు మరింత ప్రజాదరణ లభించింది. నాలుగేళ్లలోనే నా ప్రాడక్ట్స్ సెలబ్రిటీలు ఉపయోగించే దశకు చేరుకుంది. దీంతో నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడి నాకు నేనుగా నిలదొక్కుకోవడానికి చేసిన కృషిలో మా కుటుంబ విజయం కూడా దాగుంది' అని వివరిస్తుంది అరోరా.

సాక్షి రియల్టీ
శనివారం
20-5-2023

111 జీవో రద్దు ఫలాలు ఎవరికి?

- లగ్జరీ గృహ అమ్మకాలపై ప్రత్యక్ష ప్రభావం
- డోలాయమానంలో పశ్చిమ హైదరాబాద్‌లోని ప్రాజెక్ట్‌లు
- ధరలు తగ్గుతాయనే భావనలో కొనుగోలుదారులు
- విధివిధానాలపై స్పష్టత వచ్చేదాకా మార్కెట్‌లో స్తబ్ధతే



రెండున్నర దశాబ్దాల కలను ప్రభుత్వం సాకారం చేసింది. 111 జీవోను ఎత్తివేస్తూ రాష్ట్ర క్యాబినేట్ నిర్ణయం తీసుకుంది. దీంతో 84 గ్రామాల్లోని 1.32 లక్షల ఎకరాలకు పైగా భూమి అందుబాటులోకి వస్తుంది. ఆహ్వానించదగ్గ పరిణామమే.. కానీ, ఆ ఫలాలు నిజంగా స్థానిక రైతులకు అందుతాయా అనేదే మిలియన్ డాలర్ల ప్రశ్న. నిర్మాణ నిబంధనల సాకు చూపి ఇప్పటికే 60 శాతానికి పైగా భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. దీంతో జీవో రద్దు ఫలాలు ఎవరికి దక్కుతాయనేది సుస్పష్టం.

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ రియల్టీ రంగంపై 111 జీవో ఎత్తివేత ప్రభావం గట్టిగానే పడనుంది. చదరపు అడుగు (చ.అ.) రూ.6 వేల కంటే ఎక్కువ ధర ఉన్న ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకు కస్టమర్లు పునరాలోచనలో పడ్డారు. ఎక్కువ ధర పెట్టి అపార్ట్‌మెంట్లలో కొనుగోలు చేసే బదులు అదే ధరకు 111 జీవో పరిధిలోని గ్రామాలలో వ్యక్తిగత గృహాలు, విల్లాలు కొనుగోలు చేయవచ్చనే భావన కొనుగోలుదారులలో పెరిగిపోయింది. దీంతో పశ్చిమ హైదరాబాద్‌లోని హైరైజ్, లగ్జరీ ప్రాజెక్ట్‌లలో విక్రయాలు తగ్గిపోతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పశ్చిమంలో 50 వేల యూనిట్లు..

హైదరాబాద్ స్థిరాస్తి రంగంలో పశ్చిమ హైదరాబాద్ కీలకమైనది. ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీల కారణంగా ఈ ప్రాంతాలలో గృహ కొనుగోళ్లు, లాంచింగ్‌లు ఎక్కువగా ఉంటాయి. ఏటా హైదరాబాద్‌లోని రియల్టీ క్రయవిక్రయాలలో వెస్ట్ హైదరాబాద్ వాటా 60 శాతం ఉంటుంది. కూకట్‌పల్లి, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, కోకాపేట, గోపన్‌పల్లి, నల్లగండ్ల వంటివి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాలలో సుమారు 10 కోట్ల చ.అ.లలో నివాస సముదాయాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటిల్లో సుమారుగా 50 వేల యూనిట్లు ఉంటాయని అంచనా. 111 జీవో రద్దుతో ఆయా ప్రాజెక్ట్‌ల డెవలపర్లు డోలాయమానంలో పడ్డారు.

ప్రీలాంచ్ నిర్మాణాలకు బ్రేక్..

కోకాపేట, నార్సింగి, పుప్పాలగూడ వంటి వెస్ట్ హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాలలో డెవలపర్లు ప్రీలాంచ్‌లో విక్రయాలు చేశారు. ధర తక్కువకు వస్తుంది కదా అని కొనుగోలుదారులూ ఎగిరి గంతేసి బిల్డర్లతో అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాజెక్ట్‌లన్నీ నిర్మాణ దశలో ఉన్నాయి. గత 3–4 నెలలుగా మార్కెట్ ప్రతికూలంగా మారడంతో లగ్జరీ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. విక్రయాలు లేకపోవటం, నిధుల లేమి కారణంగా చాలా వరకు ప్రాజెక్ట్ నిర్మాణ పనులు నెమ్మదించాయి. తాజాగా 111 జీవో రద్దు ప్రకటించిన నాటి నుంచే పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ప్రీలాంచ్‌లోని పలువురు కస్టమర్లు డెవలపర్‌తో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయమని నిర్మాణ సంస్థల ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ డెవలపర్లను కోరుతున్నారని స్పేస్ విజన్ గ్రూప్ సీఎండీ టీవీ నర్సింహా రెడ్డి తెలిపారు.

స్పష్టత వచ్చేదాక స్తబ్ధుగానే..

జంట జలాశయాల పరిరక్షణ కోసం తెచ్చిన జీవో 111ను ప్రభుత్వం ఎత్తేసి 69 జీవో తీసుకొచ్చినా స్థానిక భూ యజమానులు మాత్రం వేచిచూసే ధోరణిలో ఉన్నారు. వెంటనే భూములు అమ్మడానికి ఆసక్తి చూపడంలేదు. నగరానికి అతి చేరువలో ఉన్న ఈ ప్రాంతంలో మునుముందు భూముల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వం గ్రీన్ జోన్, బఫర్ జోన్‌లు చేస్తామని ప్రకటించింది. దీంతో ఏయే ప్రాంతాలు గ్రీన్ జోన్‌లో ఉంటాయి? ఏ ప్రాంతాలు బఫర్ జోన్‌లో ఉంటాయనే విషయంలో స్పష్టత లేదు. దీంతో ఇప్పుడు భూములు ఎందుకు అమ్ముకోవాలని రైతులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. అవసరాల కోసం కొందరు రైతులు భూములు అమ్మకానికి పెట్టినా గతం కంటే ఎక్కువ ధరలే చెబుతున్నారు. జీవో 69 విధివిధానాలను మాత్రం ఖరారు చేయలేదు. భవన నిర్మాణ నిబంధనలు, జలాశయాల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, జోన్ల ఏర్పాటు, మాస్టర్ ప్లాన్ వంటి వాటిపై స్పష్టత వస్తే ఇక్కడి భూములకు మరింత గిరాకీ ఉంటుంది.

ప్రభావిత ప్రాంతాలివే..

కొల్లూరు, తెల్లాపూర్, నల్లగండ్ల, గోపన్‌పల్లి, నానక్‌రాంగూడ, ఖానామెట్, నార్సింగి, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, పుప్పాలగూడ వంటి 111 జీవో పరిధిలోని 10 కి.మీ. క్యాచ్‌మెంట్ ఏరియాకు ఆనుకొని ఉన్న ప్రాంతాలలో ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



కొండపైన వీకెండ్ హోమ్స్

- జహీరాబాద్‌లో సెలబ్రిటీ హిల్‌వ్యూ ప్రాజెక్ట్
- యోషితా హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రా

సాక్షి, హైదరాబాద్: కరోనా తర్వాత నుంచి ఇంటి ఎంపిక విషయంలో శ్రద్ధ పెరిగింది. కాలుష్యానికి దూరంగా, ఆరోగ్యానికి దగ్గరగా ఉండే ప్రాజెక్ట్‌లను కొనుగోలుదారులు కావాలంటున్నారు. వారాంతంలో కుటుంబంతో కలిసి ఆహ్లాదకర వాతావరణంలో గడపాలని నగరవాసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో వీకెండ్ హోమ్స్‌కు ఆదరణ పెరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని యోషితా హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రా జహీరాబాద్‌లో సెలబ్రిటీ హిల్‌వ్యూకు శ్రీకారం చుట్టింది. 83 ఎకరాల విస్తీర్ణంలోని ఈ ప్రాజెక్ట్ భూమి నుంచి 155 అడుగుల ఎత్తులో కొండపైన ఉండటమే దీని ప్రత్యేకత. ఊటీ, కొడైకెనాల్ తరహా అనుభూతిని కలిగించేలా ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేస్తుంది.

- 13 వేల ఎకరాలలో రానున్న నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)కు కూతవేటు దూరంలో హిల్‌వ్యూ ఉంది. డీటీసీపీ, రెరా అనుమతి పొందిన ప్రాజెక్ట్‌లో మొత్తం 700 ప్లాట్లుంటాయి. ఒక్కోటి 150 నుంచి 600 గజాల విస్తీర్ణంలో ఉంటాయి. ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన వారం రోజుల్లోనే 130కి పైగా ప్లాట్లు బుకింగ్ అయ్యాయి.
- లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఈ ప్రాజెక్ట్‌లో ఆధునిక వసతులను కల్పిస్తున్నారు. భూగర్భ విద్యుత్, మురుగునీటి వ్యవస్థ, గ్రీనరీ, పార్కులు, వాకింగ్ ట్రాక్స్, చిల్డ్రన్స్ ప్లే ఏరియాలతో పాటు 2 ఎకరాల స్థలాన్ని పాఠశాల కోసం కేటాయించారు. ప్రస్తుతం గ్రీనరీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

త్వరలోనే మరో 2 ప్రాజెక్ట్‌లు...

రెండున్నరేళ్ల కాలంలో సదాశివపేట, జహీరాబాద్‌లలో 7 ప్రాజెక్ట్‌లను విజయవంతంగా పూర్తి చేశామని యోషితా హౌసింగ్ అండ్ ఇన్‌ఫ్రా సీఎండీ గణాది కమలాకర్ తెలిపారు. ప్రతికూల సమయంలో విక్రయాలు చేయాలంటే కంపెనీ బ్రాండ్ ఇమేజ్, ప్రాజెక్ట్ ఉండే ప్రాంతం మీద ఆధారపడి ఉంటాయి. ఈ విషయంలో యోషిత విజయం సాధించిందన్నారు. 1–2 నెలల్లో సదాశివపేటలోని కంకోల్‌లో 40 ఎకరాలు, జహీరాబాద్‌లో 10 ఎకరాలలో మరో 2 ప్రాజెక్ట్‌లను ప్రారంభించనున్నాం.

ప్రత్యామ్నాయ రియల్టీలో పెట్టుబడులు

సాక్షి, హైదరాబాద్: ప్రత్యామ్నాయ రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడుల భారీగా వస్తున్నాయి. గతేడాది దేశీయ ప్రత్యామ్నాయ రియల్టీలో 500 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయని కొలియర్స్ ఇండియా రిపోర్ట్ వెల్లడించింది. 2020తో పోలిస్తే ఇది 26 శాతం మేర వృద్ధి రేటని పేర్కొంది. అధిక నాణ్యత, సాంకేతికత, పాలన, కస్టమర్ సర్వీస్‌లలో గణనీయమైన మార్పులు వచ్చాయి. డేటా వేర్‌హౌస్‌లు, షేర్డ్ స్పేస్ (రెసిడెన్షియల్ లేదా కమర్షియల్), ప్రాప్‌టెక్ వంటి కొత్త వ్యాపారాలు ఊపందుకున్నాయి. మెరుగైన పాలన, గడువులోగా డెలివరీలు, నగదు లభ్యతతో నివాస సముదాయాల మార్కెట్లో సానుకూలత తిరిగొచ్చింది. నివాస రంగంలో 900 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది నాలుగేళ్లలో అత్యధికం. పెట్టుబడిలో అందుబాటు, మధ్యతరగతి గృహాలు 64 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ–కామర్స్ డిమాండ్‌తో గత ఐదేళ్లలో పారిశ్రామిక, గిడ్డంగుల విభాగంలో గరిష్ట స్థాయిలో 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. పెట్టుబడిదారులు, డెవలపర్లు, ప్రాపర్టీ యజమానులు స్థిరమైన అభివృద్ధి వైపు దృష్టిసారించారు.

రామేశ్వర్‌రావుకు సీఐఐ జీవిత సాఫల్య పురస్కారం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన బిజినెస్ టైకూన్, మైహోం గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వర్‌రావును సీఐఐ జీవిత సాఫల్య పురస్కారం వరించింది. గురువారం హెచ్ఐసీసీలో జరిగిన సీఐఐ గ్రీన్ సిమెంటెక్ కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. రామేశ్వర్‌రావు తరఫున ఆయన కుమారుడు వైస్ చైర్మన్ జూపల్లి రామురావు పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వీడియో కాల్‌లో రామేశ్వర్‌రావు సీఐఐ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు.



ప్రపంచ టీటీ చాంపియన్‌షిప్ బరిలో శ్రీజ

జాతీయ చాంపియన్, తెలంగాణ క్రీడాకారిణి ఆకుల శ్రీజ ప్రతిష్టాత్మక ప్రపంచ టేబుల్ టెన్నిస్ (టీటీ) వ్యక్తిగత చాంపియన్‌షిప్ పోటీలకు సిద్ధమైంది. దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో నేడు ఈ మెగా టోర్నీ మొదలుకానుంది. నేడు జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో నికోలా అల్లియా (ఇటలీ)తో శ్రీజ తలపడుతుంది. శనివారమే జరిగే డబుల్స్ తొలి రౌండ్‌లో గయా మొన్ఫార్దిని-నికోల్ అల్లియా (ఇటలీ)లతో శ్రీజ-దియా చిటాలె (భారత్) ఆడతారు. డబుల్స్ తొలి రౌండ్‌లో గెలిస్తే రెండో రౌండ్‌లో టాప్ సీడ్ సన్ యింగ్షా-వాంగ్ మాన్యు (చైనా)లతో శ్రీజ-దియా తలపడతారు.

హారిక ఖాతాలో మరో 'డ్రా'

మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక వరుసగా మూడో 'డ్రా' నమోదు చేసింది. సైప్రస్‌లో 12 మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య 11 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది. ప్రపంచ మాజీ విజేత అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్)తో జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను తెల్లపావులతో ఆడిన హారిక 35 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. నాలుగో రౌండ్ తర్వాత హారిక 2.5 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో ఉంది.



గెలిస్తే ప్లే ఆఫ్ దశకు...

● చెన్నై ఖాతాలో ప్రస్తుతం 15 పాయింట్లు ఉన్నాయి. ఢిల్లీ వేదికగా జరిగే తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే చెన్నై 17 పాయింట్లతో, ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తుంది. అయితే రెండో స్థానమా, మూడో స్థానమా అనేది రాత్రి జరిగే తర్వాతి మ్యాచ్‌తో ఖరారవుతుంది. చెన్నై ఓడిపోతే మాత్రం ఆదివారం జరిగే మ్యాచ్‌ల ఫలితాల కోసం ఎదురు చూడాల్సి ఉంటుంది. ఎప్పుడో ప్లే ఆఫ్స్‌కు దూరమైన ఢిల్లీ క్యాపిటల్స్ గెలిచినా ఆ జట్టుకు ప్రయోజనం ఏమీ ఉండదు. అయితే సీజన్‌లో ఆఖరి స్థానం నుంచి తప్పించుకునేందుకు ఇదో అవకాశం.

● లక్నో ఖాతాలో ప్రస్తుతం 15 పాయింట్లు ఉన్నాయి. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో గెలిస్తే 17 పాయింట్లతో లక్నో కూడా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించడం ఖాయం. పైగా చెన్నై మ్యాచ్ ముగిసిపోతుంది కాబట్టి ఎంత తేడాతో గెలిస్తే రెండో స్థానం దక్కుతుందనేది కూడా తెలుస్తుంది. ఓడితే చెన్నైలాగే ఆదివారం మ్యాచ్ ఫలితాల కోసం ఎదురు చూడక తప్పదు. కోల్‌కతా సాంకేతికంగా నిష్క్రమించకపోయినా... గెలిచి 14 పాయింట్లతో చేరడంతో పాటు –0.256 నుంచి రన్‌రేట్‌ను భారీగా మెరుగుపర్చుకొని పోటీలో నిలవడం దాదాపు అసాధ్యం!

ఐపీఎల్‌లో నేడు కీలక మ్యాచ్‌లు
ఢిల్లీ x చెన్నై (మధ్యాహ్నం గం. 3:30 నుంచి)
కోల్‌కతా x లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


కృనాల్ పాండ్యా, డికాక్

27న బీసీసీఐ 'ప్రత్యేక' సమావేశం

న్యూఢిల్లీ: కీలక అంశాలే అజెండాగా ఈ నెల 27న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ప్రత్యేక సర్వసభ్య సమావేశం (ఎస్‌జీఎం) నిర్వహించనుంది. అహ్మదాబాద్‌లో జరిగే ఈ మీటింగ్‌లో ప్రధానంగా ఐదు అంశాలపై బోర్డు చర్చించనుంది.

వర్కింగ్ గ్రూప్: ఈ ఏడాది సొంతగడ్డపై జరిగే వన్డే ప్రపంచకప్ కోసం వర్కింగ్ గ్రూప్ నియామకంపై ఎస్‌జీఎంలో కసరత్తు చేస్తారు. ఇందులో ఉండాల్సిన సభ్యులు, అప్పగించాల్సిన బాధ్యతలపై చర్చిస్తారు.

డబ్ల్యూపీఎల్‌కు నిర్దిష్టమైన షెడ్యూల్: మహిళల లీగ్‌కు ఐపీఎల్‌లాగే క్రేజ్ పెంచేందుకు అంతర్జాతీయ స్టార్ క్రికెటర్లు అందుబాటులో ఉండే వీలైన, మేలైన నిర్దిష్ట షెడ్యూల్‌పై దృష్టి సారిస్తారు.

లైంగిక వేధింపుల నిరోధక కమిటీ: అప్పట్లో బోర్డు మాజీ సీఈఓ రాహుల్ జోహ్రిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినపుడు కమిటీ వేసి నిగ్గుతేల్చారు. అయితే ఇప్పుడు బోర్డులో పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

రాష్ట్ర జట్లకు ఫిజియోలు: దేశవాళీ ఆటగాళ్ల ఫిట్‌నెస్ కోసం రాష్ట్ర జట్లకు నాణ్యమైన ఫిజియోలను, ట్రెయినర్లను నియమించాలని ఇందుకోసం ఎన్‌సీఏ సర్టిఫైడ్ సిబ్బందిని తీసుకోనుంది.

మౌలిక వసతులపై: మౌలిక వసతుల అభివృద్ధి, సబ్సిడీ సబ్-కమిటీల నియామకంపై ఎస్‌జీఎంలో చర్చించనున్నారు.

దేశం కోసం పతకం... పతకం కోసం సర్వస్వం...

బ్రిజ్‌భూషణ్ వ్యాఖ్యలపై రెజ్లర్ల కౌంటర్



న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ రెజ్లర్లు సాధించిన పతకాలకు వెలకట్టడంపై స్టార్ రెజ్లర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రెజ్లర్ల పతకాలు 15 రూపాయలు కూడా విలువ చేయవని, పతకాలు తిరిగివ్వడం కాదు... రూ.కోట్లలో పొందిన ప్రోత్సాహకాల్ని తిరిగివ్వాలని బీజేపీ ఎంపీ కూడా అయిన బ్రిజ్‌భూషణ్ అన్నారు. దీనిపై జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్న ఒలింపిక్ మెడలిస్ట్ బజరంగ్ పూనియా మాట్లాడుతూ 'ఆ పతకం ఛారిటీలో బ్రిజ్‌భూషణ్ ఇచ్చింది కాదు. నేను దేశం కోసం శ్రమిస్తే వచ్చింది. దాని కోసం రాత్రనక పగలనక మా రక్తం ధారపోశాం. ఏళ్ల తరబడి చెమట చిందించాం. దానికి వెలకట్టే అర్హత అతనికి లేనేలేదు' అని అన్నాడు. మరో రెజ్లర్ సాక్షి మలిక్ కూడా అంతే స్థాయిలో ధ్వజమెత్తింది. బ్రిజ్‌భూషణ్‌కు కనపడిన 15 రూపాయల పతకం కోసమే సర్వస్వాన్ని ధారపోశామని చెప్పింది. అతని వ్యాఖ్యలు సిగ్గుచేటని, క్రీడాలోకం ముక్తకంఠంతో ఖండించాలని సూచించింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలని రెజ్లర్లంతా నెలరోజులుగా నిరసన చేస్తున్నారు.

విజయంతో ముగించిన రాజస్తాన్

● 4 వికెట్లతో పంజాబ్ కింగ్స్‌పై గెలుపు
● రాణించిన యశస్వి, పడిక్కల్


దేవదత్ పడిక్కల్

ధర్మశాల: మాజీ చాంపియన్ రాజస్తాన్ రాయల్స్ సాంకేతికంగా ఇంకా 'ప్లే ఆఫ్స్' రేసులోనే ఉంది. తమ చివరి మ్యాచ్‌లో గెలిచిన ఆ జట్టు 14 పాయింట్లతో ప్రస్తుతం ఐదో స్థానంలో నిలిచింది. లీగ్ దశలో తమ పని పూర్తి చేసుకున్న ఆ జట్టు అవకాశాలు ఆదివారం జరిగే మ్యాచ్‌ల ఫలితాలపై ఆధారపడి ఉన్నాయి. శుక్రవారం జరిగిన పోరులో రాయల్స్ 4 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. స్యామ్ కరన్ (31 బంతుల్లో 49 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), జితేశ్ శర్మ (28 బంతుల్లో 44; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), షారుఖ్ ఖాన్ (23 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. అనంతరం రాజస్తాన్ 19.4 ఓవర్లలో 6 వికెట్లకు 189 పరుగులు సాధించి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దేవదత్ పడిక్కల్ (30 బంతుల్లో 51; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (36 బంతుల్లో 50; 8 ఫోర్లు), హెట్‌మైర్ (28 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) విజయంలో కీలకపాత్ర పోషించారు.

కీలక భాగస్వామ్యాలు...

ఇన్నింగ్స్ రెండో బంతికే ప్రభ్‌సిమ్రన్ (2)ను చక్కటి రిటర్న్ క్యాచ్‌తో అవుట్ చేసి బౌల్ట్ రాజస్తాన్‌కు శుభారంభం అందించగా, కొద్ది సేపటికే పంజాబ్ మరో మూడు కీలక వికెట్లు కోల్పోయింది. 12 పరుగుల వ్యవధిలో అథర్వ తైడే (19), శిఖర్ ధావన్ (17), లివింగ్‌స్టోన్ (9) అవుటయ్యారు. దాంతో స్కోరు 50/4 వద్ద నిలిచింది. ఈ దశలో కరన్‌తో కలిసి జితేశ్ జట్టును ఆదుకున్నాడు. సందీప్ ఓవర్లో 2 సిక్స్‌లు కొట్టిన జితేశ్, ఆ తర్వాత సైనీ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. కానీ అదే ఓవర్లో అతను వెనుదిరిగాడు. జితేశ్ అవుటయ్యాక 15 నుంచి 18వ ఓవర్ వరకు 24 బంతుల్లో పంజాబ్ 26 పరుగులే చేయగలిగింది. అయితే చివరి రెండు ఓవర్లలో కరన్, షారుఖ్ మెరుపు బ్యాటింగ్ కారణంగా ఆ జట్టు మెరుగైన స్కోరు నమోదు చేయగలిగింది. చహల్ వేసిన 19వ ఓవర్లో ఇద్దరు బ్యాటర్లు కలిసి 3 సిక్స్‌లు, 2 ఫోర్లు సహా 28 పరుగులు రాబట్టగా... బౌల్ట్ వేసిన ఆఖరి ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్‌తో మొత్తం 18 పరుగులు వచ్చాయి. వీరిద్దరు ఆరో వికెట్‌కు 37 బంతుల్లో అభేద్యంగా 73 పరుగులు జోడించారు.

శామ్సన్ విఫలం...

జోస్ బట్లర్ ఈ సీజన్‌లో ఐదోసారి 'డకౌట్'కాగా... యశస్వి, పడిక్కల్ భాగస్వామ్యం రాజస్తాన్‌ను మెరుగైన స్థితికి చేర్చింది. కరన్ వేసిన తొలి ఓవర్లో యశస్వి 3 ఫోర్లు కొట్టగా, రబడ ఓవర్లో పడిక్కల్ వరుసగా 6, 4 బాదడంతో పవర్‌ప్లేలో స్కోరు 57 పరుగులకు చేరింది. 29 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న వెంటనే పడిక్కల్ వెనుదిరగడంతో 73 పరుగుల (49 బంతుల్లో) రెండో వికెట్ భాగస్వామ్యం ముగిసింది. శామ్సన్ (2) ప్రభావం చూపలేకపోగా, 35 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే గెలుపు దిశగా హెట్‌మైర్‌దే కీలకపాత్ర. ప్రతీ బౌలర్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ అతను బౌండరీలతో పరుగులు రాబట్టాడు. రబడ ఓవర్లో పరాగ్ (12 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) వరుసగా రెండు సిక్సర్లు కొట్టడంతో రాయల్స్ విజయానికి చేరువైంది. 19వ ఓవర్లో ముగిస్తే బెంగళూరు రన్‌రేట్‌ను దాటే అవకాశం ఉండగా... హెట్‌మైర్ అవుట్‌తో అది సాధ్యం కాలేదు. చివరకు మరో రెండు బంతులు మిగిలి ఉండగా రాజస్తాన్ గెలిచింది.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (సి అండ్ బి) బౌల్ట్ 2; ధావన్ (ఎల్బీ) (బి) జంపా 17; అథర్వ (సి) పడిక్కల్ (బి) సైనీ 19; లివింగ్‌స్టోన్ (బి) సైనీ 9; స్యామ్ కరన్ (నాటౌట్) 49; జితేశ్ (సి) (సబ్) ఫెరీరా (బి) సైనీ 44; షారుఖ్ (నాటౌట్) 41; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 187. వికెట్ల పతనం:** 1-2, 2-38, 3-46, 4-50, 5-114. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-35-1, సందీప్ శర్మ 4-0-46-0, సైనీ 4-0-40-3, జంపా 4-0-26-1, చహల్ 4-0-40-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) (సబ్) రిషి ధావన్ (బి) ఎలిస్ 50; బట్లర్ (ఎల్బీ) (బి) రబడ 0; పడిక్కల్ (సి) బ్రార్ (బి) అర్ష్‌దీప్ 55; సంజూ శామ్సన్ (సి) (సబ్) రిషి ధావన్ (బి) చహర్ 2; హెట్‌మైర్ (సి) శిఖర్ ధావన్ (బి) కరన్ 46; పరాగ్ (సి) అథర్వ (బి) రబడ 20; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 10; బౌల్ట్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (19.4 ఓవర్లలో 6 వికెట్లకు) 189. వికెట్ల పతనం:** 1-12, 2-85, 3-90, 4-137, 5-169, 6-179. **బౌలింగ్:** స్యామ్ కరన్ 4-0-46-1, రబడ 4-0-40-2, అర్ష్‌దీప్ 4-0-40-1, ఎలిస్ 4-0-34-1, రాహుల్ చహర్ 3.4-0-28-1.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	13	9	4	0	18	0.835
చెన్నై	13	7	5	1	15	0.381
లక్నో	13	7	5	1	15	0.304
బెంగళూరు	13	7	6	0	14	0.180
రాజస్తాన్	14	7	7	0	14	0.148
ముంబై	13	7	6	0	14	-0.128
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	14	6	8	0	12	-0.304
ఢిల్లీ	13	5	8	0	10	-0.572
హైదరాబాద్	13	4	9	0	8	-0.558

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

పసిడి పతక పోరుకు జ్యోతి సురేఖ–ఓజస్ జోడీ

ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–2 టోర్నీ



షాంఘై: వ్యక్తిగత, టీమ్ విభాగాల్లో ఆకట్టుకోలేకపోయిన భారత స్టార్ ఆర్చర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ మిక్స్‌డ్ టీమ్ కాంపౌండ్ విభాగంలో మెరిసింది. భారత్‌కే చెందిన ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలెతో కలిసి మిక్స్‌డ్ టీమ్ విభాగంలో పోటీపడిన జ్యోతి సురేఖ ఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన ప్రపంచకప్ స్టేజ్–2 మిక్స్‌డ్ టీమ్ సెమీఫైనల్లో సురేఖ–ఓజస్ ద్వయం 'షూట్ ఆఫ్'లో ఎలీసా రోనర్–ఇలియా ఫ్రాగ్నన్ (ఇటలీ) జోడీపై గెలిచింది. నిర్ణీత 16 బాణాల తర్వాత రెండు జోడీలు 157–157తో సమఉజ్జీగా నిలిచాయి. 'షూట్ ఆఫ్'లోనూ రెండు జోడీలు 19–19తో సమంగా నిలిచాయి. అయితే భారత ఆర్చర్లు కొట్టిన బాణాలు కేంద్ర బిందువుకు అతిసమీపంగా ఉండటంతో విజయాన్ని ఖరారు చేసుకున్నారు. నేడు జరిగే ఫైనల్లో ఓ యుహూన్–కిమ్ జొంగ్‌హో (కొరియా)లతో సురేఖ–ఓజస్ తలపడతారు. పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ ధీరజ్ బొమ్మదేవర క్వార్టర్ ఫైనల్లో 0–6తో ఓ జిన్ హైక్ (కొరియా) చేతిలో ఓడిపోయాడు.


సహజ పరాజయం



కాయైటి (జార్జియా): అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి సహజ యామలపల్లి పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 4–6, 3–6తో దెజానా రాడనోవిచ్ (సెర్బియా) చేతిలో ఓడిపోయింది. గంటా 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది.

సినిమా

రజనీకాంత్ చివరి చిత్రం అదేనా?


● రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్ ఫుల్ స్వింగ్‌లో ఉన్నారు. ఏడు పదుల వయసులోనూ ఆయన వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. అయితే లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో చేయనున్నది రజనీకాంత్ ఆఖరి చిత్రం అవుతుందేమో? అని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తమిళ దర్శకుడు–నటుడు మిస్కిన్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. దీనిపై సూపర్‌స్టార్ ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న 'జైలర్' షూటింగ్ పూర్తి చేసిన రజనీకాంత్ ప్రస్తుతం తన కుమార్తె ఐశ్వర్య దర్శకత్వం వహిస్తున్న 'లాల్ సలామ్' చిత్రీకరణలో పాల్గొంటున్నారు. ఆ తర్వాత తన 170వ సినిమాని 'జై భీమ్' ఫేమ్ టీజే జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో చేస్తారు రజనీ. ఆ తర్వాత 171వ సినిమాని 'తలైవర్ 171' (వర్కింగ్ టైటిల్)ని లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో చేయనున్నారట రజనీకాంత్. ప్రస్తుతం లోకేశ్ కనకరాజ్ దర్శకత్వం వహిస్తున్న 'లియో' సినిమాలో డైరెక్టర్ మిస్కిన్ కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మిస్కిన్ మాట్లాడుతూ– ''లోకేశ్ కనకరాజ్ డైరెక్షన్‌లో చేసేందుకు రజనీ సార్ ఆసక్తిగా ఉన్నారు. ఆయనే స్వయంగా లోకేశ్‌ను తన 171వ సినిమా గురించి అడిగారు. బహుశా ఇదే రజనీకాంత్‌గారికి చివరి సినిమా కావచ్చు. ఆ తర్వాత ఆయన సినిమాలకు బ్రేక్ ఇస్తారేమో!'' అన్నారు. కాగా మిస్కిన్ వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలనే నిర్ణయాన్ని రజనీకాంత్ తీసుకోరంటూ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు.

హనుకి గ్రీన్ సిగ్నల్?


● ప్రభాస్

ప్రస్తుతం 'సలార్', 'ప్రాజెక్ట్ కె', 'రాజా డీలక్స్' (వర్కింగ్ టైటిల్) సినిమాలతో బిజీగా ఉన్నారు ప్రభాస్. ఆ సినిమా చిత్రీకరణలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో కొత్త సినిమాల కోసం కథలు వింటున్నారట ప్రభాస్. ఇందులో భాగంగా దర్శకుడు హను రాఘవపూడి చెప్పిన ఓ కథ ప్రభాస్‌కు నచ్చిందని, ఈ కథకు ప్రభాస్ ఆల్మోస్ట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, దీంతో ఈ స్క్రిప్ట్‌కు హను రాఘవపూడి తుది మెరుగులు దిద్దే పనిలో ఉన్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. అంతేకాదు.. ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తారనే ప్రచారం జరుగుతోంది. మరోవైపు ప్రస్తుతం 'రాజా డీలక్స్' షూటింగ్‌లో పాల్గొంటున్నారు ప్రభాస్. అలాగే ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' చిత్రం జూన్ 16న థియేటర్స్‌లో రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే.

యాక్షన్ దేవర


● ఎన్టీఆర్

ఎన్టీఆర్ అభిమానులకు బర్త్ డే గిఫ్ట్ ఇచ్చింది 'ఎన్టీఆర్ 30' యూనిట్. నేడు (మే 20) ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ చిత్రానికి 'దేవర' అనే టైటిల్ ఫిక్స్ చేసి, శుక్రవారం ఫస్ట్ లుక్ విడుదల చేశారు మేకర్స్. రక్తమోడుతున్న కత్తిని చేతిలో పట్టుకుని ఎగసిపడుతున్న సముద్రం ఒడ్డున పంచె కట్టుతో రగ్డ్ లుక్‌తో కనిపించారు ఎన్టీఆర్. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో ఈ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంతో బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ టాలీవుడ్‌కి ఎంట్రీ ఇస్తున్నారు. నందమూరి కల్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ''హై యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'దేవర'. దేవర అంటే దేవుడు అని అర్థం. యాక్షన్ జోనర్‌లో ఈ చిత్రం సరికొత్త బెంచ్ మార్క్‌ని క్రియేట్ చేస్తుంది. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాను 2024 ఏప్రిల్ 5న విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్, కెమెరా: ఆర్. రత్నవేలు.

విలన్ వికాస్ మాలిక్


● నవాజుద్దీన్

వెంకటేశ్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సైంధవ్'. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ వెర్సటైల్ యాక్టర్ నవాజుద్దీన్ సిద్ధిఖీ తెలుగు చిత్ర పరిశ్రమకి పరిచయమవుతున్నారు. శుక్రవారం (మే 19) నవాజుద్దీన్ సిద్ధిఖీ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రయూనిట్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి, ఈ చిత్రంలో ఆయన చేస్తున్న వికాస్ మాలిక్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఇందులో నవాజుద్దీన్‌ది పవర్‌ఫుల్ విలన్ రోల్. ''హై యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'సైంధవ్'. వెంకటేశ్ కెరీర్‌లో 75వ లాండ్ మార్క్ మూవీ ఇది. ఇందులో శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్‌గా (మనోజ్ఞ పాత్రలో) నటిస్తుండగా, డాక్టర్ రేణు పాత్రలో రుహానీ శర్మ, జాస్మిన్ పాత్రలో ఆండ్రియా జెర్మియా కనిపించనున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కాగా 'సైంధవ్' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో డిసెంబర్ 22న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, సహనిర్మాత: కిశోర్ తాళ్లూరు, కెమెరా: ఎస్. మణికందన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్. వెంకటరత్నం (వెంకట్).

దయచేసి డిజైనర్‌ని మార్చండి!

– కాన్స్‌లో ఐష్ లుక్‌పై ట్రోల్స్


● ఐశ్వర్యా రాయ్

రెండు దశాబ్దాలుగా కాన్స్ చలన చిత్రోత్సవాల్లో పాల్గొంటున్నారు హీరోయిన్ ఐశ్వర్యా రాయ్. అందమైన లుక్స్‌తో కాన్స్ చిత్రోత్సవాల్లో ఓ హైలైట్‌గా నిలుస్తుంటారు. అందుకే 'క్వీన్ ఆఫ్ కాన్స్'గా ఐశ్వర్యను ఆమె అభిమానులు కొనియాడుతుంటారు. అయితే ఒకట్రెండు సార్లు లుక్స్ బాగా లేవనే విమర్శలు కూడా వచ్చాయి. తాజాగా ఈ ఏడాది జరుగుతున్న 76వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఐశ్వర్యా రాయ్ లుక్‌పై మిశ్రమ స్పందన లభించింది. పెద్ద హుడీ జత కలిపి డిజైన్ చేసిన పొడవాటి బ్లాక్ అండ్ సిల్వర్ కలర్ గౌను ధరించి రెడ్ కార్పెట్‌పై ఐశ్వర్యా రాయ్ క్యాట్‌వాక్ చేశారు. ఈ గౌను చూడ్డానికి అంత బాగాలేదనీ, తల చుట్టూ ఉన్న ఆ హుడీ చూడ్డానికి చాలా ఇబ్బందిగా ఉందని పలువురు కామెంట్స్ చేశారు. 'దయచేసి మీ డిజైనర్‌ను మార్చండి', 'కోయీ మిల్ గయా'లోని ఏలియన్ క్యారెక్టర్ జాదూను స్ఫూర్తిగా తీసుకుని ఫ్రాక్‌ని డిజైన్ చేసినట్లున్నారు', 'మీ లుక్ ఓ గిఫ్ట్‌బాక్స్'లా కనిపిస్తోంది', 'చికెన్ షవర్మా' గుర్తుకు వస్తోంది' ఇలా.. నెటిజన్లు రకరకాలుగా ఐశ్వర్యా రాయ్‌ను నెట్టింట ట్రోల్ చేశారు. అలాగే ఐశ్వర్యా రాయ్ రెడ్ కార్పెట్‌పై వాక్ చేయకముందు గ్రీన్ డ్రెస్‌లో ఉన్న ఆమె ఫోటోలు కొన్ని బయటకు వచ్చాయి. ఈ లుక్ గురించి కూడా నెటిజన్లు ఆమెను ట్రోల్ చేశారు. ముఖ్యంగా ఆకుపచ్చ రంగు గౌను ధరించినప్పుడు ఆమె జుట్టుని అలా ఫ్రీగా వదిలేయడం బాగాలేదని, అసలు ఆ స్టయిలే బాగాలేదని కొందరు అభిప్రాయపడ్డారు. అలాగే ఊర్వశీ రౌతేలా ధరించిన కంఠాభరణం గురించి కూడా విమర్శలు వచ్చాయి. మొసలి ఆకారం ఉన్న ఓ నెక్లెస్‌ను ధరించారామె. ఆ ఆభరణం చాలా ఎబ్బెట్టుగా ఉందనే కామెంట్స్ వినిపించాయి. అయితే ఇప్పటివరకూ కాన్స్‌లో మెరిసిన తారల్లో సారా అలీఖాన్, మృణాల్ ఠాకూర్, మానుషీ చిల్లర్, ఈషా గుప్తాలకు మంచి మార్కులు పడ్డాయి. ఇక ఈ నెల 16న ప్రారంభమైన ఈ చిత్రోత్సవాలు 27 వరకు కొనసాగనున్న సంగతి తెలిసిందే.

జూన్‌లో టక్కర్


● దివ్యాంశ, సిద్ధార్థ్

'నువ్వొస్తానంటే నేనొద్దంటానా', 'బొమ్మరిల్లు' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన సిద్ధార్థ్ హీరోగా రూపొందిన తాజా చిత్రం 'టక్కర్'. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివ్యాంశా కౌశిక్ కథానాయికగా నటించారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రాన్ని జూన్ 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''సాధారణంగా సిద్ధార్థ్ సినిమాల్లో ప్రేమ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే 'టక్కర్'లో ప్రేమ సన్నివేశాలతో పాటు అద్భుతమైన యాక్షన్ సీన్స్ ఉంటాయి. ఈ సినిమా కోసం సిద్ధార్థ్ సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ఘనవిజయం సాధించి, తన కెరీర్‌లో మరో గుర్తుండిపోయే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: నివాస్ కె. ప్రసన్న, కెమెరా: వాంచినాథన్ మురుగేశన్, సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మయాంక్.

ఆల్ టైమ్ గ్రేట్


● సుధీర్

సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'జీ.ఓ.ఏ.టీ' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్స్) అనే టైటిల్‌ని ఖరారు చేశారు. 'పాగల్' ఫేమ్ నరేశ్ కుప్పిలి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దివ్య భారతి హీరోయిన్. లక్కీ మీడియా–మహారాజా క్రియేషన్స్ బ్యానర్స్‌పై చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్ నిర్మిస్తున్నారు. కాగా శుక్రవారం (మే 19) సుధీర్ బర్త్‌డేని పురస్కరించుకుని ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ల, బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''మంచి కథాంశంతో తెరకెక్కుతున్న మా సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన కొద్ది నిమిషాల్లోనే మంచి స్పందన రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''జీ.ఓ.ఏ.టీ లాంటి మంచి కాన్సెప్ట్ ఉన్న కథతో సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు నరేశ్ కుప్పిలి. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, కెమెరా: బాలాజీ సుబ్రహ్మణ్యం.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	298	61,730
నిఫ్టీ ▲	73	18,203

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)			
నాస్డాక్	12,644	▼	25
డోజోన్స్	33,456	▼	80
ఎఫ్టీఎస్ఈ 100	7,757	▲	15
డాక్స్	16,275	▲	112
షాంఘై	3,284	▼	14
నికాయ్	30,808	▲	234

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	60,275	▼	199
బంగారం (99.5 స్వచ్ఛత)	60,034	▼	198
వెండి (కిలో)	71,784	▲	288

రూ. 7 లక్షల వరకు టీసీఎస్ ఉండదు

- విదేశాల్లో క్రెడిట్, డెబిట్ కార్డు చెల్లింపులపై ఆర్థిక శాఖ వివరణ



న్యూఢిల్లీ: విదేశాల్లో క్రెడిట్ కార్డులపై చేసే ఖర్చుల మీద 20 శాతం టీసీఎస్ (ట్యాక్స్ కలెక్టెడ్ ఎట్ సోర్స్) విధింపుపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆర్థిక శాఖ వివరణ ఇచ్చింది. ఒక ఏడాదిలో రూ. 7 లక్షల వరకు క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చేసే వ్యయాలపై టీసీఎస్ విధించబోమని పేర్కొంది. విదేశాల్లో క్రెడిట్ కార్డుతో చేసే వ్యయాలను కూడా కేంద్రం ఇటీవల రెమిటెన్స్ స్కీమ్–ఎల్ఆర్ఎస్ పరిధిలోకి తెచ్చింది. దీంతో జూలై 1 నుంచి విదేశాల్లో క్రెడిట్ కార్డులపై చేసే వ్యయాలపై 20% పన్ను వర్తించనుంది. అయితే ఇది ట్యాక్స్ టెర్రరిజం అంటూ విమర్శలు వెల్లువెత్తడంతో ఆర్థిక శాఖ తాజా ప్రకటన చేసింది.

ఖజానా జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా తమన్నా



హైదరాబాద్: ప్రముఖ జ్యువెలరీ రిటైల్ చైన్ ఖజానా జ్యువెలరీ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటి తమన్నా నియమితులయ్యారు. తమ బ్రాండ్ ప్రమోషన్‌కు తమన్నా మరింత కొత్త శోభను తీసుకువస్తుందన్న విశ్వాసాన్ని సంస్థ వ్యవస్థాపకులు, ఎండీ కిశోర్ కుమార్ జైన్ వ్యక్తం చేశారు. తన నియామకం పట్ల తమన్నా స్పందిస్తూ, ప్రముఖ బ్రాండ్ నుంచి తనకు లభించిన గొప్ప గౌరవంగా దీనిని పరిగణిస్తున్నట్లు తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
20-5-2023	
విశాఖ	495-00
చిత్తూరు	523-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	487-00
విజయవాడ	487-00
రిటైల్ ధర (డజను)	72.00
19-5-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	462-00
వరంగల్	464-00
రిటైల్ ధర	5.20

అదానీకి ఊరట..

- గ్రూప్ స్టాక్స్ ర్యాలీలో నియంత్రణ వైఫల్యం లేదు
- సుప్రీంకోర్టుకు నిపుణుల కమిటీ నివేదిక



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల ర్యాలీ విషయంలో నియంత్రణపరమైన వైఫల్యమేమీ లేదని సుప్రీం కోర్టు నియమించిన నిపుణుల కమిటీ పేర్కొంది. అయితే, హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక రావడానికి ముందే అదానీ స్టాక్స్‌లో షార్ట్ బిల్డప్ జరిగిందనడానికి ఆధారాలు ఉన్నాయని తెలిపింది. రిపోర్టు వెల్లడై, షేర్లు కుప్పకూలిన తర్వాత ట్రేడర్లు పొజిషన్లు స్క్వేర్ ఆఫ్ చేసి, లాభపడ్డారని వివరించింది. ఆరు సంస్థలు అనుమానాస్పద ట్రేడింగ్ నిర్వహించాయని.. వాటిలో నాలుగు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) కాగా, ఒకటి కార్పొరేట్ సంస్థ, మరొక వ్యక్తి ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణను ప్రస్తావిస్తూ పేర్కొంది. 'మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇచ్చిన వివరణ, డేటా ప్రకారం నియంత్రణ వైఫల్యాల వల్ల షేర్ల ధరల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయన్న ఆరోపణలను ధ్రువీకరించలేము' అని సుప్రీం కోర్టుకు ఇచ్చిన 173 పేజీల నివేదికలో కమిటీ తెలిపింది. అలాగే, పరస్పర సంబంధమున్న వర్గాల మధ్య లావాదేవీల్లోనూ, కనీస పబ్లిక్ షేర్‌హోల్డింగ్ నిబంధనల విషయంలోనూ సెబీ విఫలమైనట్లు చెప్పలేమని కమిటీ వివరించింది. సందేహాస్పద విదేశీ సంస్థల నుంచి అదానీ సంస్థల్లోకి నిధులు వచ్చాయన్న ఆరోపణలపై సెబీ 2020 నుంచి చేస్తున్న విచారణలో నిర్దిష్టంగా ఏమీ తేలలేదని కమిటీ తెలిపింది. ఈ నివేదికే తుది తీర్పు కాకపోయినప్పటికీ అదానీ సామ్రాజ్యానికి కాస్త ఊరట మాత్రం కలిగించేదేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. అదానీ గ్రూప్ ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీంతో అదానీ సంస్థల షేర్లు కుప్పకూలాయి. ఈ వ్యవహారంపై అటు సెబీ తన వంతుగా దర్యాప్తు చేస్తుండగా, సుప్రీంకోర్టు కూడా సమాంతరంగా ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని నియమించింది. సుప్రీం కోర్టు మాజీ జడ్జి జస్టిస్ ఏఎం సాప్రే సారథ్యంలోని ఈ కమిటీలో కేవీ కామత్, ఓపీ భట్, నందన్ నీలేకని వంటి దిగ్గజాలు ఉన్నారు.

స్టాక్స్ రయ్..

కమిటీ నివేదికతో శుక్రవారం అదానీ గ్రూప్ స్టాక్స్‌కు ఊతం లభించింది. గ్రూప్‌లోని 10 స్టాక్స్ 1.2 శాతం నుంచి 7 శాతం వరకు పెరిగాయి. అదానీ విల్మర్ 6.85%, అదానీ పవర్ 4.93%, అదానీ ట్రాన్స్‌మిషన్ 4.62%, అదానీ గ్రీన్ ఎనర్జీ 4.18%, అదానీ ఎంటర్‌ప్రైజెస్.. అదానీ పోర్ట్స్ చెరి 3.65 శాతం, ఎన్‌డీటీవీ 3.53%, అదానీ టోటల్ గ్యాస్ 3.05% లాభపడ్డాయి. అంబుజా సిమెంట్స్, ఏసీసీ చెరి 1 శాతం లాభపడ్డాయి.

పీఎన్‌బీ లాభం హైజంప్

- క్యూ4లో రూ. 1,159 కోట్లు
- నికర వడ్డీ ఆదాయం జోరు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) గత ఆర్థిక సంవత్సరం (2022–23) చివరి త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 5 రెట్లు జంప్‌చేసి రూ. 1,159 కోట్లను తాకింది. మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో కేవలం రూ. 202 కోట్లు ఆర్జించింది. కన్సాలిడేటెడ్ నికర లాభం సైతం రూ. 245 కోట్ల నుంచి రూ. 1,864 కోట్లకు దూసుకెళ్లింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 0.65 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 21,095 కోట్ల నుంచి రూ. 27,269 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 30% బలపడి గత ఐదు త్రైమాసికాలకంటే అధికంగా రూ. 9,499 కోట్లను తాకింది.

ఎన్‌పీఏలు డౌన్

ప్రస్తుత సమీక్షా కాలంలో పీఎన్‌బీ స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 11.78 శాతం నుంచి 8.74 శాతానికి, నికర ఎన్‌పీఏలు 4.8 శాతం నుంచి 2.72 శాతానికి దిగివచ్చాయి. దీంతో ప్రొవిజన్లు రూ. 4,564 కోట్ల నుంచి రూ. 3,625 కోట్లకు తగ్గాయి. నికర వడ్డీ మార్జిన్లు 0.48 శాతం పుంజుకుని 3.24 శాతానికి చేరాయి. అయితే మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం 27 శాతం క్షీణించి రూ. 2,507 కోట్లకు పరిమితమైంది. 2021–22లో రూ. 3,457 కోట్లు ఆర్జించింది. గతేడాది రూ. 29,000 కోట్ల రికవరీలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)లో 12–13 శాతం రుణ వృద్ధిని బ్యాంక్ అంచనా వేసింది. గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్ రుణదాతల జాబితాలో బ్యాంక్ లేదని పీఎన్‌బీ ఎండీ అతుల్ కుమార్ గోయెల్ పేర్కొన్నారు.

ఫలితాల నేపథ్యంలో పీఎన్‌బీ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం లాభంతో రూ. 49 వద్ద ముగిసింది.

కేంద్రానికి ఆర్‌బీఐ రూ. 87 వేల కోట్ల డివిడెండ్



ముంబై: గత ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ. 87,416 కోట్ల మొత్తాన్ని డివిడెండ్‌గా చెల్లించే ప్రతిపాదనకు రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన దానితో పోలిస్తే ఇది దాదాపు మూడు రెట్లు. 2021–22లో డివిడెండ్ కింద ఆర్‌బీఐ రూ. 30,307 కోట్లు చెల్లించింది. రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సారథ్యంలో శుక్రవారం జరిగిన సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ 602వ సమావేశంలో డివిడెండ్‌పై నిర్ణయం తీసుకున్నట్లు ఆర్‌బీఐ ఒక ప్రకటనలో తెలిపింది. బోర్డు సమావేశంలో దేశీ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులను, సవాళ్లను కూడా సమీక్షించినట్లు పేర్కొంది. 2022–23లో ఆర్‌బీఐ పనితీరును చర్చించి, వార్షిక నివేదికను ఆమోదించారు.

జొమాటో నష్టాలు తగ్గాయ్



న్యూఢిల్లీ: ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ దిగ్గజం జొమాటో గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర నష్టం దాదాపు సగానికి తగ్గి రూ. 188 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2021–22) ఇదే కాలంలో రూ. 360 కోట్ల నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,212 కోట్ల నుంచి రూ. 2,056 కోట్లకు జంప్‌చేసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,702 కోట్ల నుంచి భారీగా పెరిగి రూ. 2,431 కోట్లను తాకాయి. ఇక మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర నష్టం రూ. 1,226 కోట్ల నుంచి తగ్గి రూ. 971 కోట్లకు పరిమితమైంది. మొత్తం ఆదాయం రూ. 7,079 కోట్లకు జంప్‌చేసింది. 2021–22లో రూ. 4,192 కోట్ల ఆదాయం నమోదైంది. ఫుడ్ డెలివరీ బిజినెస్ సీఈవోగా రాకేష్ రంజన్, సీవోవోగా రిన్షుల్ చంద్రను ఎంపిక చేసినట్లు జొమాటో పేర్కొంది. జొమాటో హైపర్‌ప్యూర్ సీఈవోగా రిషి అరోరాను నియమించినట్లు తెలియజేసింది.

మార్చిలోగా ఒలెక్ట్రా కొత్త ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ కొత్త ప్లాంటు నిర్మాణాన్ని 2024 జనవరి–మార్చిలోగా పూర్తి చేయాలని కృతనిశ్చయంతో ఉంది. మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) అనుబంధ కంపెనీ అయిన ఒలెక్ట్రా.. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపూర్ ఇండస్ట్రియల్ పార్కులో 150 ఎకరాల విస్తీర్ణంలో దీనిని స్థాపిస్తోంది. ప్లాంటు కోసం రూ.800 కోట్ల నిధులను సమీకరించాలన్న కంపెనీ ప్రతిపాదనకు బోర్డు సైతం ఆమోదం తెలిపింది. తొలి దశలో ఏటా 5,000 యూనిట్ల ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేసే సామర్థ్యంతో కొత్త ప్లాంటు రానుంది. ఈ సామర్థ్యాన్ని 10,000 యూనిట్ల స్థాయికి చేర్చవచ్చు. ప్రస్తుత వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 1,500 యూనిట్లు. ఈ ఏడాది మార్చి నాటికి ఆర్డర్ బుక్ 3,394 యూనిట్లుగా ఉంది.

3 రోజుల నష్టాలకు చెక్



ముంబై: వారాంతాన దేశీ స్టాక్ మార్కెట్లు కోలుకున్నాయి. దీంతో మూడు రోజుల వరుస నష్టాలకు చెక్ పడింది. సెన్సెక్స్ 298 పాయింట్లు జంప్‌చేసి 61,730 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73 పాయింట్లు ఎగసి 18,203 వద్ద నిలిచింది. అయితే ఇంట్రాడేలో మార్కెట్లు ఆటుపోట్లకు లోనయ్యాయి. సెన్సెక్స్ 61,785 వద్ద గరిష్టాన్ని, 61,252 దిగువన కనిష్టాన్ని తాకింది. వెరసి 530 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ఇక నిఫ్టీ 18,218– 18,060 పాయింట్ల మధ్య హెచ్చుతగ్గులు చవిచూసింది. విదేశీ మార్కెట్లలో సానుకూల ట్రెండ్‌కుతోడు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు దేశీయంగా సెంటిమెంటుకు బలాన్నిచ్చినట్లు నిపుణులు పేర్కొన్నారు. యూఎస్ రుణ పరిమితి ఒప్పందం కుదరవచ్చన్న అంచనాలు వారాంతాన ప్రపంచ మార్కెట్లకు జోష్‌నిచ్చినట్లు తెలియజేశారు.

ఐటీ జూమ్: ఎన్ఎస్ఈలో ప్రధానంగా ఐటీ ఇండెక్స్ 1.5% పుంజుకోగా.. రియల్టీ, ఆటో, బ్యాంకింగ్ 0.5% స్థాయిలో బలపడ్డాయి. ఫార్మా 1%నీరసించింది. నిఫ్టీ దిగ్గజాలలో అదానీ ద్వయం, టాటా మోటార్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ 3–1 శాతం మధ్య ఎగశాయి. అయితే దివీస్, బ్రిటానియా, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, హీరోమోటో, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, యూపీఎల్, ఏషియన్ పెయింట్స్, డాక్టర్ రెడ్డీస్, టైటన్ 2–0.7 శాతం మధ్య క్షీణించాయి. కాగా.. అదానీ గ్రూప్‌లోని లిస్టెడ్ షేర్లన్నీ లాభాలతో ముగియడం గమనార్హం!

చిన్న షేర్లు బలహీనం

మార్కెట్లు బలపడినప్పటికీ చిన్న షేర్లు అటూఇటుగా ట్రేడయ్యాయి. బీఎస్ఈలో 1,892 షేర్లు నష్టపోగా.. 1,576 లాభపడ్డాయి. గురువారం రూ. 970 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విదేశీ ఇన్వెస్టర్లు వారాంతాన స్వల్పంగా రూ. 113 కోట్ల విలువైన స్టాక్స్ విక్రయించారు. అయితే దేశీ ఫండ్స్ రూ. 1,071 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి.

లైఫ్@360



వేసవిలో తలకి ఎక్కువ చెమట పట్టడం, దానికితోడు వాతావరణ కాలుష్యం వల్ల తల తొందరగా మురికిపడుతుంది. అందువల్ల తరచు తలస్నానం చేయాలి. అలా తలస్నానం చేయకపోవడం వల్ల అంతకుముందు చుండ్రు లేనివారికి చుండ్రు వచ్చే అవకాశం ఉంది. ముందే చుండ్రు ఉన్నవారిని ఆ సమస్య మరింతగా వేధిస్తుంది. చుండ్రు సమస్యను తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలున్నాయి. అవేంటో తెలుసుకుందాం.

ఎండలు... చుండ్రు తగ్గేదెలా..?

వేసవిలో చాలామందిని చుండ్రు సమస్య వేధిస్తుంటుంది. తలలో అమితంగా పొట్టు చేరడం, తలంతా దురద.. ఈ సమస్యలు ఎండాకాలంలో కాస్త ఎక్కువుంటాయి. అలాంటపుడు ఇంట్లోనే కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు.

అవేమిటో చూద్దాం...

- వేప నూనె లేదా వేప ఆకులను గుజ్జుగా చేసి తలకు పట్టించాలి. గంట తరువాత తలస్నానం చేయాలి. దీనివల్ల చుండ్రు సమస్యే కాదు, దురద కూడా తగ్గుతుంది.
- నాలుగు స్పూన్ల గోరువెచ్చని కొబ్బరి నూనెలో అరచెంచా నిమ్మరసం కలపాలి. దీన్ని తలకు పట్టించి గంట తరువాత గాఢత తక్కువగా ఉన్న షాంపూతో తలస్నానం చేయాలి.

పెరుగు కూడా బాగానే పని చేస్తుంది. కప్పు పెరుగును తలంతా పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి. ఇలా వారానికి ఒకసారి చేసినా చాలు.

- కలబంద గుజ్జును తలకు పట్టించినా ఫలితం ఉంటుంది. అలోవెరా జెల్ ను కుదుళ్లకు పట్టించి అరగంట తరువాత తలస్నానం చేయాలి.
- పావు కప్పు యాపిల్ సిడార్ వెనిగర్‌ను పావు కప్పు నీళ్లలో కలపాలి. ఈ మిశ్రమాన్ని జుట్టు తడిగా ఉన్నపుడు మాడుకు పట్టించాలి. అరగంట అయ్యాక తలస్నానం చేయాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయొచ్చు.

చుండ్రు ఎందుకు వస్తుంది?

- చుండ్రుకు ప్రధాన కారణం మానసిక ఒత్తిడి, నిద్రలేమి. అయితే ఎండాకాలంలో చెమట వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లు, ఈస్ట్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది.
- షాంపూను ఎక్కువగా వాడటం వల్ల మాడు పొడబారుతుంది. దీనివల్ల చుండ్రు సమస్య వస్తుంది.
- కొందరికి జడను గట్టిగా బిగించి కట్టుకోవడం అలవాటు. అయితే అలా జుట్టును బిగుతుగా అల్లుకోవడం వల్ల గాలి తగలక సమస్య తీవ్రమవుతుంది.
- ఎక్కువగా ఎండలో తిరగడం వల్ల జుట్టు పొడిబారుతుంది. అందువల్ల తల మీద ఎండపడకుండా తలను కవర్ చేసేందుకు ఏమైనా వాడాలి.
- చెమట వల్ల చికాకుగా ఉండి ఎక్కువసార్లు తలస్నానం చేస్తుంటాం. దీనివల్ల కూడా చర్మం పొడిబారి చుండ్రు సమస్య వస్తుంది.

ఇవి పాటించాలి

- వారానికి మూడుసార్లు తలస్నానం చేయాలి. ముఖ్యంగా ఎండాకాలంలో మాడునుంచి నూనెలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. దీనివల్ల దుమ్ము, దూళి చేరి చుండ్రు ఎక్కువవుతుంది.
- తరచూ తల ముట్టుకోకూడదు. అంటే తలలో చేతులు పెట్టి గోక్కోకూడదు. చుండ్రు వల్ల దురద వస్తుంది. దాంతో తరచూ తలలో చేయి పెట్టడం వల్ల ఇన్ఫెక్షన్ ఎక్కువవుతుంది. సమస్య ఇంకాస్త పెరుగుతుంది.
- ఎండాకాలంలో హెయిర్ స్టైలింగ్ కోసమని క్రీములు, స్ప్రేలు ఎక్కువగా వాడితే అవి మాడును పొడిబారేలా చేసి చుండ్రును పెంచుతాయి.
- వారానికి ఒకసారైనా ఏదైనా ఆయిల్‌తో కుదుళ్లకు బాగా మర్దనా చేసుకోవాలి. దీనివల్ల మంచి రక్త సరఫరా జరుగుతుంది. మాడులో ఉండే చర్మ కణాల పనితీరు మెరుగుపడి చుండ్రు సమస్య తగ్గే అవకాశం ఉంది.

హెల్త్ టిప్స్







డస్ట్ అలర్జీని తగ్గించుకోవడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగపడుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో రెండు చెంచాల ఆపిల్ సైడర్ వెనిగర్ కలుపుకుని తాగాలి. ఇందులో కొన్ని చుక్కల తేనె కూడా కలుపుకోవచ్చు. ఆపిల్ సైడర్ వెనిగర్?లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలు అలర్జీని తగ్గించడంలో సహాయపడతాయి. అలర్జీని తగ్గించుకునేందుకు యూకలిప్టస్, లావెండర్ నూనె ఉపయోగించవచ్చు. వేడి నీటిలో 4–5 చుక్కల యూకలిప్టస్, లావెండర్ నూనెను వేసి పీల్చుకోవాలి. ఈ రెండు నూనెలు మంట, నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

ప్రకృతిలో తేనెటీగల వంటి చిరుప్రాణులు లేకపోతే మన మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. మొక్కల్లో పూలు కాయలుగా మారడానికి పరాగ సంపర్కమే కారణం. ఈ ప్రక్రియకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపకరిస్తూ పంటల ఉత్పాదనలో ఈ చిరుప్రాణులు తోడ్పడటం వల్లనే మనం మూడు పూటలా తినగలుగుతున్నాం. మనం తింటున్న ప్రతి మూడో ముద్ద ముఖ్యంగా తేనెటీగల పుణ్యమే. తేనెటీగలు లేకపోతే ఎన్నో రకాల పంటలు పండవు. అందుకే, తేనెటీగలు అంతరిస్తే నాలుగేళ్లలోనే మానవ జాతి అంతరిస్తుంది అన్నాడో మహనీయుడు. తేనెటీగల ఉసురు తీస్తున్న పురుగుమందులు, కలుపుమందులు, పచ్చదనం కొరత, వ్యాధి కారక క్రిముల విజృంభణ వంటి సమస్యలకు ఇప్పుడు అదనంగా 'వాతావరణ మార్పులు'తోడయ్యాయి. అందువల్ల కరువు, కుంభవృష్టి వంటి వాతావరణ మార్పు ప్రభావాల నుంచి మనల్ని మనం కాపాడుకుంటూ తేనెటీగలను సైతం కనిపెట్టుకుని ఉండాలి.

- సాక్షి సాగుబడి డెస్క్



తేనెటీగల మనుగడను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత

వాటి పెంపకాన్ని ప్రోత్సహిస్తే పరిఢవిల్లే జీవవైవిధ్యం

నేడు అంతర్జాతీయ తేనెటీగల దినోత్సవం

ప్రతి మూడో ముద్ద తేనెటీగలు పెడుతున్నదే!

మనం ఏం చేయగలం?

- అటవీ ప్రాంతాలను నాశనం చేయకుండా ఉండటం..
- గ్రామీణ ప్రాంతాల్లో పొలాల గట్ల మీద రకరకాల స్థానిక రకాల పూల మొక్కల్ని పెంచటం..
- నగరాలు, పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లో, మిద్దె తోటల్లో, పెరటి తోటల్లో, ముఖ్యంగా రోడ్ల పక్కన ఖాళీ జాగాల్లో కూడా మొక్కల తోపాటు స్థానిక జాతుల పూల మొక్కల్ని విస్తృతంగా పెంచటం..
- రసాయనిక పురుగు మందులు, కలుపు మందులు చల్లకుండా ఉండటం..
- తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహించటం వంటి పనులను మనం చేస్తుంటే జీవ వైవిధ్యం పరిఢవిల్లుతుంది. తేనెటీగల వంటి చిరు జీవులు మనుగడ సాగిస్తాయి. మనల్ని రక్షిస్తాయి..

20,000
ప్రకృతిలో ఉన్న తేనెటీగల జాతులు..

మొక్కల్లో పరాగ సంపర్కానికి, తద్వారా ప్రకృతి పచ్చదనానికి దోహదపడుతున్న జీవులు

సీతాకోకచిలుక, చిమ్మట, కందిరీగ, పెంకు పురుగు, పక్షి, గబ్బిలం

16.5% పరాగ సంపర్కానికి దోహదపడే.. అంతరించి పోయే ముప్పు ఎదుర్కొంటున్న సకశేరుక (వెన్నెముక ఉన్న) జాతులు

40% అంతరించి పోతున్న తేనెటీగలు, సీతాకోక చిలుకలు వంటి అకశేరుక (వెన్నెముక లేని) జాతులు

తేనెటీగలు తదితర కీటకాల పరాగసంపర్కమే ఆధారం.

90% పుష్పించే అడవి మొక్కలు/చెట్లలో తేనెటీగలు/జంతువుల పరాగసంపర్కంపై ఆధారపడుతున్నవి.

75% ప్రపంచ వ్యాప్తంగా పరాగ సంపర్కంపై ఆధారపడి ఉన్న ఆహార పంటలు.

తేనెటీగలు.. కొన్ని వాస్తవాలు

- తేనెటీగ సగటు జీవితకాలం పనిచేసే కాలంలో సుమారు 1.5 నెలలు; పని లేని సీజన్‌లో సుమారు 2.5 నెలలు. ● అర కిలో తేనె ఉత్పత్తికి 556 తేనెటీగలు పని చేయాల్సి ఉంటుంది.
- తేనెటీగల సంతతి వసంత రుతువులో 15,000 ఉంటుంది. వేసవిలో 80,000 వరకు ఉంటుంది.
- 2021లో ప్రపంచవ్యాప్తంగా సహజంగా ఉత్పత్తయిన తేనె: 1.77 మిలియన్ మెట్రిక్ టన్నులు

పరాగసంపర్కంపై ఆధారపడేది ఎంత?

బాదం	ఉల్లి	గుమ్మడి	ఆపిల్	మామిడి	పుచ్చకాయ	ఆవాలు	సన్‌ఫ్లవర్
100%	90-100%	90-100%	80-100%	80-100%	70-100%	50-100%	50-100%

(ఆధారం: ఐరాసకు చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ గణాంకాలు)

ఏపీ హైకోర్టు తాత్కాలిక సీజేగా జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి



సాక్షి, అమరావతి : ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే)గా సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో జస్టిస్ శేషసాయి నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే)గా ఉన్న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హైకోర్టుకు పూర్తిస్థాయి సీజే నియమితులయ్యేంత వరకు జస్టిస్ శేషసాయి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కొనసాగుతారు.

యాదాద్రిలో హైకోర్టు జడ్జి పూజలు



హైకోర్టు జడ్జి జస్టిస్ సురేందర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామిని శుక్రవారం రాత్రి హైకోర్టు జడ్జి జస్టిస్ కె.సురేందర్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ ఆచార్యులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ట అలంకారమూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. జస్టిస్ సురేందర్‌కు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

జూలై 8న టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ పరీక్ష

సాక్షి, హైదరాబాద్: ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో రద్దయిన పరీక్షల నిర్వహణకు సంబంధించి తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) శుక్రవారం కీలక ప్రకటన చేసింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోని డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ అండ్ కంట్రీ ప్లానింగ్ విభాగంలో టౌన్‌ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్ ఉద్యోగాల అర్హత పరీక్షను జూలై 8వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నిర్దేశించిన తేదీన రెండు పేపర్లను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో సీబీఆర్‌టీ పద్ధతిలో జరపనున్నట్లు తెలిపింది. పశు సంవర్ధకశాఖ పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ఉద్యోగ అర్హత పరీక్షలను జూలై 13, 14వ తేదీల్లో నిర్వహించనుంది. 13వ తేదీ ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లు, 14 మధ్యాహ్నం ఒక సెషన్ సీబీఆర్‌టీ పద్ధతిలో జరపనున్నట్లు తెలిపింది. హాల్‌టికెట్లను పరీక్షకు వారం ముందు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచిస్తూ టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఢిల్లీకి నేతల క్యూ

రాష్ట్ర నేతలతో వేర్వేరుగా అమిత్‌షా, సునీల్ బన్సల్ భేటీ

- నాలుగైదు రోజులుగా పలువురు నేతలు దేశ రాజధానికి..
- రాష్ట్ర బీజేపీ అధ్యక్ష బాధ్యతలపై అభిప్రాయ సేకరణ?
- బండిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవచ్చనే ప్రచారం
- జూన్ 2కు ముందే కీలక ప్రకటనలు వచ్చే చాన్స్



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: కర్ణాటకలో ఓటమితో అప్రమత్తమైన బీజేపీ అధినాయకత్వం అది పునరావృతం కాకుండా ఉండేందుకు తెలంగాణపై పూర్తి ఫోకస్ పెట్టింది. నాలుగైదు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందున పార్టీ నాయకులు, యంత్రాంగం ఐకమత్యంతో ముందుకు సాగే విషయంపై దృష్టి కేంద్రీకరించింది. ఇందులో భాగంగా సీనియర్–జూనియర్లు, కొత్తగా పార్టీలో చేరినవారు– గతం నుంచి పార్టీలో ఉన్న వారు, ముఖ్యనేతల మధ్య అంతరం లేకుండా ఉండేందుకు కసరత్తు చేస్తోంది. తెలంగాణలో బీజేపీ గెలుపుపై విశ్వాసం కలిగించేందుకు సీనియర్లతో వేర్వేరుగా సమాలోచనలు సాగిస్తోంది. ఇప్పటికే బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్‌తో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జి సునీల్ బన్సల్ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ఢిల్లీలోనే ఉన్న జాతీయ కార్యవర్గసభ్యుడు జి.వివేక్ వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండావిశ్వేశ్వర్‌రెడ్డితోనూ ఆయా విషయాలపై మాట్లాడారు. శుక్రవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్ సైతం ఢిల్లీ చేరుకున్నారు. అయితే ఆయన వ్యక్తిగత పనుల నిమిత్తమే వచ్చారని పార్టీ నాయకులు చెబుతున్నప్పటికీ... కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ముఖ్యనేతల నుంచి జరుపుతున్న అభిప్రాయసేకరణలో భాగంగానే బండికి పిలుపు వచ్చి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కొత్త అధ్యక్షుడు.. కొత్త కేబినెట్

కర్ణాటకలో ఓటమి నేపథ్యంలో తెలంగాణలో గెలుపునకు అవసరమయ్యే అన్ని వ్యూహాలను పార్టీ అధినాయకత్వం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగానే పార్టీకి కొత్త అధ్యక్షుడితోపాటు, కొత్త ఎన్నికల కమిటీ చైర్మన్, ప్రచార కమిటీ చైర్మన్లు రానున్నారని ఢిల్లీ పార్టీ వర్గాలు బలంగా చెబుతున్నాయి. ఒకవేళ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని మారిస్తే ఆయన్ను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. రానున్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్తాన్ ఎన్నికలను సైతం దృష్టిలో పెట్టుకొని కేబినెట్ బెర్తుల భర్తీ ఉంటుందని, అందులోభాగంగానే తెలంగాణ నుంచి సంజయ్‌కు అవకాశం ఇస్తారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన్ను శుక్రవారం ఢిల్లీ పిలిపించారని, ఆయన ఢిల్లీలోని కొందరు పెద్దలను కలిసి తన అభిప్రాయాన్ని చెప్పినట్లుగా తెలుస్తోంది.

కీలక బాధ్యతల అప్పగింతపై దృష్టి

తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ పటిష్టత, నేతలకు కీలక బాధ్యతల అప్పగింతపై దృష్టి పెట్టిన బీజేపీ అధినాయకత్వం కార్యాచరణలో వేగం పెంచింది. పార్టీ అధ్యక్ష బాధ్యతలు సహా ఇతర కీలక పోస్టుల్లో నియామకాలకు సంబంధించి రాష్ట్ర నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తోంది. కులాలు, ప్రాంతాలు, వర్గాలు, సీనియార్టీ, అనుభవం ఆధారంగా లెక్కలు వేసుకుంటున్న పార్టీ ఎవరికి ఏ పదవి కట్టబెట్టాలన్న దానిపై వివరాలు తీసుకుంటోంది. మరో రెండ్రోజులపాటు అందరి అభిప్రాయాలను తెలుసుకున్నాక జూన్ 2కి ముందే నియామకాలపై కీలక ప్రకటన చేస్తారని భావిస్తున్నారు. అలాగే, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు సహా ఇతర నేతల చేరికల విషయంలో హైకమాండ్ భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందని రాష్ట్ర నేతలు చెప్పినట్లు తెలుస్తోంది.

పిల్లనగ్రోవి, పింఛం తొలగింపు!

ఎన్టీఆర్ విగ్రహంలో మార్పులు



ఖమ్మం లకారం ట్యాంక్ బండ్‌పై శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాట్లపై పలువురు కోర్టును ఆశ్రయించడంతో.. నిర్వాహకులు విగ్రహంలో మార్పులకు సిద్ధమయ్యారు.ఈ మేరకు శుక్రవారం నిజామాబాద్ నుండి వచ్చిన కళాకారులు ఎన్టీఆర్ చేతిలోని పిల్లనగ్రోవి, కిరీటంపై ఉన్న పింఛం, కిరీటం వెనుక చక్రాన్ని తొలగించారు. ఈ మార్పులను కోర్టు దృష్టికి తీసుకెళ్లి ముందుగా నిర్ణయించినట్లు ఈనెల 28నే ఆవిష్కరణకు ప్రయత్నిస్తున్నామని నిర్వాహకుడు దొడ్డా రవి వెల్లడించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం

అలవెన్స్ చర్చలు సఫలం

- బొగ్గు గని కార్మికులకు అన్ని అలవెన్స్‌లపై 25 శాతం పెంపు
- కోల్‌కతాలో జరిగిన సమావేశం
- హాజరైన కోలిండియా చైర్మన్, సింగరేణి అధికారులు, కార్మిక నేతలు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గోదావరిఖని(రామగుండం): దేశవ్యాప్త బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం 10వ సమావేశం శుక్రవారం కోల్‌కతాలో జరిగింది. యాజమాన్యం జరిపిన చర్చల్లో అన్ని అలవెన్స్‌లపై 25శాతం పెంచేందుకు అంగీకారం కుదిరినట్లు జాతీయ కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. అండర్ గ్రౌండ్ అలవెన్స్ 9 నుంచి 11.25 శాతం, స్పెషల్ అలవెన్స్ 4 నుంచి 5 శాతం, హెచ్‌ఆర్‌ఏ 2 నుంచి 2.5, ఎల్‌టీసీ రూ.8వేల నుంచి రూ.10వేలు, ఎల్ఎల్‌టీసీ రూ.12 వేల నుంచి రూ.15వేలు పెంచడానికి అంగీకారం కుదిరింది. సెలవులు, సిక్ లీవ్‌లు 120 నుంచి 150 అక్యుములేషన్ చేసుకోవడానికి, అంబేద్కర్ జయంతిని పెయిడ్ హాలిడేగా అంగీకరించారు. లైవ్ రోస్టర్‌లో ఉన్న అమ్మాయిలకు 18ఏళ్లు వచ్చే వరకు డిపెండెంట్ జాబ్ అవకాశం కల్పించనున్నారు. నైట్ షిఫ్ట్ అలవెన్స్ మస్టర్‌కు రూ.50 చెల్లించనున్నారు. నర్సింగ్ అలవెన్స్ నెలకు రూ.500 ఇవ్వనున్నారు. కార్మికుడు..కార్మికుని భార్య చనిపోయి పిల్లలు అనాథలైతే వారికి సగం జీతం, 18ఏళ్లు దాటితే ఉద్యోగం కల్పిస్తారు. గతంలో జరిగిన ఒప్పందం ప్రకారం 19శాతం మినిమం గ్యారెంటెడ్ బెనిఫిట్, 3శాతం ఇంక్రిమెంట్‌తోపాటు ఒప్పుకున్న డిమాండ్లను శనివారం డ్రాఫ్ట్ రూపంలో పొందుపరుస్తారు. సమావేశాన్ని శనివారం కూడా కొనసాగించనున్నారు. సమావేశంలో కోలిండియా చైర్మన్ ప్రమోద్ అగర్వాల్, సింగరేణి డైరెక్టర్(పా) బలరాం, పర్సనల్ జీఎం కుమార్‌రెడ్డి, జేబీసీసీఐ వేజ్‌బోర్డు మెంబర్లు ఏఐటీయూసీ నుంచి వాసిరెడ్డి సీతారామయ్య, ఐఎన్‌టీయూసీ నుంచి జనక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.